# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 3 - సంచిక 1 అక్టోబరు 2024 వెల : రూ.15

సనాతన ధర్మం హీరోగా పవన్

మతోన్మాదాన్ని ఎదిరించిన మహాత్ముడు

ఒక దేశం.. ఒకే ఎన్నిక.. ఎవరి కోసం..

జమిలి ఎన్నికల వెనక మోదీ పద్మవ్యూహం

జమిలి ఎన్నికలదారి ఎటు వైపు ?

అసమానతల తలమే కులం

కేంద్రానికి వక్ఫ్‌పై కన్నెందుకు పడింది?

దారి చూపగలది.. వ్యవసాయానికి సాయమే !

ఖనిజ సంపద ప్రజలదే !

తీరం దాటనున్న సరికొత్త సనాతన 'తుఫాన్'

మన సంస్కృతి

శ్రీలంకకు ఆశాకిరణం దిసనాయకే

మద్రాసు ప్రెసిడెన్సీలోని సంస్కరణోద్యమాలపై ప్రొఫెసర్ పి.లక్ష్మీనరసు ప్రభావం

చారిత్రక గమనాన్ని చూపిన 'ప్రజాస్వామ్య ప్రస్థానం'

కమ్యూనిస్టు ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనం కామ్రేడ్ సీతారాం ఏచూరి

తెలంగాణ సాయుధ పోరాటం గర్వకారణమైన జ్ఞాపకం

విశాఖలో దాశరథి శత జయంతి సభ

అక్టోబరు - 2024

పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 1

డీవీవీఎస్ వర్మ

- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణమూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) సనాతన ధర్మం హీరోగా పవన్
- సంపాదకీయం 3

2) మతోన్మాదాన్ని ఎదిరించిన మహాత్ముడు
- వి.రాంభూపాల్ 4

3) ఒక దేశం.. ఒకే ఎన్నిక.. ఎవరి కోసం..
- ఆచార్య మాడభూషి శ్రీధర్ 6

4) జమిలి ఎన్నికల వెనక మోదీ పద్మవ్యూహం
- డివియస్ వర్మ 9

5) జమిలి ఎన్నికలదారి ఎటు వైపు ? - కేశవ్ 11

6) అసమానతల తలమే కులం
- రామ్ పునియానీ 13

7) కేంద్రానికి వక్ఫ్‌పై కన్నెందుకు పడింది?
- సలీమ్ పాష 14

8) దారి చూపగలది.. వ్యవసాయానికి సాయమే !
- డి.పాపారావు 16

9) ఖనిజ సంపద ప్రజలదే ! -డా ॥ కొల్లా రాజమోహన్ 18

10) తీరం దాటనున్న సరికొత్త సనాతన 'తుఫాన్' - అశోక్ కుంబము 20

11) మన సంస్కృతి - దేవరకొండ బాలగంగాధర తిలక్ 21

12) శ్రీలంకకు ఆశాకిరణం దిసనాయకే - బుడ్డిగ జమిందార్ 23

13) మద్రాసు ప్రెసిడెన్సీలోని సంస్కరణోద్యమాలపై ప్రొఫెసర్ పి.లక్ష్మీనరసు ప్రభావం
- టి.రవిచంద్ 27

14) చారిత్రక గమనాన్ని చూపిన 'ప్రజాస్వామ్య ప్రస్థానం' - డి.హనుమంతరావు 30


15) కమ్యూనిస్టు ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనం కామ్రేడ్ సీతారాం ఏచూరి
- కొండూరి వీరయ్య 31

16) తెలంగాణ సాయుధ పోరాటం గర్వకారణమైన జ్ఞాపకం
- సురవరం సుధాకర్‌రెడ్డి 36

17) విశాఖలో దాశరథి శత జయంతి సభ - డాక్టర్ సీఎన్ క్షేత్రపాల్‌రెడ్డి 40

18) కార్టూన్స్ 43

19) కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# సనాతన ధర్మం హీరోగా పవన్

పవన్ కల్యాణ్ సినిమాలలో అనేక హీరో పాత్రలు పోషించారు. రాజకీయాలలోనూ ఆయన బహుపాత్రధారి కావడం ఆశ్చర్యాన్ని కలిగించదు. రాజకీయ ఆరంగేట్రం చేసినప్పుడు 'చే గువేరా'గా మన ముందుకు వచ్చారు. తర్వాత భగత్‌సింగ్ తన ఆదర్శం అన్నారు. ఇప్పుడు తాజాగా సనాతన ధర్మం హీరోగా పాత్రధారణ చేశారు. పూజలు, ప్రాయశ్చిత్తాలు, దైవ దర్శనం పూర్తి చేసుకుని తిరుపతి వారాహి సభలో సనాతన ధర్మం చిత్రం ట్రయిలర్‌ను రిలీజ్ చేశారు. యధావిధిగా సినిమా షూటింగ్‌లకు, ఉప ముఖ్యమంత్రి బాధ్యతలకు ఇచ్చే కాల్‌షీట్స్ కంటే ఈ సనాతన ధర్మానికి ఎక్కువ ఇచ్చేలా ఆయన ప్రసంగం సాగింది. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి దగ్గర ప్రారంభమై అనేక మలుపులతో క్లయిమాక్స్‌కు చేరింది. సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని ఈ సభలో ప్రకటిస్తూ అలాంటి వారికి సహాయ నిరాకరణ చేయాలని పిలుపునిచ్చారు. సనాతన పరిరక్షణ బోర్డును చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలని, దానిని కించపరిచే వారిని శిక్షార్హులను చేయాలని ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి.

సనాతన ధర్మం మీద పైపై డైలాగులు తప్పిస్తే నిర్దిష్టంగా సనాతన ధర్మం ఏమిటన్న స్పష్టత ఇవ్వలేదు. ఆయన సనాతన ధర్మాన్ని వేద ప్రమాణంగా భావించివుంటే రుగ్వేదంలోని పురుష సూక్తం వుంది. మనుషుల పుట్టుకలో వున్న వివక్షను అది నొక్కి చెప్పింది. కొందరు శిరస్సు నుంచి, బాహువుల నుంచి, ఊరువుల నుంచి, పాదాల నుంచి పుట్టినట్లు పేర్కొంది. వేద ప్రమాణంగా పుట్టుకతో వివక్షను సమర్థించిన సనాతన ధర్మాన్ని పవన్ అంగీకరిస్తారా ?

సనాతన ధర్మానికి ప్రాణప్రదమైన 'మనుస్మృతి' కుల వ్యవస్థను, కులాల చట్రంలో వృత్తులను నిర్దేశించింది. స్త్రీలకు స్వాతంత్ర్యాన్ని నిరాకరించింది. ఈ సనాతన ధర్మాన్నే పవన్ కోరుకుంటున్నారా ? అలాగే భగవద్గీతలో నాలుగు వర్ణాలను నేనే సృష్టించానని శ్రీ కృష్ణ పరమాత్మ ప్రకటించడాన్ని సనాతన ధర్మంగానే పవన్ భావిస్తున్నారా ? సనాతన ధర్మంలో అందరికీ చదువుకునే స్థితి నిరాకరించబడింది.

పవన్ కల్యాణ్ తన దీక్ష సందర్భంగా కాషాయ వస్త్రం ధరించారు. ఇది సనాతన ధర్మం రంగు కాదు. బౌద్ధుల నుంచి హిందూమతాచార్యులు ఈ కాషాయాన్ని తస్కరించారు. వాస్తవానికి బౌద్ధం సనాతన ధర్మం మీద తిరుగుబాటు చేసింది. వివాహ బంధంలో విడాకులు అన్నది ఆధునిక భావన. కాని, సనాతన ధర్మంలో విడాకులు అన్న పదమే లేదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచించారు. కులాంతర, మతాంతర, జాతీయాంతర, వివాహాలను సనాతన ధర్మం నిషేధించింది. సనాతన ధర్మం పేరుతో పవన్ వీటిని సమర్థిస్తారా ?

మన సమాజం అనేక దశలను దాటి ప్రజాస్వామ్యాన్ని చేరుకుంది. ఇప్పుడు కుల వివక్షకీ, లింగ వివక్షకీ తావులేదు. చదువుకునే హక్కు అందరికీ వచ్చింది. కుల చట్రంలో వృత్తుల బిగింపు సడలిపోయింది. ఇవన్నీ సనాతన ధర్మాన్ని సంస్కరించడం ద్వారా సాధ్యమైంది. దీని కోసం సనాతన ధర్మంలోని వివక్ష మీద ఉద్యమాలు, సంస్కరణలు విమర్శలు జరిగిన చరిత్ర మనకు వుంది. తిరుపతి వారాహి సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారితో పేచీ పెట్టుకోవడానికే ఇక్కడకు వచ్చానని ప్రకటించారు. ఆయన ఎలాంటి దారి ఎంచుకుంటారో ఆయన ఇష్టం. మను ధర్మ శాస్త్రాన్ని బహిరంగంగా తగులపెట్టిన అంబేద్కర్‌తో ఆయన పేచీ పెట్టుకోవచ్చు. అన్నీ వేదాల్లోనే ఉన్నాయష అని సనాతన ధర్మాన్ని ఎద్దేవా చేసిన గురజాడతో, సనాతనంపై తిరుగుబాటు చేసిన వీరేశలింగంతో, త్రిపురనేని రామస్వామి వగైరాలతో ఆయన పేచీ పెట్టుకోవచ్చు. పవన్ యుద్ధం ఇలాంటి వారి మీద మొదలు పెట్టి సనాతన ధర్మ హీరో కావచ్చు. కాని, పవన్ తన సనాతన ధర్మాన్ని వెతుకుతూ ఎంత వెనక్కి ప్రయాణించినా సమాజం మాత్రం వెనక్కు నడవదు. మరింత స్వేచ్ఛ కోసం, వివక్ష లేని సమాజం కోసం ముందుకే సాగుతుంది. ❑

**- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977**

# మతోన్మాదాన్ని ఎదిరించిన మహాత్ముడు




- వి.రాంభూపాల్

అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి. 125 సంవత్సరాల క్రితం నవ యవ్వనంలో రాజకీయాల్లోకి ప్రవేశించి బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడి, స్వాతంత్ర్య సాధనలో జాతిపితగా ప్రజల మన్ననలు పొంది, మతోన్మాద శక్తుల చేతు ల్లో ప్రాణాలు కోల్పోయిన అమరజీవి గాంధీ. ఆయన జీవితం స్థూలంగా ఒకవైపు దేశ సంపదను లూటీ చేసిన పరాయి పాలన పై, మరోవైపు ప్రజల మధ్య ఐక్యతకు చిచ్చుపెట్టే మతోన్మాదంపై పోరాడటంలో సాగింది. స్వాతంత్ర్యం వస్తే ఈ రెండు ప్రమాదా ల నుండి దేశ ప్రజలను కాపాడుకోగలమని ఆయన నమ్మాడు. అందుకోసం అహర్నిశలు శ్రమించాడు. గాంధీ కాలం నాటి ఆ రెండు ప్రమాదాలు ఈనాటికీ దేశ ప్రజలను మరింత తీవ్రంగా వెంటాడుతున్నాయి. ఆ రోజుల్లోలాగా సామ్రాజ్యవాదం నేడు ప్రత్యక్షంగా పాలించకపోవచ్చుకానీ, వారి విధానాల ఆదేశాలే (షరతులు) దేశ ఆర్థిక విధానాలుగా అమలవుతున్నాయి. అవి రాష్ట్రాలకు, మున్సిపాలిటీలకు, చివరకు పంచాయతీల వరకు విస్తరించాయి. సామ్రాజ్యవాద కంపెనీలతో దేశీయ కార్పొరేట్ కంపెనీలు మిలాఖత్ అయి గాంధీ కాలం నాటిలాగే దేశ సంపద ను, సహజ వనరులను లూటీ చేస్తున్నాయి. అర్థిక అంతరాలను, సామాజిక వివక్షలను పెంచుతున్నాయి. దేశాభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కుతున్నాయి. దేశ ప్రజల ఐక్యతను చీల్చి, సామ్రాజ్యవాదానికి తోడ్పడిన నాటి మతోన్మాద శక్తులు నేడు దేశ పాలకులుగా అవతరించి, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నాయి. గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు అర్పించే నివాళి ఒక తంతులాగా, యథాలాపంగా జరగరాదు. ఆయన ఎదిరించిన సామ్రాజ్యవాదం, మతోన్మాద వ్యతిరేక లక్ష్యాల దీక్షా దినంగా జరగాలి.

**గాంధీ-జీవితం**

గుజరాత్‌లోని కథియవార్ సంస్థానంలోని పోర్‌బందర్‌లో 1869 అక్టోబర్ 2న కరంచంద్ గాంధీ, పుతిలీభాయి దంపతుల కు గాంధీ జన్మించాడు. ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లి, న్యాయశాస్త్రం పూర్తయిన తర్వాత ఒక కేసు విషయమై దక్షిణాఫ్రికా వెళ్లి అక్కడి జాతి వివక్షపై సత్యాగ్రహం చేసి, భారత రాజకీయాల్లోకి ప్రవేశించాడు. గుజరాత్‌కు చెందిన దాదా అబ్దుల్లా దక్షిణాఫ్రికాలో వ్యాపారం చేసేవాడు. ఆయనకు అక్కడ వ్యాపార సమస్య వచ్చి కోర్టులో వ్యాజ్యం వేశాడు. ఈ కేసు వాదించడానికి యువ న్యాయవాది, అందునా విదేశాల్లో చదివిన



గాంధీని సంవత్సరం కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. ఆ రకంగా గాంధీ దక్షిణాఫ్రికాకు వెళ్లాల్సి వచ్చింది. అదే ఆయన జీవిత గమ్యాన్ని మార్చివేసింది. 1915లో భారతదేశానికి తిరిగి వచ్చిన వెంటనే జాతీయోద్యమంలో చేరలేదు. దేశ పరిస్థితులను, జాతీయ కాంగ్రెసు కార్యకలాపాలను పరిశీలించాడు. 1917–18 మధ్య కాలంలో మూడు ముఖ్యమైన ఆందోళనలను నిర్వ హించాడు. అందులో రెండు రైతాంగ సమస్యల మీద, ఒకటి కార్మిక సమస్యల మీద. బీహార్‌లోని చంపారన్‌లో బలవంతంగా బ్రిటిష్ అధికారులు రైతుల చేత నీలిమందు పండించేలా చేసు కున్న ఒప్పందంపై ఆయన ఆందోళన చేసి విజయం సాధిం చాడు. ఆ తర్వాత గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో ప్లేగు వ్యాధి వ్యాపించి ప్రభుత్వానికి శిస్తులు కట్టలేక రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆందోళన చేసి పన్నులు తగ్గించాడు. ఈ రెండూ బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక రైతాంగ ఉద్యమాలు. మూడోది, గుజరాత్‌లోని అలహాబాద్ మిల్లు కార్మికుల సమస్య. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో భారత పెట్టుబడిదారుల పరిశ్ర మల ఉత్పత్తులకు పెరిగిన డిమాండ్ వల్ల అదనపు పని చేయిం చుకోవడానికి కార్మికులకు కూలీలు పెంచారు. యుద్ధం ముగి సిన వెంటనే పెరిగిన వేతనాలను స్వదేశీ పెట్టుబడిదారులు తగ్గిం చివేశారు. దీనిపై కార్మికులు ఆందోళన చేబట్టారు. యజమాను లకు, కార్మికులకు గాంధీ మధ్యవర్తిత్వం నడిపినా ఫలించలేదు. దీంతో కార్మికులను సమ్మె చేయమని పిలుపునిచ్చాడు. సమ్మెకు మద్దతుగా దేశంలో మొదటి సత్యాగ్రహ దీక్ష చేపట్టాడు. ఈ మూడు ఉద్యమాల తర్వాత జాతీయ కాంగ్రెస్‌లో చేరి 1921 సెప్టెంబర్ 21న తన వేషధారణ మార్చుకున్నాడు. దీనిపై తొలి రోజుల్లో అనేక అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నా చివరి శ్వాస విడిచేవరకు అదే వేషధారణతో జీవించాడు.

**గాంధీ-మతం**

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆయన చేసిన ఉద్యమాలను మరో సందర్భంలో చర్చిద్దాం. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాదానికి వ్యతిరేకంగా ఆయన చేసిన కృషిని స్మరించుకోవడం నేటి తక్షణావసరం. మన రాష్ట్ర రాజకీయాలు కొన్ని వారాల క్రితం తిరుపతి లడ్డుతో ప్రారంభమై, మత సామరస్యాన్ని దెబ్బ తీసే విధంగా మారుతున్నాయి. పాలక ప్రతిపక్ష పార్టీల ప్రకటనలు రాష్ట్ర లౌకిక, ప్రజాస్వామిక శక్తులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. మతోన్మాద శక్తులకు కొత్త ఊపిరి పోసేవిధంగా వున్నాయి. ఈ సందర్భంలో గాంధీజీ మతం పట్ల అనుసరించిన వైఖరిని స్మరించుకోవడం అవసరం. 'మతం' అనే పదాన్ని రెండు అర్థాలలో వాడినట్లు ఆయన జీవిత ఆచరణ తెలుపుతుంది. ఒకటి, పైకి కనిపించే హిందూ మతం, ముస్లిం మతం, క్రిస్టియన్ మతం ఇలా అనేక మతాల ఆచారాలు. రెండు, మతం అంటే దైవంలో, సత్యంలో, ధర్మంలో విశ్వాసం కలిగివుండటం. ఈ రెండో అర్థంలో మతమనేది ఏ ఒక్క మతానికి పరిమితమైంది కాదు, సర్వ మతాల సారం. అంటే మనిషి జీవిత నైతిక నియమావళి. ఈ నైతిక విలువలు అన్ని మతాలలోనూ ఒకే విధంగా వున్నాయని ఆయన చెప్పాడు. దేశవ్యాప్తంగా పర్యటించే క్రమంలో, భారత ప్రజల మధ్య వున్న మతాతీత సంబంధాన్ని గమనించడం పెరిగే కొద్దీ మతం పట్ల తన అభిప్రాయాలను మరింత లౌకికంగా మలచుకున్నాడు. మొదట్లో ఆయన చెప్పిన 'దైవమే సత్యం' అనే అభిప్రాయాన్ని 'సత్యమే దైవం' అని మార్చుకోవడం ఇందులో భాగమే. "నిజమైన మతం, నిజమైన నైతికత ఒకదానితో ఒకటి విడదీయరాని విధంగా ముడిపడి వున్నాయి. నేలలో నాటిన విత్తనానికి నీరు ఎంత అవసరమో మతానికి నైతికత అంత అవసరం" అని గాంధీ బోధించాడు. నైతికత అంటే ఏమిటో ఆయన రవీంద్రనాథ్ టాగూర్‌కు 24-11-2021న రాసిన లేఖలో ఇలా వివరించారు. 'అసత్యం, క్రూరత్వం, విద్వేషం, ఆపుకోలేని ఉద్రేకం వున్నవాడు నైతికత కోల్పోయిన వాడవుతాడు. వాడికి మతం గురించి ఉచ్చరించే హక్కు లేదు' అదే లేఖలో 'మన కోరికలు, ఉద్దేశాలను స్వార్థం, నిస్వార్థం అనే రెండు రకాలుగా విభజించవచ్చు. స్వార్థపూరిత కోరికలన్నీ అనైతికమైనవి. అత్యున్నత నైతికత అంటే ఏమిటంటే మానవాళి మేలు కోసం నిరంతరం కృషి చేయడమే' అన్నాడు. గాంధీ బోధించిన నైతికత నేటి పాలక వర్గ రాజకీయ నాయకుల్లో లోపించింది. అందుకే వారు అబద్ధాల మీద, విద్వేషం మీద ఆధారపడి మానవాళికి విరుద్ధమైన స్వార్థపూరిత రాజకీయాలు చేస్తున్నారు. వ్యక్తిగత విశ్వాసంగా ఉండాల్సిన మతాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం ఎలా వక్రీకరిస్తారో ఆయన ఆనాడే ప్రజలను హెచ్చరించాడు. మతం అనే చెట్టుకు ఒకే మొదలు ఉంటుంది. అయితే ఆ మొదలుకు అనేక కొమ్మలు ఉన్నాయి. కానీ అది మానవ సమాజం మీదగా వెళ్తున్నప్పుడు అసహ్యంగా మారుతుంది' అన్నాడు. 'వేషాలను బట్టి, ఉచ్చరించే మాటలను బట్టి మత విశ్వాసి అని అనుకోలేమని, వారు ఆచరించే మార్గం ప్రజా సంక్షేమానికి ప్రమాదమా, దోహదమా అనే వాటిని బట్టి నిర్ణయించాలన్నాడు. ప్రజలందరూ కలిసి జీవిస్తున్నప్పుడు వారి సమస్యలు ఉమ్మడిగానే ఉంటాయి. మతాన్ని బట్టి సామాజిక సమస్యలు ఉండవు' అఅని జీవిత సత్యాన్ని ఆయన బోధించాడు. తాను స్వయంగా నిర్వహించిన 'హరిజన్' పత్రికలో 24-8-1947న మతానికి, రాజ్యానికి ఉండాల్సిన తేడాను ఇలా రాశాడు. 'నేనే గనుక నియంతనయితే మతం మరియు రాజ్యం వేరుగా ఉంచుతాను. నేను నా మతంపై ప్రమాణం చేస్తున్నాను. నేను దాని కోసం చనిపోతాను. అయితే అది నా వ్యక్తిగత వ్యవహారం. రాజ్యానికి (ప్రభుత్వానికి) దానికి సంబంధంలేదు' 'నాకే కనుక అధికారం ఉంటే, మతతత్వాన్ని ప్రోత్సహించే ఎత్తుగడతో రాసిన రచనలన్నిటినీ నిషేధిస్తా" అని ప్రకటించాడు.

కానీ ఈ రోజు పాలక వర్గ పార్టీలు చేస్తున్నది ఏమిటి? తరాలుగా ఏర్పడి జీవనవిధానంగా కొనసాగుతున్న మత సామరస్యానికి తీవ్ర ప్రమాదం తెచ్చేటట్లు మాట్లాడటం, వ్యవహరించడం పెరిగిపోతున్నది. ఆరు నెలలు కలిసి తిరిగితే వారు వీరవుతారన్నట్లు బిజెపితో స్నేహం చేసిన పవన్ కళ్యాణ్, చంద్రబాబు, బీహార్‌లో నితీష్ కుమార్ మతతత్వం వైపు అడుగులు వేస్తున్నారు. తెలిసి చేసినా, తెలియక చేసినా మతతత్వ భావజాల వ్యాప్తి అత్యంత ప్రమాదకరం. రాజకీయంగా అది కమలం పార్టీకే బలం చేకూరుస్తుంది తప్ప ప్రాంతీయ పార్టీలు బావుకునేది ఏమీ వుండదు. శివసేన, అన్నా డీఎంకె వంటి పార్టీల అనుభవం అదే! గాంధీజీ చెప్పినట్లు 'మత హింస లేకుండా మతతత్వ భావజాలం జీవిస్తుంది. కానీ ముందుగా మతతత్వ భావజాలం వ్యాప్తి జరగకుండా మత హింస వుండదు'. అందుకే 1939 చివరి నుండి ఆయన తుది శ్వాస వరకు ఈ మతతత్వాన్ని ఎదిరించాడు. 1945 నుండి దేశంలో పేట్రేగిన మతోన్మాద హింసపై ఆయన తీవ్రంగా కలత చెందాడు. 77 సంవత్సరాల వయసులో దాదాపు ఒంటరిగా మత హింస జరుగుతున్న బెంగాల్‌లోని నౌఖాలీ, బీహార్, కలకత్తా, ఢిల్లీలో మత సామరస్యం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడాడు. బీహార్ హిందువులు తమ పద్ధతులు మార్చుకోకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని 1946 నవంబర్ 6న హెచ్చరించాడు. 1947 జనవరిలో నౌఖాలీలో హిందువులపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా గ్రామ వీధుల్లో చెప్పులు లేకుండా పాదయాత్ర చేయడమే కాక, ఒక పేద ముస్లిం ఇంట కొన్ని రోజులపాటు నివసించాడు. గాంధీజీ, హిందూ మతోన్మాది గాడ్సే చేతిలో బలికావడం మతోన్మాద వికృత చేష్టకు పరాకాష్ట. ఎవరు, ఏ రూపంలో మతోన్మాదాన్ని పెంచి పోషించినా ప్రతిఘటించడమే ఆ మహాత్ముడికి ఇచ్చే నిజమైన నివాళి. ❑

# ఒక దేశం.. ఒకే ఎన్నిక.. ఎవరి కోసం..



తెలుగు సేత : డాక్టర్ సీఎన్ క్షేత్రపాల్‌రెడ్డి

**- ఆచార్య మాడభూషి శ్రీధర్**

ఒకే దేశం ఒకే ఎన్నికలు అనేది కేంద్రంలోని మోదీ ప్రభుత్వ తాజా ప్రాయోజిత ప్రతిపాదన. ఇదే అంశం మరోసారి తెరపైకి వస్తున్నది. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఇందుకోసం వేగంగా అడుగులు వేసే అవకాశం కనిపిస్తున్నది. దేశంలో అన్ని రాష్ట్రాలతోపాటు లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికల్ని ఒకేసారి నిర్వహించాలనేది బీజేపీకి ఉన్న స్పష్టమైన అభిప్రాయం. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే తమ మద్దతు దారులతో విస్తృతమైన సంప్రదింపులు జరిపి వచ్చే ఐదేళ్లలో దేశమంతా వర్తించేలా ఒకే రీతిన కామన్ సివిల్ కోడ్ అమలులోకి తెస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత ఎన్నికల ముందు చెప్పారు. అదే తరుణంలో దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందని కూడా పేర్కొన్నారు. తమ ప్రభుత్వమే మళ్లీ ఏర్పాటైతే 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' అమలు చేస్తామనీ ప్రకటించారు.

గత ఏడాది రాజ్యాంగ దినోత్సవం (నవంబర్ 26) సందర్భంగా గుజరాత్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ ముగింపులో ప్రధాని మోదీ కూడా 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' అంశాన్ని లేవనెత్తారు. దేశంలోని అన్ని ఎన్నికలను ఒకేసారి చేపట్టడం ఇందులోని అంశం. లోక్‌సభతోపాటు రాష్ట్ర శాసనసభలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడమే ప్రతిపాదనల సారాంశం. ఒకే ఓటరు జాబితాను రూపొందించడం, ఒక దేశం-ఒకే ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే ఉన్న చట్టాలను సరళీకృతం చేయడం, అవసరమైతే పాత చట్టాలను రద్దు చేయడానికి అవసరమైన ఆలోచనలు చేయాలని అధికారులను ఆదేశించినంత పని చేశారు. అయితే ఇది సాధ్యమా, అసాధ్యమా అనే విషయంలో చాలా సందేహాలున్నాయి.

భారతదేశంలో జరిగిన ఎన్నికల్ని పరిశీలిస్తే 1951-52 నుంచి 1967 వరకూ పార్లమెంటు, శాసనసభలకు ఎన్నికలు ఒకేసారి జరిగాయి. అనంతర కాలంలో ఈ పరిణామంలో మార్పులు వచ్చాయి. ఫిరాయింపు రాజకీయాలు, కేంద్రం దుందుడుకు విధానాల్లో భాగంగా చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వాల రద్దు వంటి అనేక కారణాలున్నాయి. అందులో ప్రధానమైంది చట్టబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను రాజ్యాంగ విరుద్ధంగా రద్దు చేయడం. 1959లో కేంద్ర ప్రభుత్వం నాటి కేరళలోని వామపక్ష ప్రభుత్వాన్ని రద్దు చేసేందుకు ఆర్టికల్ 356ను అమలులోకి తెచ్చి తమ పంతం నెగ్గించుకోవాలని చూసింది. 1960 తర్వాత అనేక శాసనసభలు రద్దు అయ్యాయి. ఈ పరిణామాలే అప్పటికి జరిగిన దానికి భిన్నంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు వేర్వేరు ఎన్నికలు జరిగే పరిస్థితికి దారితీసింది. ప్రస్తుతం దాదాపుగా ప్రతీ ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటున్నాయి. ఒకే సంవత్సరంలో వేర్వేరు సమయాల్లోనూ ఎన్నికలు జరుగుతున్న సందర్భాలు ఉంటున్నాయి. ఇది భారీ వ్యయ, ప్రయాసలతో కూడినదిగా మారింది. భద్రతా బలగాలతోపాటు ఎన్నికలలో నిమగ్నమయ్యే అధికారులను వారి వారి ప్రాథమిక విధుల నుంచి దూరం చేయాల్సి వస్తున్నది. ఎన్నికల తరుణంలో అమలులో ఉండే ప్రవర్తనా నియమావళి కూడా సుదీర్ఘంగా అమలు చేయవలసి వస్తుండడంతో అనేక అభివృద్ధి పథకాల

**Election expenditure per elector**

| Year of Election | Expenditure Incurred (in Rs.) | No. of electors | Expenditure per elector (in Rs.) |
|---|---|---|---|
| 1952 | 10,45,00,000 | 17,32,12,343 | 0.6 |
| 1957 | 5,90,00,000 | 19,36,52,179 | 0.3 |
| 1962 | 7,32,00,000 | 21,63,61,569 | 0.3 |
| 1967 | 10,79,69,000 | 25,02,07,401 | 0.4 |
| 1971 | 11,60,87,450 | 27,41,89,132 | 0.4 |
| 1977 | 23,03,68,000 | 32,11,74,327 | 0.7 |
| 1980 | 54,77,39,000 | 35,62,05,329 | 1.5 |
| 1984-85 | 81,54,34,000 | 40,03,75,333 | 2.0 |
| 1989 | 1,54,22,00,000 | 49,89,06,129 | 3.1 |
| 1991-92 | 3,59,10,24,679 | 51,15,33,598 | 7.0 |
| 1996 | 5,97,34,41,000 | 59,25,72,288 | 10.1 |
| 1998 | 6,66,22,16,000 | 60,58,80,192 | 11.0 |
| 1999 | 9,47,68,31,000 | 61,95,36,847 | 15.3 |
| 2004* | 10,16,08,69,000 | 67,14,87,930 | 15.1 |
| 2009# | 11,14,38,45,000 | 71,69,85,101 | 15.5 |
| 2014 | 38,70,34,56,024 | 83,41,01,479 | 46.4 |

అమలుకు అంతరాయం ఏర్పడడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎన్నికల చట్టాలపై స్పందించిన లా కమిషన్ ఆఫ్ ఇండియా తన 170వ నివేదికలో చాలా అంశాలను పేర్కొంది. ఎన్నికలు అనేవి ప్రతి సంవత్సరం ఒకే సీజన్‌లో జరిగేలా చూడాలని సూచించింది. గతంలో మాదిరి అన్ని శాసనసభలతోపాటు లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరగాలని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కారణంగా తలెత్తే వివిధ పరిస్థితులు, పరిణామాలను వెల్లడించింది. ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియాలో కేసులో సుప్రీంకోర్టు వివిధ కారణాల రీత్యా శాసనసభకు ప్రత్యేక ఎన్నికల నిర్వహణ అనేది మినహాయింపుగా ఉండాలని పేర్కొంది. ఐదేళ్లకు ఒకసారి ఒక ఎన్నికగా ఉండాలని పేర్కొంది. సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, చట్టం మరియు న్యాయశాఖ సంబంధిత పార్లమెంటరీ స్టాండిరగ్ కమిటీ ఏకకాలంలోనే ఎన్నికలు అనే అంశాన్ని, సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. 2015లో విడుదల చేసిన తమ 79వ నివేదికలో ఏకకాల ఎన్నికలకు ప్రత్యామ్నాయంగా రెండు దశల్లో నిర్వహించడానికి ఆచరణాత్మక పద్ధతిని సిఫార్సు చేసింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు పేర్కొంటూ మోదీ ప్రభుత్వం తమ ఏకత్వం అనే రహస్య అజెండాను అమలు చేసేలా పావులు కదపడం మొదలుపెట్టింది.

ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి ఏకకాల ఎన్నికల అంశాన్ని లా కమిషన్ రిపోర్టులో ప్రస్తావించారు. 1999లో బీపీ జీవన్‌రెడ్డి నేతృత్వంలోని లా కమిషన్ ఈ ప్రతిపాదన చేసింది. అప్పటి నుంచి చర్చనీయాంశంగా ఉన్న ఈ అంశాన్ని పరిశీలించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్రం 2023 సెప్టెంబర్ 2న నోటిఫికేషన్ జారీ చేసింది. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. సదరు కమిటీ 191 రోజుల సంప్రదింపులు జరిపిన అనంతరం 18,600 పేజీల నివేదికను 2024 మార్చి 14న ప్రభుత్వానికి సమర్పించింది. కమిటీ ఇచ్చిన నివేదిక అంతా రాజ్యాంగ విరుద్ధమైన ఆలోచనలతో ఉన్నట్టు స్పష్టమవుతున్నది. ఏకకాలంలో ఎన్నికలను అమలు చేయడానికి రాజ్యాంగానికి వ్యతిరేకమైన ఆలోచనలను ముందుంచి ఆ దిశగా మార్గాలను అన్వేషించమని కోరినట్టు తెలుస్తున్నది. కాబట్టే కోవింద్ కమిటీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక అరుదైన కమిటీగా నిలిచిపోతుంది. సమస్యలను కనీసం పరిశీలను కూడా చేసినట్టు లేదు. కల్పిత అంశాలతో ప్రభుత్వ పెద్దల విధేయతను ప్రకటించడమే తమ పరమావధిగా నివేదికను రూపొందించి సమర్పించింది. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది 2029 నుంచి ప్రారంభించవచ్చునని వెల్లడించింది. ఆ సమయానికి ముందుగా గడువు ముగియనున్న రాష్ట్రాల శాసనసభల గడువును కొంత కాలం పొడిగించడం అవసరమని సిఫార్సు చేసింది. ప్రభుత్వ కోరిక మేరకు ముందే ప్రతిపాదింపబడిన ఒక దేశం ఒకే ఎన్నికలు నిర్దిష్టమైన పాలనకు మంచిదని కితాబిచ్చింది. భారత దేశం సమాఖ్య, ప్రజాస్వామ్యం వ్యవస్థ అని మరచి మోదీ పరివార్ ఆశలు నెరవేరేందుకు దారులు వేసింది.

వన్ ఎలక్షన్ కోసం ఏర్పాటైన కమిటీ అధికారికంగా అనేక సంప్రదింపులు చేసిందని న్యాయ మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను ముందే ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తులు, వివిధ హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తులు, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌లతోపాటు అనేకమంది న్యాయ నిపుణులతోనూ సమావేశమైన కోవింద్ కమిటీ వారితో వ్యక్తిగతంగా సంభాషించింది. లా కమిషన్ ఆఫ్ ఇండియా నిపుణులు, పౌర, ప్రజా సంస్థల నుంచి సలహాలు సూచలన కోసం వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా పబ్లిక్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా వంటి సంస్థల అభిప్రాయాలు తీసుకున్నట్టు తెలిపారు. దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలతోనూ కమిటీతో సంప్రదింపులు జరిపిందని, కోవింద్ కమిటీ ప్రత్యక్షంగా దాదాపు 65 సమావేశాలను నిర్వహించిందని చెప్పుకొచ్చారు. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ విషయంలో ప్రజల నుండి 21,558 అభిప్రాయాలు అందగా వాటిలో 81 శాతం సదరు ప్రతిపాదనకు అనుకూలంగా ఉన్నాయని న్యాయ మంత్రిత్వ శాఖ నివేదించింది.

కోవింద్ కమిటీ దేశంలోని జాతీయ, ప్రాంతీయ స్థాయిలో 62 రాజకీయ పార్టీలను సంప్రదించగా వాటిలో 32 పార్టీలు వన్ నేషన్ వన్ ఎలక్షన్ పట్ల విముఖత వ్యక్తం చేశాయి. కేవలం అధికార బీజేపీతో కలసి ఉంటున్న కొన్ని పార్టీలు మాత్రమే వన్ నేషన్-వన్ ఎలక్షన్ భావనకు మద్దతు ఇచ్చాయి. ఆర్‌జేడీ, జేఎంఎం, టీడీపీ, ఎస్ఏడీ, బీఆర్ఎస్ సహా 12 ప్రాంతీయ పార్టీలు స్పందించలేదు. కాంగ్రెస్‌తోపాటు 15 కీలకమైన రాజకీయ పార్టీలు ఈ ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించాయి. కమిటీ ప్రతిపాదన రాజ్యాంగపు ప్రాథమిక నిర్మాణాన్నే ఉల్లంఘిస్తున్నదని స్పష్టం చేశాయి. ఈ విషయంలో మౌనం వహించిన చాలా రాజకీయ పార్టీలకు కనీస పరిజ్ఞానం ఉన్నట్టు కనిపించడం లేదు. ఏదైనా ఒక అంశంపై సలహాలు సూచనలను కోరితే సహేతుకమైన కారణాలతో ఆలోచనకు మద్దతు ఇవ్వడమో, తిరస్కరించడమో చేయాలి. అయితే రాజ్యాంగాన్ని మార్చాల్సిన ఇటువంటి కీలకమైన అంశాల

విషయంలో మౌనం ఆ పార్టీల నాయకత్వంలోని అవగాహన లేమిని వ్యక్తపరుస్తున్నది.

ఇక ప్రయోజనాలేమైనా ఉన్నాయా అనే ప్రశ్న కూడా ముందుకు వస్తున్నది. ఏకకాల ఎన్నికల ఖర్చులు తక్కువ అనేది బాగా జరుగుతున్న చర్చ. ఏకకాల ఎన్నికలకు అనుకూలంగా డాక్టర్ ఆర్తీ భట్నాగర్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రతిపాదన మంచిదేనని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, భద్రత, పాలనలో అంతరాయం లేకుండా ఉండడంతోపాటు ఎన్నికల ఖర్చులను తగ్గించుకోవచ్చునని చెప్పారు. వార్షికంగా 45 బిలియన్ల మేర ఖర్చులు తగ్గే అవకాశం ఉన్నట్టు తెలిపారు. రాజకీయ అనిశ్చితి తగ్గుతుండడం చేత పరిశ్రమల దృక్కోణం నుంచి మంచిదేనని తెలిపారు. మెరుగైన పాలన ఏర్పాటైన రాజకీయ స్థిరత్వం పెంపొందుతుందనేది ఆమె నిర్ధారణ. అయితే ఈ విషయంలో సమగ్ర అధ్యయనం లేదు. ప్రజా ధనం ఆదా అయ్యే అవకాశం ఉందనేది ఖచ్చితంగా తెలియడం లేదు. అదే తరుణంలో ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో అవసరమయ్యే మౌలిక సదుపాయాలకు సంబంధించిన అనేక సమస్యలు తెరపైకి వస్తున్నాయి. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహణకు రెండు సెట్ల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఒకటి శాసనసభకు మరియు రెండవది లోక్‌సభకు) అందించాల్సి ఉంటుంది. అదే తరుణంలో ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్స్ (వీవీ ప్యాట్లు) అవసరం రెట్టింపు అవుతుంది. ప్రస్తుతం కొనసాగుతున్న విధానం ఇది ఖర్చుతో కూడుకున్నది అనేది సరైన భావన కాకపోవచ్చు. భారత ఎన్నికల సంఘం, నీతి ఆయోగ్ అంచనాల మేరకు ప్రతి ఏటా ఒక ఓటరుపై రూ.10 ఖర్చు అవుతున్నది. ఎక కాల ఎన్నికల వలన ఆ ఖర్చు రూ.5కి తగ్గుతుంది అంటున్నారు. ఇది తగ్గినట్టే కనిపిస్తున్నా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, భద్రత వంటి రూపాల్లో ఇతర ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి కాబట్టి ప్రతి ఓటరుపై ఏడాదిలో రూ.5 ఆదా చేసేందుకు రాజ్యాంగాన్నే అన్నిసార్లు సవరించడం మంచిది కాకపోవచ్చు.

కోవింద్ కమిటీ నివేదిక రాజ్యాంగపరమైన అనేక అభ్యంతరాలతో కూడింది. రాజ్యాంగానికి దాదాపు 18 సవరణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడేలా ఉంది. ప్రధానంగా పార్లమెంటులోని రెండు సభలకు వ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 83, ఆర్టికల్ 83(2), రాష్ట్ర శాసనసభల కాలవ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 172, 172(1) విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రస్తుతం నడుస్తున్న పద్ధతిలో ఎటువంటి ఆటంకాలు లేకపోతే లోక్‌సభ, శాసనసభలు ఐదేళ్ల పాటు ఉంటాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 83(2) ప్రకారం లోక్‌సభ పదవీ కాలాన్ని ఒక సంవత్సరం (ఒకేసారి) పొడిగించుకునే అవకాశం ఉంది. ఆర్టికల్ 172(1) ప్రకారం ఆరు నెలలు పొడిగించవచ్చు అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించకూడదు. ఇటువంటి అంశాల్లోనూ అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఆర్టికల్ 324 ప్రకారం పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఏకకాల ఎన్నికలు, ఆర్టికల్ 325 ప్రకారం భారత ఎన్నికల సంఘం సహాయంతో ఉమ్మడి ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అవసరమైన సవరణలను ఆమోదించాల్సి ఉంటుంది. మొత్తం మీద రాజ్యాంగంలోని ఆర్టికల్ 83, 85, 172, 174, 356లో అనేక రాజ్యాంగ సవరణలు అవసరం కావచ్చు. ఏకకాల ఎన్నికల అంశానికి వస్తే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ పరిధిలోని చట్టాలలో అనేక సవరణలు చేయవలసి ఉంటుంది. మునిసిపల్, పంచాయతీ ఎన్నికల కోసం భారత ఎన్నికల సంఘం ఇచ్చే ఓటర్ల జాబితానే ఆమోదించాలి. ఇది చాలా తీవ్రమైన అంశంగా మారుతుంది. ఈ విషయంలో ఏకాభిప్రాయం అంత సులభం కాదు. ఇందు కోసం చాలా కసరత్తు చేయాలి.

**మొత్తం మీద ఇది రాజ్యాంగంలోని ఫెడరలిజం అనే భావనకు విరుద్ధమైన ప్రతిపాదన ఇది. మొత్తంగా భారత రాజ్యాంగ భావనకు వ్యతిరేకమైన అంశంగా నిలుస్తుంది. మరోవైపు ఈ ప్రతిపాదన ఆచరణలో సాధ్యపడదని జస్టిస్ బీఎస్ చౌహాన్ తెలిపారు. రాజ్యాంగంలోని ప్రస్తుత చట్రంలో ఏకకాల ఎన్నికలు సాధ్యం కాదని ఆయన నేతృత్వంలోని లా కమిషన్ నివేదించింది. ప్రస్తుతం నడుస్తున్న ఎన్నికల విధానం ప్రజాస్వామ్యంలో ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే ఇది ఓటర్లు తమ వాణిని ఎప్పటికప్పుడు వినిపించే అవకాశం ఇస్తున్నది. జాతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలోని అనేక విషయాల్లో విభిన్నత ఉంటుంది. కాబట్టి వన్ ఎలక్షన్, వన్ నేషన్ అనేది జవాబుదారి తనాన్ని ఇవ్వలేదు. భారతదేశం 'యూనియన్ ఆఫ్ స్టేట్స్'గా భావించబడుతున్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 సారం కూడా ఇదే. ఒకే దేశం, ఒకే ఎన్నికలు ఆలోచన ఫెడరలిజం స్ఫూర్తితో కూడినది కాదు. ఐడీఎఫ్‌సీ అనే సంస్థ 2015లో జరిపిన ఒక అధ్యయనంలో 'అధికారంలో ఉన్న పార్టీలే ఏకకాల ఎన్నికల్లో గెలిచేందుకు 77 శాతం అవకాశం ఉన్నట్టు తెలిపింది. కాబట్టే బీజేపీ తమ అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంటూ ఈ విధానం వైపు మొగ్గు చూపుతున్నట్టు స్పష్టంగా అర్థం చేసుకోవచ్చును.** ❑

# జమిలి ఎన్నికల వెనక మోదీ పద్మవ్యూహం



- డివివియస్ వర్మ

మోదీ చర్యలకు ఒక తాత్కాలిక లక్ష్యం వుంటుంది. ఒక పద్మవ్యూహం లాంటి దీర్ఘకాలిక లక్ష్యం వుంటుంది. జమిలి ఎన్నికల మీద మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ కమిటీ నివేదికను మోదీ మంత్రివర్గం ఆమోదించడం కేవలం లాంఛనప్రాయ మైంది కాదు. మోదీ మూడో విడత పాలన శత దినోత్సవం సందర్భంగా జమిలి ఎన్నికలను తెర మీదకు తేవడం యాదృచ్ఛికం కాదు. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్రాల ఎన్నికల్లో ప్రతిపక్షాలపై దాడి చేసే ప్రచార అస్త్రంగా వాడుకోవడం మోదీ తక్షణ లక్ష్యం కావచ్చును. ఈ ప్రచారానికి సరంజామా సిద్ధం అయ్యింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ జమిలి ఎన్నికలను రెండు విడతలుగా నిర్వహించవచ్చునని సూచించింది. నీతి ఆయోగ్ దానిని బలపరిచింది. లా కమిషన్ కూడా సమర్ధించింది. తాజాగా మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీ జమిలి ఎన్నికలను సిఫార్సు చేసింది. ఇంత మంది చేసిన సిఫార్సుల ఆధారంగా "ఎన్నికల సంస్కరణలకు" పూనుకొంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, వారు ప్రజా స్వామ్య సంస్కరణలకు, ఒకే దేశం భావనకీ వ్యతిరేకులుగా ప్రచార దాడిని సాగించే వీలుంది. జమిలి ఎన్నికల నినాదం వెనక వున్న మోదీ దీర్ఘకాలిక వ్యూహాన్ని చర్చించే ముందు ఇప్పటికే ప్రచారంలో వుండి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న కొన్ని అంశాలలో వాస్తవాలను పరిశీలిద్దాం.

### ఎన్నికల ఖర్చు-వాస్తవాలు

ఈ ఎన్నికల వ్యయం మీద జరుగుతున్న చర్చలో రెండు భాగా లున్నాయి. ఒకటి ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థులు ప్రలోభాలకి, ప్రచారానికి పెట్టే ఖర్చు ఒకే ఎన్నికైనా, జమిలి అయినా ఈ ఖర్చు పెరుగడమే కాని తరగదు. మరొకటి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ చేసే ఖర్చు.

- 1.పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, వాటికి అవసరమైన సదుపాయాల కల్పన
- 2.పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి ప్రయాణ ఖర్చులు




- 3.బాలట్ బాక్స్‌ల తరలింపు, సిబ్బంది ప్రయాణ ఖర్చులు
- 4.పోలింగ్, ఓటింగ్ కేంద్రాలకు అవసరమైన తాత్కాలిక ఫోను, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్
- 5.ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి కొనుగోళ్లు.
- 6.ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి ఇతర ఖర్చులు.

1952లో తొలి జమిలి ఎన్నికలకు అయిన ఖర్చు రూ.10 కోట్లు మాత్రమే. ప్రతి ఎన్నికకు పెరుగుతున్న ఓటర్లు, ధర వరలు, ఏర్పాట్లకి అనుగుణంగా ఈ ఖర్చు పెరుగుతూ 2014లో 16వ లోకసభ ఎన్నికలకు ఖర్చు రూ.3,826 కోట్లకు పెరిగింది. 2019 నాటికి ఈ ఖర్చు రూ.6,000 కోట్లకు చేరింది. ఇది 5 సంవత్సరాలకి ఒకసారి పెట్టే ఖర్చు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ రూ.48 లక్షల కోట్లు. ఒక ఏడాదికి ఎన్నికల నిర్వహణకు పెట్టే ఖర్చు కేవలం రూ.1200 కోట్లు మాత్రమే. ఇక రాష్ట్రాలలో వేరు వేరుగా ఎన్నికలు జరిగినా అదనంగా అయ్యేది మరో రూ.1200 కోట్లు. అందువల్ల జమిలి ఎన్నికలతో ప్రజల డబ్బు ఆదా అవుతుందన్న వాదన వాస్తవం కాదు.

### ఎన్నికల కోడ్ - అభివృద్ధి

తరచు ఎన్నికల వల్ల ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి నిలిచి పోతుందన్నది మరో వాదన. లోకసభ ఎన్నికలప్పుడు దేశమంతటికీ ఎన్నికల కోడ్ వర్తిస్తుంది. కేంద్రంలో వుండే ఆపద్ధర్మ ప్రభుత్వం కొత్త పథకాలను తీసుకునే అవకాశం ఉండదు. వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగేటప్పుడు ఆ రాష్ట్రాలలో ఇదే స్థితి ఉంటుంది. ఇకపోతే మధ్యలో కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం స్తంభించిపోదు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఓటర్లను ప్రభావితం చేసే కొత్త పథకాలు, రాయితీలు ప్రకటించడం మీదే మాత్రమే

ఆంక్షలు ఉంటాయి. రోజువారీ పరిపాలన యథాతథంగా కొనసాగుతుంది. గతంలో కొన్ని రాష్ట్రాల ఎన్నికల సమయంలో కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టడం కూడా ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోలేదు.

## కేంద్రానికి-రాష్ట్రాలకు మధ్య విభజన

దేశంలోని బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు పరిగణనలోకి తీసుకున్నారు. కేంద్ర జాబితా, రాష్ట్రాల జాబితా, ఉమ్మడి జాబితాల రూపంలో అధికారాల విభజన చేశారు. ఎన్నికలలో ప్రజలు తీర్పు చెప్పడానికి ఇవే ప్రాతిపదికలు కావాలి. జాతీయస్థాయిలో లోకసభకు జరిగే ఎన్నికలలో కేంద్ర జాబితాలోని అంశాలపై వివిధ పార్టీల విధానాలపైనా, శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర జాబితాలోని అంశాల ఆధారంగా ప్రజలు తీర్పు చెప్పాల్సి వుంటుంది. అందువల్ల లోక్ సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేరువేరుగా ఎన్నికలు జరపడం వల్ల ప్రజలు దేనికి తగ్గ తీర్పు దానికి చెప్పే వీలుంటుంది. జమిలి ఎన్నికలు ఈ అధికార విభజనను కలగాపులగం చేస్తుంది. జాతీయ అంశాలు పైచేయి సాధిస్తాయి. 1952లో రాజ్యాంగం అమలులోకి రాగానే జరిగిన తొలి ఎన్నికలలో జమిలి తప్పలేదు. జాతీయోద్యమ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో రాష్ట్రాలలో రెండింటా ఆధిపత్యాన్ని పొందింది. ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలు విస్మరించబడ్డాయి. దీని పర్యవసానంగా 1967లో అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. అవి నేటికీ ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రతినిధులుగా కొనసాగుతున్నాయి. గతంలో జమిలి ఎన్నికల ప్రయోగం ఒక జాతీయ పార్టీ ఏకచ్ఛత్రాధి పత్యానికి దారితీసింది. వివిధ రాష్ట్రాల ప్రజల, ప్రాంతాల ఆకాంక్షల వైవిధ్యాన్ని తుడిచిపెట్టింది. గతంలో జమిలి ఎన్నికలు వున్నాయి కదా అని వాదించేవారు దాని పర్యవసానాలను విస్మరిస్తున్నారు.

మోదీ దీర్ఘకాలిక లక్ష్యం లేదా వ్యూహం కేవలం రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే ఉద్దేశించబడింది. ఇందులో దేశ ప్రయోజనాలకు తావు వుండదు. ఆర్థిక విధానాల ఆధారంగా ఎన్నికల్లో విజయాలను సాధించడం మోదీ లక్ష్యం కాదు. మెజారిటీ మతవాదం ఒక్కటే తనను దేశ ప్రజలకు ఏకైక నాయకుడిని చేస్తుందన్న భావనే అయనను నడిపిస్తున్నది. ఇది ఆచరణలో వాస్తవం కావాలంటే దేశంలో భిన్నత్వం అన్న భావన వుండకూడదు. వైవిధ్యం అన్న భావన కనిపించ కూడదు. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే ఎన్నిక మాటున భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని రూపు మాపాలి. అప్పుడు మాత్రమే మోదీ మెజారిటీ వాదం తన విశ్వరూపాన్ని ప్రదర్శించగలుగుతుంది. విద్వేష రాజకీయానికి తిరుగులేని విజయాలను సాధించి పెడుతుంది. జమిలి ఎన్నికలు, డబుల్ ఇంజన్ సర్కార్ నినాదాలు ఈ లక్ష్యాన్ని చేరడానికి మోదీ ఎంచుకున్న సాధనాలు. ఈ నినాదాలు ప్రాంతీయ పార్టీలను బలహీనపరుస్తాయి. డబుల్ ఇంజన్ సర్కార్లలో అవి జూనియర్ పార్టనర్లుగా మారతాయి. కాలక్రమేణా అంతరించి పోతాయి.

## అధ్యక్ష తరహాకు రంగం

దేశంలోని వైవిధ్యాన్ని గమనంలోకి తీసుకుని మన రాజ్యాంగం లోక్ సభకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులలో మెజారిటీ స్థానాలు పొందిన పార్టీ పక్ష నాయకుడు ప్రధాని అయ్యే పార్లమెంటరీ పద్ధతిని స్వీకరించింది. ఈ కారణంగానే అధ్యక్ష తరహా ఎన్నికల పద్ధతిని రాజ్యాంగం పక్కన పెట్టింది. కాని ఎలాంటి రాజ్యాంగ సవరణ లేకుండానే చాపకింద నీరులా ప్రతి ఎన్నికలోనూ అధ్యక్ష తరహా పద్ధతి వైపు అడుగులు పడుతున్నాయి. ఎన్నికలకు ముందే మీ ప్రధాని అభ్యర్థి ఎవరు ? మీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు? అన్న సవాళ్ళు ప్రతి సవాళ్ళు ముందు కొస్తున్నాయి. రాజ్యాంగ విరుద్ధమైన ఈ సవాళ్ళనే నిజమైన సమస్యగా పత్రికలు, విశ్లేషకులు చర్చిస్తున్నారు. జమిలి ఎన్నికల తర్వాత మన ముందుకు వచ్చే అంశం అధ్యక్ష తరహా ఎన్నికల పద్ధతి. దీనితో ఒకే దేశం–ఒకే ఎన్నిక – ఒకే నాయకుడనే రాజకీయ వృత్తం పూర్తి అవుతుంది. ఇదీ జమిలి ఎన్నికల వెనుక దాగిన మోదీ రాజకీయ పద్మవ్యూహం.

ప్రస్తుతం చర్చ అంతా జమిలి ఎన్నికల పర్యవసానాల మీద కాకుండా దాని సాధ్యాసాధ్యాల మీద జరుగుతున్నది. రాజ్యాంగ సవరణలకు అవసరమైన సంఖ్యాబలం చుట్టూ తిరుగుతున్నది. మోదీ, షాలకు ఆ లెక్కలు తెలుసు. జమిలి ఎన్నికలనే "గొప్ప సంస్కరణ" అమలును ప్రతిపక్షాలు అడ్డుకోవడం వల్లే ఆగిపోయిందని దీని అమలుకు తగిన సంఖ్యాబలాన్ని ఇవ్వాల్సిందిగా 2029 ఎన్నికలకు వారు నినాదంగా చేసుకోవచ్చును. పోతే అమిత్ షా ప్రస్తుత లోక్‌సభ కాలంలోనే దీనిని అమలులోకి తెస్తామన్న మాటను తక్కువ అంచనా వెయ్యకూడదు. భయపెట్టో, బుజ్జగించో రాజ్యాంగ సవరణలకు తగిన సంఖ్యాబలాన్ని తెచ్చుకునే ఎత్తులు జిత్తులకు పూనుకోవచ్చును. అదీ కాకపోతే 2027 లేదా 2028లో లోక్‌సభను రద్దు చేసి ఆ సంత్సరం జరిగే అసెంబ్లీ ఎన్నికలతోపాటు తర్వాత సంవత్సరం జరగాల్సిన ఎన్‌డిఎ కూటమి రాష్ట్ర ప్రభుత్వాలను ముందస్తు ఎన్నికల కోసం రాజీనామాలు చేయించి ఒక విడత జమిలి ఎన్నికలు నిర్వహిస్తూ దీనిని రాజ్యాంగబద్ధం చెయ్యడానికి తమకు మూడు వంతులకుపైగా మెజారిటీ ఇవ్వాలన్నది ఎన్నికల నినాదం చేసినా ఆశ్చర్యపోనక్కరలేదు.

ఎందుకంటే జమిలి వారి రాజకీయ వ్యూహంలో అత్యంత కీలకమైంది. రాజ్యాంగాన్ని, దేశ రాజకీయాలను మలుపు తిప్పే జమిలి ఎన్నికల వెనక దాగిన పద్మవ్యూహాన్ని ప్రతిపక్షాలు సరైన ప్రతివ్యూహంతో ఎదుర్కొన దానికి సిద్ధం కావాలి. ❑

# జమిలి ఎన్నికల దారి ఎటు వైపు ?



- కేశవ్

**నేడు 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' అనే యజ్ఞం కోసం కేంద్రం సిద్ధమైపోయినట్టుంది. గత సంవత్సరమే మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అది సిఫారసులు ఇవ్వడం, కేంద్ర మంత్రిత్వ శాఖ ఆమోదం తెలపడం, ప్రభుత్వం అందుకు అనుగుణంగా సన్నద్ధం కావడం జరిగిపోతోంది. ఈ సిఫారసుల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం జరుగుతుంది. ఆ తర్వాత 100 రోజులకు లోకల్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఒకవేళ లోక్ సభ ఎన్నికలకు ముందు ఏదైనా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం జరిగితే, వాటి కాల పరిమితి లోక్‌సభ ఎన్నికల వరకు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత, ఆ రాష్ట్రాలు మరలా లోక్‌సభతో కలిపి ఎన్నికల కోసం సిద్ధం కావలసి ఉంటుంది. దాదాపు ఆరు అధికరణాలు ఇందుకోసం సవరిస్తారు. బిల్లులు ప్రవేశపెడతారు.**



ప్రభుత్వం వాదన ప్రకారం, ఇలా నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుంది. ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. ఎన్నికల నిర్వహణలో మరింత సౌలభ్యం ఏర్పడుతుంది. ఎన్నికల కోడ్ మాటి మాటికి లేకపోవడం కారణంగా వివిధ సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు తొలగుతాయి. కాబట్టి పరిపాలనలో అడ్డంకులు లేకుండా సున్నితంగా ముందుకు నడుస్తుంది. దేశ అభివృద్ధి అగ్రగతిలో నడుస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలతో మనం చేరతాం. ప్రతిపక్షం ప్రకారం, భారతదేశం ఫెడరల్ రాజ్యాంగం స్వభావంతో ఉంది. కేంద్రం హక్కులు కేంద్రానికి ఉన్నాయి. రాష్ట్రాల హక్కులు రాష్ట్రాలకు ఉన్నాయి. ఒకే దేశం ఒకే ఎన్నికలు అనే నినాదం కింద రాష్ట్రాలు తమకంటూ ఒక ఉనికిని కోల్పోతాయి. రాష్ట్రాలకు సంబంధించిన పార్టీలకు ప్రాధాన్యత తగ్గుతుంది. ఇలా ఎన్నికలు జరిగేటప్పుడు కేంద్రానికి సంబంధించిన అంశాలే డామినేట్ అవుతాయి. రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు వెనక్కి నడుస్తాయి. ప్రజలు వాటిని పెద్దగా గుర్తించరు.

ఈ కొత్త విధానం ఎన్నో కొత్త సమస్యలను సృష్టిస్తుంది. లోక్ సభలో ఏదైనా ఒక ప్రభుత్వం ఏర్పడినప్పుడు, ఆ ప్రభుత్వం సక్రమంగా పనిచెయ్యకపోతే, ఆ ప్రభుత్వం మీద అవిశ్వాసం ఏర్పడినప్పుడు, ఆ ప్రభుత్వం పడిపోయి మరలా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది. కానీ, కొత్తగా ప్రతి పాదిస్తున్న జమిలి ఎన్నికల ప్రకారం, ఈ అవకాశం ప్రజలకూ, ప్రజా ప్రతినిధులకూ దొరక్కుండా పోతుంది. అంటే, ఒకసారి మనం ఎన్నుకుంటే, ఆయా ప్రభుత్వాలు ఎలా పరిపాలన చేసినా సరే, అవిశ్వాస తీర్మానం అనేది అసాధ్యం అయ్యేలా వాస్తవ పరి స్థితి ఉంటుంది. ఒకవేళ, కేంద్ర ప్రభుత్వం పడిపోయే పరిస్థితి వచ్చేటప్పుడు, రాష్ట్రాల అసెంబ్లీల పరిస్థితి ఏమవుతుంది? ఇదే పరిస్థితి రాష్ట్రాలలో కూడా రావచ్చు. అప్పుడు లోక్‌సభ గడువు వరకు ఆ రాష్ట్రాలు వేచి ఉండాలా? అంత వరకూ ఆయా రాష్ట్రాల్లో ప్రెసిడెంట్ రూల్ విధిస్తారా? కనీస ప్రజాస్వామ్య హక్కులు ఇవ్వరా? నోట్ల రద్దు సమయంలో కూడా దేశానికి ఏదేదో మంచి జరిగిపోతుందనీ, ఇదో మహాయజ్ఞం అనీ నమ్మించారు. జిఎస్‌టి సమయంలో కూడా ఇలానే నమ్మించారు. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారాయి. దేశమంతా ఒకే పన్ను విధానం ఆరంభం అయ్యేటప్పుడు దేశాభివృద్ధి ఎంతో ముందుకు నడుస్తుందని ఆ రోజు నమ్మించారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పన్ను

విధించడం ద్వారా పాలనా సౌలభ్యం దెబ్బ తింటుంది అని అన్నారు. కానీ వాస్తవంలో జరిగిందేమిటి? తమ రాష్ట్రాల పన్నుల కోసం రాష్ట్రాలు కేంద్రం మీద నిస్సహాయ స్థితిలో ఆధారపడే పరిస్థితి వచ్చింది. మా వాటా మాకు ఇవ్వండి అని ప్రతిసారి రాష్ట్రాలు కేంద్రానికి అభ్యర్థించడం అనే పరిస్థితి దాపురించింది. మొదట్లో ఇలా లేకుండేది. అలానే దేశమంతా ఒకే పన్ను విధానం ద్వారా దేశం అభివృద్ధి అవుతుందని, ప్రజల సంక్షేమం బాగుప దుతుందన్నారు. కానీ ఏ రకమైన పన్నులు ఉన్నా సరే అభివృద్ధి అనేది రాజకీయ నాయకులకే ఉంటుంది. కానీ సాధారణ ప్రజలకు ఎలా ఉంటుంది ? ప్రజలు అప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడు అలానే ఉన్నారు. ప్రజల సమస్యలు అప్పుడు ఎలా ఉన్నాయో, ఇప్పుడు అలానే ఉన్నాయి. అభివృద్ధి ఫలాలు ఎప్పుడూ సాధారణ ప్రజలకి అందవు. అందేదంతా ధనిక వర్గానికే.


ఖర్చు తగ్గుతుందనే సాకుతో దేశమంతా ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం అనేది పార్లమెంటరీ రాజ్యాంగానికి, ఫెడరల్ విధానానికి విరుద్ధం. 2014 నుండి ఎన్నికలు మరింత ఈవెంట్ మేనేజ్‌మెంట్‌గా మారిపోయాయి. ఎన్నికలు ఒక భారీ వ్యాపారం అయ్యాయి. ఎలక్టోరల్ బాండ్ల కుంభకోణం మనకు తెలిసిందే. వ్యాపారాలు నిశ్చయంగా ధనిక వర్గానికి మాత్రమే ప్రయోజనం ఇస్తాయి. అలానే, వ్యాపారంగా రూపొందిన ఎన్నికలు కూడా. ప్రజలకు ప్రజాస్వామ్యం అనే మాటలు చెబుతూ, ఒకవైపు కార్పొరేట్లు, మరోవైపు విపరీతంగా డబ్బు బలం ఉన్న ధనిక పార్టీలు కుమ్మక్కై మొత్తం ఎన్నికలని హైజాక్ చేసి దేశమంతా ఒకే పార్టీ ఉండేలా శాసించే పరిస్థితి రావచ్చు. ముఖ్యంగా 1990 తర్వాత ప్రారంభమైన ప్రపంచీకరణ ప్రజా ప్రయోజనాలను పక్కకు తోసి, పాలసీల్లో కార్పొరేట్ వర్గం ప్రయోజనాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

2014 తర్వాత ఇది మరింత తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రశాంత్‌కిషోర్‌ల ప్రవేశంతో ఎన్నికల రూపురేఖలు మారిపోయాయి. వీరంతా ఎన్నికలకు ఒక వ్యూహం అందించారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రకమైన వ్యూహాన్ని అందిస్తూ ఎన్నికలను ఒక వ్యాపార కేంద్రంగా మార్చారు. దేశంలోకి విపరీతంగా వచ్చి పడుతున్న పెట్టుబడులకు ఒక సానుకూలమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు కావాలి. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గానికి తమకు ఇబ్బందికలగని, తమ పాలనా విధానాలకూ, తమ వ్యాపార ప్రయోజనాలకూ అడ్డంకులు లేని ఒక సున్నితమైన ఆర్థిక విధానం కావాలి. ఎన్నికలు దేశమంతా ఒకేసారి నిర్వహిస్తే ప్రయోజనం పొందేది ఎన్నికల ఈవెంట్ మేనేజ్మెంట్ నిర్వహించగలిగే బీజేపీ వంటి బలమైన పార్టీలే. చిరునామా కోల్పోయేది రాష్ట్రాలకు సంబంధించిన చిన్న పార్టీలే. ఎన్నికల మీద మరింత భారీగా పెట్టుబడులు చేరతాయి. కాబట్టి ఖర్చు తగ్గడం అనేది జరగదు. ఖర్చు మరింత భారీస్థాయిలోకి చేరుతుంది ఎన్నికల్ని మరింత భారీగా ఈ విధానం మారుస్తుంది. విపరీతమైన పెట్టుబడులు ఎన్నికల్లోకి వస్తాయి. ఎన్నికల నిర్వహణ మరింత సులభం అవుతుందనే వాదన అర్థం లేని మాట. ఎన్నికలను నిర్వహించే ఎన్నికల కమిషన్ ఇలా ఎన్నికల నిర్వహణ కష్టం అవుతుందని ఏనాడైనా చెప్పినట్టు భారతపౌరులు విన్నట్టు లేదు. ఇంతవరకు ఎన్నికల నిర్వహణలో వైఫల్యాలను మనం చూడలేదు.

అలానే, సంక్షేమ పథకాలకు ఎన్నికల కారణంగా ఆయా రాష్ట్రాలలో ఇబ్బంది వచ్చినట్టు ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేవు. ఒకవేళ అలాంటి సమస్యలు ఉంటే అవి ప్రభుత్వం వైఫల్యం అవుతుంది. కాని, ఎన్నికలు అందుకు కారణం కావు. ప్రజలకు సమయం ఆదా అవుతుందనేది మరో వాదన. రెండు సార్లు ఓటు వేసే ప్రజలు ఒకసారి ఓటు వేస్తారు. ఈ ఒక్కరోజు ఆదా చేసేసినంత మాత్రాన ప్రజలకు ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు. ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు దేశమంతా జరిగి, ఆ తర్వాత ఎలాంటి సమస్య వచ్చినా సరే మళ్లీ ఐదేళ్ల వరకు ఎన్నికలు నిర్వహించని పరిస్థితి ఉన్నప్పుడు వినడానికి బాగానే ఉంటుంది. కానీ ప్రజాస్వామ్యం మెల్లమెల్లగా ఏకస్వామ్యంలోకి పయ నిస్తుంది. లోక్‌సభకు అనుగుణంగా రాష్ట్రాలలోని శాసన సభలు తమకు తాము సర్దుకోవడం అలవాటు చేసుకుంటాయి. ఇలా సర్దుకోవడం పరోక్షంగా ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేసి కేంద్రాన్ని బలోపేతంగా మార్చుతుంది. అప్పుడు వీరు కలలుగనే హిందూ రాష్ట్రం ఇంకా ఎంతో దూరంలో ఉండదు.


ఎన్నికలు మాటిమాటికి నిర్వహించేటప్పుడు ఏదైనా పాలనాపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు వాటిని సులభతరం చేయడానికి మారుతున్న కాలంతోపాటు ఎన్నికల పద్ధతులు మరింత ఆధునికీకరణం చేయడానికి ప్రయత్నాలు జరగాలి. అంతేగాని మొత్తం ఎన్నికలన్నిటినీ ఒక దగ్గరే ప్యాకింగ్ చేసే పద్ధతులు ప్రజలకు ఏ విధమైన ప్రయోజనం అందించవు. ఏవైనా ప్రయోజనాలు అందిస్తే బలమైన పార్టీలకూ, స్వేచ్ఛా వాణిజ్యం చేస్తున్న కార్పొరేట్ వర్గానికి మాత్రమే. ప్రజలు కనీస హక్కులు కోల్పోయే పరిస్థితి ఎంతో దూరంలో లేదు. భారత దేశం అనేది కొన్ని రాష్ట్రాల సమాఖ్యగా ఉంది. ఇక్కడ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. ప్రతి రాష్ట్రానికి కొన్ని రకాలైన ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయి ప్రత్యేక సమస్యలు ఉన్నాయి. ఇతర దేశాల్లా ఇక్కడ ఒకటి, రెండు పార్టీలు లేవు. కొన్ని వందల పార్టీలు ఉన్నాయి. ఒకే దేశం ఒకే ఎన్నిక అన్నప్పుడు ఈ పార్టీలన్నీ బడా ఎన్నికల వ్యాపారంలో మాయమైపోయి ఏవో ఒకటి, రెండు పార్టీలు మిగిలే పరిస్థితి కూడా భవిష్యత్తులో ఉంటుంది. పెద్ద చేపలు చిన్న చేపల్ని మింగేస్తే, చివరికి పెద్ద చేపలే మిగులుతాయి. ❑

# అసమానతల తలమే కులం



అనువాదం : బోడపట్ల రవీందర్ - రామ్ పునియానీ

కులగణన నిర్వహణ, గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రధాన సమస్యల్లో ఒకటిగా ఉంది. ఇండియా కూటమి ఈ సమస్యను చాలా బలంగా ముందుకు తీసుకొస్తే, బీజేపీ దాన్ని వ్యతిరేకిస్తూ వచ్చింది. ఈ వ్యతిరేకత చాలా స్పష్టంగా, నిస్సందేహంగా ఉంది. హిందూ మితవాద రాజకీయాల్ని బలోపేతం చేయడంలో కుల సమస్య ప్రధానమైన అంశంగా ఉంది. అణగారిన వర్గాల దోపిడీకి సంబంధించిన అవగాహనను జ్యోతీరావ్ పూలే, భీమ్‌రావ్ అంబేద్కర్‌లు గుర్తించారు. దీనికి ప్రతిస్పందనగా అగ్రకుల సంఘాలు, వారి ఎజెండాలో భాగంగా మనుస్మృతి విలువల్ని, హిందూరాజ్య భావనతో కలిపి వైభవోపేతమైన గతాన్ని గురించి వివరించడం మొదలుపెట్టాయి. ముఖ్యంగా గడిచిన కొన్ని దశాబ్దాల్లో, అన్ని కులాలు సమానమే అంటూ వారి సిద్ధాంతకర్తలు, కుల సమానత్వానికి సంబంధించిన వివిధ కులాల చరిత్ర రచనలతో బయటకు వచ్చారనే కథనాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తుంది. ఈ కులాలు విదేశీ దురాక్రమణదారుల అకృత్యాల వల్లే ఉనికిలోకి వచ్చాయనీ, ఇంతకుముందు హిందూ మతంలో వీటి ఉనికే లేదని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వాదించారు. ముగ్గురు ఆర్‌ఎస్‌ఎస్ అగ్ర నాయకులు, దళితులు, గిరిజనులు, ఇతర అనేక సమూహాల మూలాలను మధ్యయుగాల్లో ముస్లింల దండయాత్రకు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అగ్రశ్రేణి నాయకుడైన భయ్యాజీ జోషి చెప్పిన మాట ప్రకారం, "హిందూ గ్రంథాల్లో 'శూద్రులు' ఎప్పటికీ అస్పృశ్యులుగా లేరు. మధ్యయుగాల కాలంలో జరిగిన ఇస్లాం దారుణకృత్యాల ఫలితంగానే అస్పృశ్యులు, దళితులు ఆవిర్భవించారు. 'చన్వర్వంశీయ క్షత్రియుల (హిందూ మతంలో ఒక కులం) హిందూ స్వాభిమానాన్ని (గౌరవాన్ని) ఉల్లంఘించడానికి, అరబ్ నుండి వచ్చిన విదేశీ దురాక్రమణదారులు, ముస్లిం పాలకులు, గోమాంస భక్షకులు, ఆవులను చంపడం, వాటి తోలు ఒలవడం, నిర్జన ప్రదేశాల్లో వాటి కళేబరాల్ని విసిరి వేయడం వంటి అసహ్యకరమైన పనులను వారితో బలవంతంగా చేయించారు. ఆ విధంగా విదేశీ దురాక్రమణదారులు, గర్వించ దగిన హిందూ ఖైదీలకు శిక్షగా అలాంటి పనులు అప్పజెప్పడం ద్వారా చర్మ-కర్మ (చర్మానికి సంబంధించిన) అనే ఒక కులాన్ని సృష్టించారని" జోషి వివరించాడు. ఇప్పుడు కులవ్యవస్థను ఒక సానుకూల దృష్టితో, ఈ జాతిని (హిందూ) రక్షించే వ్యవస్థగా చూపించే ఒక కొత్త ప్రయత్నం జరుగుతోంది. కులగణన చెయ్యాలనే డిమాండ్ పెరుగుతుండ దంతో ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక 'పాంచజన్యం' 2024 ఆగస్టు 5న 'ఓ నాయకా, నీవు ఏ కులానికి చెందినవాడివి' అనే శీర్షికతో హితేష్ శంకర్ రాసిన వ్యాసాన్ని ప్రచురించింది. విదేశీ దురాక్రమణ దారులు కుల గోడలను బద్దలు కొట్టలేకపోయారనీ, కాబట్టి మత మార్పిడులు చేయలేక పోయారు. కులం, హిందూ సమాజం ప్రధానమైన పునాదిని కలిగి ఉంది. విదేశీ దురాక్రమణ దారులు నృపటికీ కులం, జాతిని ఆరోగ్యంగానే ఉంచిందని ఈ వ్యాసం వాదన. బొంబాయికి చెందిన మాజీ బిషప్, లూయిస్ జార్జ్ మిల్నే రచన' మిషన్ టు హిందూస్ : ఏ కాంట్రిబ్యూషన్ టు ది స్టడీ ఆఫ్ మిషనరీ మెథడ్స్' లోని ఒక అంశాన్ని ఆమోదిస్తూ ఉదహరించాడు. అది : 'అప్పుడు, అది (కులం) అవసరం కొద్దీ సామాజిక నిర్మాణంలో ఒక భాగంగా ఉంది. ఇప్పటికీ అన్ని ఆచరణాత్మక ప్రయోజనాల కోసం కులం, మిలియన్ల ప్రజలకు మతాన్ని నిర్మిస్తుంది. అది ఒకరి స్వభావానికి, మతానికి మధ్య ఒక అనుసంధానంగా వ్యవహరిస్తుంది. (హిందీ వ్యాసం నుండి అనువాదం). రచయిత చెప్పిన మాట ప్రకారం, అప్పుడు మిషనరీలకు వచ్చిన బాధే, ఈస్టిండియా కంపెనీకి, లార్డ్ ఏ.ఓ.హ్యూమ్‌ల వారసత్వం గల భారత జాతీయ కాంగ్రెస్ బాధ. దురాక్రమణదారులు కులగోడల్ని బద్దలు కొట్టలేకపోయారు కాబట్టి వారు (ముస్లింలు), ఆగ్రహంతో ఉన్న కులాలకు చెందిన వారిని సఫాయి పని చెయ్యాలని ఒత్తిడి చేశారు. ఇంతకుముందు సమాజంలో ఇలాంటి వ్యవస్థకు సంబంధించిన ప్రస్తావన లేదు. మిషనరీలు చెప్పేదాని ప్రకారం, వారు సామాజిక వెనుకబాటుతనాన్ని కుల వ్యవస్థకు ఆపాదించారు. హితేష్ శంకర్ చెప్పేదాని ప్రకారం, బ్రిటీష్ వారి వలె భారత




మిగతా 22వ పేజీలో

# కేంద్రానికి వక్ఫ్‌పై కన్నెందుకు పడింది?

- సలీమ్ పాష

**నరేంద్రమోదీ ప్రభుత్వం ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో 1995- కేంద్ర వక్ఫ్ చట్టానికి సవరణలు చేస్తూ 'వక్ఫ్ సవరణ బిల్లు -2024' తీసుకొచ్చింది. ప్రస్తుతం వక్ఫ్ బోర్డులో ఉన్న అవినీతిని, భూమాఫియాను అరికట్టి పారదర్శకతను తీసుకురావడానికి ఈ సవరణలు తీసుకొస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వాదిస్తున్నది. ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలతోపాటు మిగతా పార్టీల నేతలు ఈ సవరణ బిల్లు మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని, వక్ఫ్ ఆస్తుల రక్షణకు భంగం కలిగిస్తుందని, వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తుందని తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ బిల్లును జాయింట్ పార్లమెంటు కమిటీకి పంపింది. మొత్తం 31 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ సెప్టెంబరు 17 వరకు తన అభిప్రాయాలను కేంద్రం ముందు పెట్టబోతుంది.**

1954లో తొలిసారిగా వక్ఫ్ చట్టం రూపుదిద్దుకుంది. 1995, 2013లో కొన్ని సవరణలు జరిగాయి. ప్రస్తుత మోదీ ప్రభుత్వం మొత్తం 44 సవరణలు ప్రతిపాదిస్తూ ఈ బిల్లును తీసుకువచ్చింది. ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులలో పారదర్శకత కోసమే ఈ బిల్లు తీసుకొస్తున్నామని అన్నారు. తన ప్రసంగంలో సచార్ కమిటీ నివేదికలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ గురించి పేర్కొన్న కొన్ని విషయాలను ప్రస్తావించారు. జస్టిస్ రాజేందర్ సచార్ తన నివేదికలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ సరిగా లేదని, దీంతో రావాల్సినంత ఆదాయం రావట్లేదని అన్నారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణను పటిష్ఠం చేసి, తద్వారా మార్కెట్ రేటుకు అనుగుణంగా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని సూచించారు. బిల్లుపై చర్చ




సందర్భంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయాలనే పదేపదే వల్లెవేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన సచార్ కమిటీలో ఉన్న విషయాలనే ప్రస్తావిస్తున్నానని నొక్కి చెప్పారు. గత పదేళ్ల మోడీ పాలనలో ఒక్కసారైనా ఈ సచార్ కమిటీ నివేదికను పరిశీలించారా? వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడం కోసం ఏమన్నా చర్యలు తీసుకున్నారా? సచార్ కమిటీ సూచించిన 'ఆల్ ఇండియా వక్ఫ్ సర్వీసెస్' ఏర్పాటు చేశారా ? ఇవేవీ మచ్చుకైనా లేవు. కానీ మూడవసారి అధికారంలోకి వచ్చాక వక్ఫ్ చట్టానికి ఏకంగా 44 సవరణలు ప్రతిపాదించడం దేన్ని సూచిస్తుంది? ఇది రాజకీయ ఎజెండాలో భాగం కాదా? ముస్లింలకు తాము వ్యతిరేకంగానే ఉన్నామనే రాజకీయ ఉద్దేశాన్ని ప్రదర్శించడం కాదా? తద్వారా త్వరలో జరిగే వివిధ రాష్ట్రాలలో మెజారిటీ వర్గం ఓట్లను రాబట్టుకోవడమనే వ్యూహం ఇందులో లేదా?

ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం దేశవ్యాప్తంగా మొత్తం వక్ఫ్ ఆస్తుల విలువ రూ.లక్షా 20 వేల కోట్లు. వక్ఫ్ ఆస్తులను సక్రమంగా నిర్వహిస్తే సంవత్సరానికి వేల కోట్ల ఆదాయం వచ్చే మాట నిజమే. ఇలా వచ్చిన ఆదాయం పేద ముస్లింల విద్య, వైద్యం, సంక్షేమం కోసం ఏంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వాలకు కొంత భారం తగ్గుతుంది. కానీ వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. వక్ఫ్ గెజిట్‌లో ఉన్న ఆస్తులు పూర్తిగా వక్ఫ్ బోర్డుల ఆధీనంలో లేవు. దేశవ్యాప్తంగా అనేకచోట్ల ప్రభుత్వాల ఆధీనంలోను, ప్రైవేటు వ్యక్తుల చేతిలోను ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 70శాతం వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని నివేదిక ఉంది. వాస్తవ

విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా దేశంలోనే రైల్వే, ఆర్మీ తర్వాత అత్యధిక ఆస్తులు కలిగిన సంస్థగా వక్ఫ్ బోర్డు ఉందని కేంద్రం ప్రచారం చేస్తుంది. ఇక మోదీ భక్తులయితే వెంటనే వక్ఫ్ ఆస్తులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద హిందువులకు పంచాలని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దేవాదాయ శాఖ కింద ఉన్న భూములతో పంపకాలు మొదలుపెడితే బాగుంటుదని అడిగితే ఏమని సమాధానం చెబుతారు ? వక్ఫ్ ఆస్తులను కబ్జాలు చేసుకుంటుంది కేవలం ప్రైవేటు వ్యక్తులే కాదు, ప్రభుత్వాలు కూడా వేలాది ఎకరాలను తమ ఆధీనంలోకి తీసుకుంటు న్నాయి. అనేక రాష్ట్రాలలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు వక్ఫ్ భూములలోనే నిర్మాణమయ్యాయి. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంషాబాద్‌లో ఉన్న ఇప్పటి ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి 1100 ఎకరాల వక్ఫ్ భూమిని కేటాయించారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హజరత్ హుస్సేన్ షా వలి దర్గాకు చెందిన 1600 ఎకరాల వక్ఫ్ భూమిని బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టారు. ఈ భూమి విలువ అప్పటి మార్కెట్ ధర ప్రకారమే రూ.32 వేల కోట్లు అని అంచనా. ఈ కేటాయింపుపై వక్ఫ్ బోర్డు నాడు వక్ఫ్ ట్రిబ్యునల్‌లో కేసు వేసింది. ట్రిబ్యునల్ భూమి కేటాయింపును రద్దు చేస్తూ, ఆ భూమి వక్ఫ్ బోర్డుదేనని అంతిమ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ కంపెనీలు ప్రభుత్వ సహకారంతో హైకోర్టును ఆశ్రయించాయి. హైకోర్టు కూడా ట్రిబ్యునల్ తీర్పును సమర్థిస్తూ కేసును కొట్టి వేసింది. కంపెనీలు చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారం సరిగా లేక వక్ఫ్ బోర్డు సుప్రీంకోర్టులో కేసు ఓడిపోయింది. ప్రస్తుతం ఉన్న చట్టంలోని కొన్ని లొసుగులతో వక్ఫ్ ఆస్తులు సంరక్షించబడడం లేదు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డులకు జ్యుడీషియల్ అధికారాలు లేవు. ఇక ఈ చట్టానికి ఏకంగా 44 సవరణలు చేసిన తర్వాత వక్ఫ్ చట్టం ఎంత బలహీనంగా మారుతుందో ఒకసారి ఊహించండి.

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు తెస్తున్నది వక్ఫ్ ఆస్తులను రక్షించడం కోసం కాదు. ఈ ఆస్తులను తన ఆధీనంలోకి తెచ్చుకోవానికి. వక్ఫ్ బోర్డుల పరిధిలో ఉన్న లక్షల ఎకరాలపై కేంద్రం కన్ను పడింది. కేంద్రం తన అనుకూల పారిశ్రామికవేత్తలకు ఈ భూములను కట్టబెట్టాలని చూస్తుంది. అందుకే ఆప్ నేత సంజయ్‌సింగ్ ఇది వక్ఫ్ బిల్లు కాదు, అదానీ బిల్లు అని విమర్శించారు. బోర్డులో పారదర్శకత సాకుతో బోర్డుకు ఉన్న స్వయంప్రతిపత్తిని గుంజుకోవాలని ఆలోచిస్తుంది. పాత చట్టం ప్రకారం వక్ఫ్ ట్రిబ్యునల్ ఒక ఆస్తిని వక్ఫ్ బోర్డుదని నిర్ణయిస్తే, ఇక ట్రిబ్యునల్ తీర్పే అంతిమం. ఈ తీర్పు మీద సివిల్ కోర్టులలో ఛాలెంజ్ చేసే అధికారం లేదు. కేవలం హైకోర్టు, సుప్రీంకోర్టులలో మాత్రమే ఛాలెంజ్ చేసే అవకాశం ఉంది. నూతన సవరణ ప్రకారం ట్రిబ్యునల్ నిర్ణయమే అంతిమం కాదు. జిల్లా కలెక్టర్ నిర్ణయమే అంతిమం. ఫలానా భూమిని సర్వే చేసి అది వక్ఫ్ బోర్డుదా లేక ప్రైవేటుదా అని నిర్ణయించే అధికారం జిల్లా కలెక్టర్‌దే. అంటే ట్రిబ్యునల్ నామ మాత్రమే. చాలా కేసులలో రెవెన్యూ శాఖకు, వక్ఫ్ బోర్డుల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ఇలాంటి సందర్భాలలో జిల్లా కలెక్టర్ ఎటువైపు ఉంటారు ? ప్రభుత్వ పెద్దల మాటలను కలెక్టర్లు పూర్తిగా పెడచెవిన పెట్టే పరిస్థితి ప్రస్తుతం ఉందా ?

మరో సవరణ ప్రకారం వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులను నామినేట్ చేస్తారు. ముస్లిం ధార్మిక సంస్థలో ఇతరులకు ప్రవేశం ఏందుకు? ఈ జోక్యం దేనిని సూచిస్తుంది ? ఎండోమెంట్ కమిటీలలో ఇతర మత మైనారిటీలకు ప్రవేశం కల్పిస్తారా ? ఒక్క వక్ఫ్ బోర్డులోనే ముస్లిమేతరులు ఎందుకు ? – ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. ముస్లిం మహిళలకు బోర్డులో సభ్యులుగా అవకాశం కల్పించడం కోసం మరో సవరణ చేశారు. దీంతో ముస్లిం మహిళలకు కూడా న్యాయం జరుగుతుందని కేంద్రం అంటుంది. మరి బిల్కిస్ బానోను రేప్ చేసిన నిందితులను క్షమాభిక్ష కింద విడుదల చేసింది ఎవరు ? గత పదేళ్ల మోదీ పాలనలో ఎంత మంది ముస్లిం మహిళలకు న్యాయం చేశారు ? పాత చట్టం ప్రకారం యజమాని తన ఆస్తిని ఇష్టపూర్వకంగా డాక్యుమెంట్ చేసి వక్ఫ్ బోర్డుకు దానం చేయవచ్చు. కానీ నూతన సవరణ ప్రకారం యజమాని తన కుటుంబసభ్యుల సమక్షంలో మాత్రమే వక్ఫ్ చేయాలి. ఇలా మొత్తం 44 సవరణలు తెచ్చింది. ఈ బిల్లును బలోపేతం చేయడం కోసం కాదు, నిర్వీర్యం చేయడం కోసమే. దీంతో కబ్జాదారులకు మరింత బలం చేకూరుతుంది. వక్ఫ్ పరిపాలనలో ప్రభుత్వాల జోక్యం మరింత పెరుగుతుంది.

ప్రస్తుతం వక్ఫ్ బోర్డులలో పారదర్శకత లోపించడం, రాజకీయ జోక్యం ఉండడం, అవినీతి పేరుకుపోవడం నిజమే. అస్తులున్నా సరియైన ఆదాయం మాత్రం వక్ఫ్ బోర్డుకు రావడం లేదు. వందల ఏళ్లుగా ఒకే అగ్రిమెంట్ ప్రకారం లీజులు నడుస్తున్నాయి. కమర్షియల్ ఆస్తుల ద్వారా వచ్చే మొత్తం ఆదాయంలో కేవలం ఏడు శాతం ఆదాయం మాత్రమే వక్ఫ్ బోర్డుకు వస్తుంది. మిగతాది లీజు మేనేజ్‌మెంట్ వారికి పోతుంది. మార్కెట్ రేటుకు అనుగుణంగా లీజు ధరలు పెంచలేదు. చాలాచోట్ల వక్ఫ్ ఆస్తులకు పర్యవేక్షులుగా ఉన్న ముతవల్లీలు, ముజావర్లు ఈ ఆస్తులు తమ తాతముత్తాల పేటెంట్‌గా భావిస్తూ పెత్తనం చలాయిస్తున్నారు. వక్ఫ్ బోర్డులో నిర్వహణ లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉంది. వీటిని సాకుగా చూపి వక్ఫ్ ఆస్తులను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని కేంద్రం ప్రయత్నించడం సిగ్గుచేటు. ❑

# దారి చూపగలది..
# వ్యవసాయానికి సాయమే !



- డి.పాపారావు

ప్రస్తుతం, దేశంలో నిరుద్యోగ సమస్య చాలా తీవ్రంగా ఉంది. 2018 డిసెంబర్ నాటికే దేశంలో నిరుద్యోగం 45 సం॥ల గరిష్ఠ స్థాయిలో ఉందని జాతీయ నమూనా సర్వే గణాంకాలు వెలుగు చూశాయి. దీనికి, మోడీ ప్రభుత్వం విధానాలైన–పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్ కాలంలో పరిస్థితులన్నీ కారణమే. దీనికి, దేశీయ డిమాండ్ పతనంతోపాటు, నేడు గత అనేక సంవత్సరాలుగా ప్రపంచ మార్కెట్‌లో పడిపోతున్న ప్రజల కొనుగోలు శక్తీ, డిమాండ్లు మరో ప్రధాన కారణం. ఈ కారణాల చేతనే 2023 ఆర్థిక సంవత్సరంలో దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 22% (అంతకు ముందటి సంవత్సరం కంటే) అంటే $ 46 బిలియన్లకు పడిపోయాయి. ఇక, అదే కాలంలో స్టాక్ మార్కెట్‌లోకి వచ్చిన పెట్టుబడులను ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో కలిపితే, దేశంలోకి వచ్చింది $ 70.97 బిలియన్లుగా ఉంది. కాగా, అంతకుముందరి సంవత్సరంలో ఈ మొత్తం $ 84.83 బిలియన్లుగా ఉంది. ఇది, దేశీయంగా డిమాండ్ తగ్గుదలను సూచిస్తోంది. మరోప్రక్కన, భారతదేశం నుంచి విదేశాలకు పెట్టుబడులుగా వెళ్ళిన మొత్తం 2023 లో, దానికి ముందరి సంవత్సరం కంటే 50% మేరన అంటే, $ 23.50 బిలియన్లకు మందగించింది. ఇది, అంతర్జాతీయంగా డిమాండ్ పతనాన్ని సూచిస్తోందని రిజర్వు బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. ఇక్కడ స్థూలంగా మనం గమనించవలసిన మరో అంశం ఉంది. అది, అంతర్జాతీయంగా ప్రజల కొనుగోలు శక్తి పతనంకంటే – మన దేశంలోని ప్రజల కొనుగోలు శక్తి పతనం మరింత అధికంగా ఉంది అనేది. దీనికి తార్కాణంగా మనం 1992–2012 కాలంలో, సరుకుల వ్యాపారంలో మన దేశం తాలూకు లోటు (ఎగుమతి–దిగుమతుల మధ్యన వ్యత్యాసం) సాలీన సగటున కేవలం $ 11 బిలియన్లుగా ఉండగా, అది ప్రస్తుత దశాబ్ద కాలంలో సాలీన సగటున $ 150 బిలియన్లకు పెరిగిపోయింది. అంటే, మన దేశం ఎగుమతి చేస్తోన్న దాని కంటే, దిగుమతి చేసుకుంటున్న సరుకుల విలువ నేడు పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో చూస్తే, దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో – సరుకు ఉత్పత్తి రంగం తాలూకు వాటాను పెంచడం కోసం అంటూ, 2014 సెప్టెంబర్లో ఆరంభమైన "మేకిన్ ఇండియా" కార్యక్రమం విఫలమైంది. నిజానికి ఈ పథకం ఆరంభం తర్వాత, దేశంలో సరుకు ఉత్పత్తిరంగం ఎదగకపోగా, మరింత కుంచించుకుపోయింది. అలాగే,



2019లో ఉత్పత్తిని పెంచేందుకు కార్పొరేట్లకు ప్రోత్సాహకం పేరిట, 32% నుంచి 22% మేరకు తగ్గించిన కార్పొరేట్ పన్ను రేటు దేశంలో పెట్టుబడులను ఏ మాత్రం పెంచలేకపోయింది. దీనితోపాటు 2020 నుంచి కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల పేరిట – పి.ఎల్.ఐ పథకాన్ని తెచ్చింది. 14 రంగాల కార్పొరేట్ ఉత్పత్తి సంస్థలకు ఈ పథకం కింద రాయితీలు ఇస్తోంది. అయినా, ఫలితం అంతంత మాత్రమే. కేవలం 2–3 పారిశ్రామిక రంగాలలో మాత్రమే కొద్ది మేరకు పెట్టుబడులు పెరిగాయి. నిజానికి, ఈ పథకం కాస్తంత సానుకూల ఫలితాన్ని సాధించింది అనుకున్న – స్మార్ట్ ఫోన్ల రంగంలో ఎగుమతులు, 2023 జులై నాటికి వరుసగా రెండు త్రైమాసికాలలో వరుసగా పతనమయ్యాయి. ఇటు దేశీయంగానూ, అటు అంతర్జాతీయంగా కూడా ప్రజల ఆర్థిక స్థితిగతులలో దిగజారుడే దీనికి కారణం. కాబట్టే, నేడు మన ప్రధానమంత్రి మొదలుకొని.. ఆర్థికమంత్రి వరకూ – మీ కోసం మేం చాలా రాయితీలు ఇచ్చాం.. కాబట్టి మీరు మరిన్ని పెట్టుబడులు పెట్టాలంటూ, ప్రైవేట్ కార్పొరేట్ రంగానికి హితబోధ చేస్తున్నారు. అయితే, దేశంలో జనాల కొనుగోలు శక్తీ.. డిమాండ్ లేని పరిస్థితిలో, ఇప్పుడు మరిన్ని పెట్టుబడులు పెట్టలేమంటూ, అనేక మంది పారిశ్రామికవేత్తలు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. అదీ విషయం..!

ఇక, మరోపక్కన దేశీయ సేవారంగం పరిస్థితి అంతంత మాత్రమే. సేవా రంగంలోని కీలక విభాగాలైన–ఐ.టి., బి.పి.ఓ రంగాలలో నేడు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. భారతదేశంలోని ప్రధాన ఐ.టి. కంపెనీలలో, 2024 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నాటికి ఉద్యోగుల సంఖ్య, అంతకుముందరి కాలం కంటే తగ్గిపోయింది. దేశీయ స్టార్టప్స్‌కు

కూడా నిధులు 38% మేర పడిపోయాయి. ఇక, ఈ స్టార్టప్‌లు కూడా – నేడు ఉపాధి కల్పన జరగకపోగా... ఉన్న ఉపాధి పోతోంది. ఈ విధంగా, అటు దేశీయ సరుకు ఉత్పత్తిరంగం, ఇటు సేవా రంగాలు ఉత్పత్తి, ఉపాధి కల్పనలో దిగజారుడునే చూపుతున్నాయి.

ఇక, మిగిలింది దేశీయ వ్యవసాయ రంగం. నేడు, గ్రామీణ ప్రాంతాలలో – వ్యవసాయ ప్రధాన జీవనాధారంగా ఉన్న వారి సంఖ్య 48.3%. దీనికి, ఎంతో కొంత వ్యవసాయం ఆధారంగా జీవించే వారిని కలిపితే – ఈ సంఖ్య 60% మేరకు ఉంటుంది. ప్రస్తుతం, గ్రామీణ రైతు కుటుంబం తాలూకు నెలవారీ సగటు ఆదాయం 10,218/- రూపాయలు మాత్రమే. ఇది జాతీయ తలసరి సగటు ఆదాయం అయిన 10,495/- రూపాయలకంటే తక్కువే. మరో రకంగా చెప్పుకుంటే, నేడు దేశీయ స్థూల జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా సుమారు 15% మేర ఉంది. కాగా, సేవా రంగం వాటా 60-65 శాతం మేర.. సరుకు ఉత్పత్తి రంగం వాటా 20-22% మేర ఉన్నాయి. దీనర్థం, దేశ జనాభాలో 60% మేర ఉన్న గ్రామీణ జనాభాకు దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో దక్కుతోంది కేవలం 15% వాటాయే. అంటే, దేశ స్థూల జాతీయ ఉత్పత్తి సాలీన 100 రూపాయలు అనుకుంటే, దానిలో 60% వ్యవసాయ ఆధారిత జనాభాకు దక్కుతోంది కేవలం 15 రూపాయలే. దీనిని బట్టి నేటి మన గ్రామీణ జనాల తాలూకు ఆర్థికస్థితి ఎంత తక్కువ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దేశ జనాభాలోని అత్యధికులు ఇంకా వ్యవసాయ రంగంలోనే ఉండిపోవడం.. వారి ఆదాయాలు నామమాత్రం కావడాలు దురదృష్టకరం. కానీ, ఈ ప్రతికూలతలోనే – నేడు మనం దేశీయంగా మెరుగైన ఉపాధి కల్పనకు.. డిమాండ్ పెంపుదలకు అవకాశాలను వెతుక్కోవచ్చు. మరింత వివరంగా చెప్పాలంటే, ఈ 60% వ్యవసాయ ఆధారిత గ్రామీణ జనాభా ఆదాయాలను పెంచగలిగితే గనుక, అది దేశీయంగా మెజారిటీ జన సామాన్యం కొనుగోలు శక్తిని పెంచుతుంది. అంటే, దేశీయంగానే – మార్కెట్‌లో సరుకులకూ... సేవలకు కూడా డిమాండ్ పెరుగుతోంది. ఆ మేరకు, దేశంలో ఉపాధి కల్పన పెరుగుతుంది. మరి దీనికోసం – అంటే, వ్యవసాయ ఆదాయాల పెంపుదలకు చేయవలసింది ఏమిటి ?

దీనికి ఒకటే జవాబు. వ్యవసాయదారులకు, వారి ఉత్పత్తులకు గాను – కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయడం. తద్వారా గ్రామీణ వ్యవసాయం – నేడు ఉన్నటువంటి, నష్టాల నుంచి బయటపడి, లాభసాటిగా మారుతుంది. 'గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇన్‌క్యుబేటర్' అనే సంస్థ ఇచ్చిన నివేదిక మేరకు – మన దేశ గ్రామీణ యువజనులలోని 70%-85% మంది – తక్కువ నిపుణతలు అవసరమైన చిన్న సరుకు ఉత్పత్తి రంగంలోనూ లేదా రిటైల్ రంగంలోనూ ఉపాధిని కోరుకుంటున్నారు. అంటే, వారు లాభసాటిగా లేని వ్యవసాయం నుంచి బయటపడాలని అనుకుంటున్నారు. కానీ, వారిలోని 60% మంది ఉపాధి కోసం తమ గ్రామాన్ని విడిచి వెళ్లాలని కోరుకోవడం లేదు. నిజానికి, కోవిడ్ అనంతర కాలంలో – నగర ప్రాంత కార్మికులలోని పెద్ద విభాగం – నేడు తిరిగి తమ గ్రామాలకు వెనక్కు వెళ్లిపోయింది. నేడు నగర ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు బలహీనంగా ఉండడంతో వీరిలోని అత్యధికులు నేడు, తిరిగి నగరాలకు వచ్చేందుకు సిద్ధంగా లేరు. అదీ విషయం..!!

గ్రామీణ రైతాంగ ఆదాయాలు పెరిగితే, అది దేశీయంగా డిమాండ్ కల్పనను ఏ విధంగా తేగలదనేదానికి ఇక్కడ ఒక ఉదాహరణ చెప్పుకోవచ్చు. 2006-07లో నిజామాబాద్ జిల్లాలో – పసుపు పంట బాగా పండింది.. అలాగే, ఆ సంవత్సరంలో ఆ పంటకు అంతర్జాతీయంగా భారీగా ధర పలికింది. ఫలితంగా, పసుపు రైతులు- చాలామంది – స్వంత గృహాలు నిర్మించుకున్నారు. కార్లు, బైకులు కొనుక్కున్నారు. టి.విలు, ఫ్రిజ్ లవంటి గృహోపకరణాలు కొనుక్కున్నారు. ఇక్కడ గమనించవలసింది, రైతుకు గనుక మంచి ఆదాయం ఉంటే... అంటే వ్యవసాయం లాభసాటిగా ఉంటే – పై సందర్భంలో లాగా – అది గృహ నిర్మాణ రూపంలో : సిమెంట్, స్టీలు వంటి పారిశ్రామిక సరుకులకు... అలాగే, వాహనాల, గృహోపకరణాల వంటి పారిశ్రామిక ఉత్పత్తులకు డిమాండ్‌ను పెంచుతుంది. ఈ పారిశ్రామిక సరుకుల ఉత్పత్తి కేంద్రాలుగా నగరాలు ఉంటాయి. కాబట్టి, గ్రామీణ కొనుగోలు శక్తి పెరుగుదల – దేశంలోని నగర ప్రాంతాలలో పారిశ్రామిక రంగానికి ఊతాన్ని ఇచ్చి, తద్వారా నగరాలలో కొత్త ఉపాధి కల్పనకూ.. డిమాండ్ పెరుగుదలకూ కారణం కాగలదు. అంటే, దేశీయంగా వ్యవసాయ రంగానికి గిట్టుబాటు ధరను కల్పించడం ద్వారా – నేటి ప్రపంచవ్యాప్త ఆర్థిక మందగమనం.. డిమాండ్ పతనం కాలంలో మనకు మనమే దేశీయంగా డిమాండ్‌ను సృష్టించుకోగలం. ప్రస్తుత స్థితిలో దేశ జనాభాలోని కేవలం 20-30% మంది కొనుగోలు శక్తిపై ఆధారపడి ఉన్న మార్కెట్‌కంటే – వ్యవసాయం లాభసాటిగా ఉంటే, ఉండే 60% మంది జనాభా తాలూకు అధిక కొనుగోలు శక్తి – దేశీయ మార్కెట్‌కూ, ఉపాధి కల్పనకూ అత్యుత్తమమైన స్థితిగా ఉండగలదు. అదీ విషయం.

కాగా, నేడు కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి కనీస మద్దతు ధరకు, చట్టబద్ధతను కల్పించేందుకు సిద్ధంగా లేదు. మరి దీనికి కారణం ఏమిటి ? జవాబు సులువే..!! 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత – వ్యవసాయానికీ.. దేశీయ గ్రామీణ ప్రాంతాలకు వ్యతిరేకమైన నగర ప్రాంత కార్పొరేట్లకు

**(మిగతా 24వ పేజీలో)**

# ఖనిజ సంపద ప్రజలదే !



-డా॥ కొల్లా రాజమోహన్

**కొన్ని రాష్ట్రాలలో అపారమైన ఖనిజ సంపద వుంది. అయినప్పటికీ ఆ ప్రాంతంలోని సామాన్య ప్రజలు కడు పేదరికంలో జీవిస్తున్నారు. ఖనిజ సంపద నుంచి వచ్చే ఆదాయం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు, దేశ విదేశాల్లో వున్న పెద్ద కంపెనీలకు చేరుతున్నది. ఒరిస్సాలో ఇనుప ఖనిజాలు ఉన్నాయి. చత్తీస్‌గఢ్‌లో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. కేరళలో థోరియం లభిస్తుంది. ఈ ఖనిజాలను ముడి పదార్థాలుగా జపాన్, చైనా వంటి దేశాలు ఉపయోగించి తమ సంపదను పెంచుకుంటున్నాయి.**

ఆంధ్రాలోని గ్యాస్, చమురు నిక్షేపాలు రిలయన్స్ లాంటి కంపెనీలకు లాభాలను ఇస్తున్నాయి. ఈ ఖనిజ సంపద ఉన్నందువల్ల స్థానిక ప్రజలకు ఉపయోగం ఏమీ లేకపోగా ఈ ఖనిజాలను వెలికి తీసినందు వలన అనేక దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వత్తాసు వున్న బడా కంపెనీలు, దళారీలు ప్రజల కళ్లల్లో దుమ్ము కొట్టి లాభాలు గుంజుకుంటున్నారు. ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. చదువు ఖరీదైంది. నిరుద్యోగం ఎక్కువవటం వల్ల యువత దారి తప్పుతున్నారు. పైగా ఖనిజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలపై దాడుల ఉధృతి మరింత పెరుగుతోంది. పేదరికంలో వున్న ఆ రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదపై పన్ను విధించడానికి హక్కు లేదన్నారు. అందుకనువైన చట్టాలను చేసుకుంటున్నారు. రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తిని పక్కన పెట్టారు. రాష్ట్రాలపై పెత్తనం చేస్తూ ఆర్థిక వనరులన్నీ కేంద్ర ప్రభుత్వం చేతిలోకి తీసుకొని బడా కంపెనీలకు ఊడిగం చేస్తూ ప్రజలను పేదరికంలోనే వుంచుతున్నారు. అదేమన్న వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారు. పాలక వర్గాలకు అనుకూలమైన చట్టాలను చేసుకుంటున్నారు.

### పాలక వర్గ అనుకూల చట్టాలు

- 1) రాజ్యాంగంలోని 246 ఆర్టికల్‌ను ఉపయోగించి 1957లో మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్



(ఎం.ఎం.డి.ఆర్) చట్టాన్ని చేశారు. ఈ చట్టం కింద సెక్షన్9 ద్వారా సంక్రమించిన అధికారాలను అడ్డు పెట్టుకుని, రాయల్టీని కేంద్ర ప్రభుత్వానికే చెల్లించాలన్నారు. ఫలితంగా ఖనిజ సంపద వున్న ప్రజలను, ప్రాంతాలను నిత్య పేదరికంలో ఉంచారు. పాలక వర్గం, దళారీలు, దేశ విదేశీ కంపెనీలు లాభపడ్డాయి.

- 2) లైమ్‌స్టోన్ ఖనిజాన్ని వెలికి తీస్తున్న ఇండియా సిమెంట్స్‌పై తమిళనాడు ప్రభుత్వం రాజ్యాంగం 7వ షెడ్యూల్‌లోని రాష్ట్ర జాబితాలోని 49, 50 ఎంట్రీల ప్రకారం భూమి పన్ను విధించింది. 1957లో చేసిన ఎం.ఎం.డి.ఆర్ చట్టాన్ని అడ్డం పెట్టుకుని రాయల్టీపై సెస్, పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఏడుగురు సభ్యులున్న సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. రాయల్టీ అంటే పన్ను అన్నారు (ఇండియా సిమెంట్స్ వర్సెస్ తమిళనాడు గవర్నమెంట్ కేసు).
- 3) మరొక ప్రఖ్యాత కేసులో రాజ్యాంగ బెంచ్ పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందన్నారు. రాయల్టీ అంటే పన్ను కాదన్నారు. అంతకుముందు వున్న తీర్పులన్నిటికీ భిన్నమైన తీర్పు ఇచ్చారు. కేశోరామ్ ఇండస్ట్రీస్ వర్సెస్ వెస్ట్ బెంగాల్ రాష్ట్రం మధ్య నడిచిన కేసులో, రాజ్యాంగ బెంచ్ అందుకు విరుద్ధమైన తీర్పు ఇచ్చింది.

### చారిత్రాత్మక తీర్పు

జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం 2024 సంవత్సరం జూలై 25న ఒక చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్రాల అధికారాన్ని, ఫెడరలిజం స్ఫూర్తిని

నిలబెట్టేదిగా ఉన్నది. ఖనిజాలను వెలికి తీసే భూమిపై పన్నులు, సెస్ వంటి లెవీలు విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని, కేంద్రానికి ఆ హక్కు లేదని 8-1 మెజార్టీతో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో 1999 నుండి ఉన్న సివిల్ అప్పీల్ నెంబర్లు 4056, 4064 నుండి ఇప్పటి వరకు వున్న అతి పురాతనమైన కేసులన్నీ పరిష్కరింపబడ్డాయి.

## తీర్పులో ముఖ్యమైన అంశాలు

ఖనిజ హక్కులపై పన్ను విధించే శాసనాధికారం రాష్ట్ర శాసన సభలకు ఉంటుంది. కేంద్ర జాబితాలోని ఎంట్రీ 54 కింద ఖనిజ హక్కులపై పన్ను విధించే శాసనపరమైన సామర్థ్యం పార్లమెంటుకు లేదు. ఇది జనరల్ ఎంట్రీ. మినరల్ హక్కులపై పన్ను విధించే అధికారం రాష్ట్ర జాబితా 2లోని ఎంట్రీ 50లో పేర్కొనబడినందున, ఆ విషయానికి సంబంధించి పార్లమెంటు తన విశేష అధికారాలను ఉపయోగించజాలదు.

గనులు, క్వారీలతో కూడిన భూములపై పన్ను విధించేందుకు రాష్ట్ర జాబితా 2లోని ఎంట్రీ 49తోపాటు ఆర్టికల్ 246 ప్రకారం రాష్ట్ర శాసనసభలు శాసన సామర్థ్యాలను కలిగి ఉంటాయి. లిస్ట్ 2లోని ఎంట్రీ 50కి సంబంధించి ఖనిజాభివృద్ధికి సంబంధించిన చట్టంలో పార్లమెంటు విధించిన 'పరిమితులు' లిస్ట్‌లోని ఎంట్రీ 49పై పనిచేయవు. ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం ఆ ప్రభావానికి ఎటువంటి నిర్దిష్ట నిబంధన లేదు. అయితే కోర్టు విచారణలో ఆయిల్ ఫీల్డ్స్, మినరల్ ఆయిల్ రిసోర్సెస్, పెట్రోల్, పెట్రోలియం ఉత్పత్తుల గురించి లేకపోవడం విచారకరం. 438 మంది పిటిషన్‌దారులు గాని, ప్రభుత్వం గానీ పెట్రోలియం ఉత్పత్తుల గురించి అడగనందు వలన సుప్రీంకోర్టు విచారణలో లేవని అత్యున్నత ధర్మాసనం తెలియజేసింది. ఇనుప ఖనిజం, బొగ్గు, మైకా, గ్రానైట్, బాక్సైట్, యురేనియం వంటివే కాకుండా భూమిలో లభించే శిలాజ ఇంధనాలను(చమురు, సహజ వాయువులను) అన్ని దేశాలలో ఖనిజ సంపదగా పరిగణిస్తారు. ఏ డిక్షనరీ చూసినా, పదవ తరగతి విద్యార్థిని అడిగినా ఖనిజ సంపద అంటే ఏమిటో చెబుతారు.

**పెట్రోలియం ఉత్పత్తులు, గనులు లాంటి నిక్షేపాలు వున్న రాష్ట్రాలు ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలుగా తక్కువ ఆదాయంతో ఉన్నాయి. సహజ వనరులు బాగా ఎక్కువగా ఉన్నటువంటి రాష్ట్రాలు చాలా పేద రాష్ట్రాలుగా ఉన్నాయి. ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు అపారంగా ఉన్న రష్యా, అమెరికా, ఇరాన్, సౌదీ దేశాలు సంపద్వంతంగా వున్నాయి. మనకు గ్యాస్, ఆయిల్ దండిగా వున్నా మన రాష్ట్ర సంపద పెరగలేదు. అంబానీ సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నది. రాష్ట్రంలో లభించే ఖనిజ సంపదలన్నిటిపైనా ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గమైన అంబానీ లాంటి వారి ఆధిపత్యం కొనసాగుతున్నది.**

## స్వర్ణ సింహాసనాలు - రైతుల ఆత్మహత్యలు

సహజ వనరులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి ఉత్పత్తిలో 50 శాతం కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ కూడా చెప్పింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల వాదనలను పెడచెవిన పెట్టింది. 50 శాతం వాటా ఇవ్వలేదు. పన్ను విధించే హక్కు లేదన్నారు. కష్టాలు మనకు, సంపద కార్పోరేట్ కంపెనీలకు వెళుతుంది. భూమి లోపల కొన్ని లక్షల సంవత్సరాల పరిణామాల ఫలితంగా ఖనిజాలు, సహజ వాయువు, చమురు ఏర్పడుతుంది. అటువంటి విలువైన ఖనిజ సంపదను కొద్దిమంది ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గానికి కట్టబెడుతున్నారు. ప్రపంచ ధనవంతుల జాబితాలో ప్రథమ స్థానం కోసం పోటీ పడుతున్నారు. రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి పెళ్ళిళ్ళు చేస్తున్నారు. మరోవైపు తాళిబొట్టు తాకట్టు పెట్టి వ్యవసాయం చేస్తున్న రైతుల ఆత్మహత్యల నివారణకు సహజ వనరులను ఉపయోగించాలనే కనీస బాధ్యత పాలకులకు లేనందున ప్రజలు కష్టాలతోనే జీవిస్తున్నారు.

ఖనిజాలు భూమి నుంచి వెలికి తీసిన ఫలితంగా భూమిలో, పర్యావరణంలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. భూగర్భ జలాలు, చెరువులు, బావులు, గాలి కలుషితమై, వాతావరణ దుష్పరిణామాల వల్ల కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులు, గుండెజబ్బులు, క్యాన్సర్ బారిన పడ్డ ప్రజలు కనీస వైద్య సదుపాయాలు లేక నరకం చూస్తున్నారు. అపారమైన సహజ సంపదను బడా కార్పోరేట్ కంపెనీలకు అప్పచెప్పి ఆదివాసీలను గాలికి వదిలేశారు. సహజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలకు కనీస జీవన సౌకర్యాలను కలగచేయటంలో విఫలమయ్యారు.

కె.జి బేసిన్‌లో లభ్యమయ్యే గ్యాస్, ఆయిల్‌తో సహా, పన్ను విధించే రాజ్యాంగపరమైన హక్కు మనకున్నదని చెప్పాలి. అందుకు జులై 25 సుప్రీంకోర్టు తీర్పును ఉదహరించాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఇతర ఖనిజాలతోపాటు గ్యాస్, చమురును చేర్చాలని సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రాలలో లభించే ఖనిజ వనరులపై రాష్ట్ర ప్రభుత్వం పన్ను విధించాలి. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్టీలకు అతీతంగా అందరూ సమైక్యంగా ముందుకు కదలాల్సిన తరుణం ఆసన్నమైంది. ❑

# తీరం దాటనున్న సరికొత్త సనాతన 'తుఫాన్'

- అశోక్ కుంబము



దోపిడీ కుల, వర్గ వ్యవస్థల్లో నాటకాలు, బూటకాలు ఎన్నికలకే పరిమితం అనుకుంటే పొరపాటే. పాలకులు వ్యవస్థల్లో తమ కుల, వర్గ పెత్తనాన్ని, యథాతథ స్థితిని కొనసాగించ దానికి నాటకాలను తమ దినచర్యలో భాగం చేసుకుంటారు. ఎన్నికల ఫలితాలను బట్టి ప్రదర్శనా స్థలం మారుతుంటుంది. నాటకంలో ప్రధాన వేషధారి పాత్రలు మారుతుంటాయి. కానీ నాటక స్వభావం, దాని అంతిమ లక్ష్యం మారదు. రాజకీయ నాటకం లక్ష్యం మోసం (deception), నిత్య దోపిడీ, పీడన, అణిచివేతల నుండి ప్రజల దృష్టి మళ్లించడం (diversionary tactics). ఇక వీటికితోడు మతోన్మాదం, దానిచుట్టూ ఉండే భావోద్వేగాలను ఆసరా చేసుకొని, తన వ్యక్తి ఆరాధనను (personality cult) పెంచుకొని దాని ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలనుకునే narcissist వ్యక్తిత్వం. ఇంకేం కావాలి నాటకం రక్తి కట్టడానికి! వ్యక్తి ఆరాధన అభిమానుల కళ్లకు గంతలు కట్టేస్తుంది. తమ నాయకుడు ఏ మచ్చలేని వాడని, ఇంకాస్త పిచ్చి ముదిరి "దేవుడి" లాంటి వాడని ఒక సామాజిక, మానసిక రోగస్థితొకటి నిర్మాణమవు తుంది. ఇలాంటి వ్యక్తులు అధికారంలో ఉంటే ఇక వారి పిచ్చి చేష్టలకు అడ్డూ అదుపూ ఉండదు. మంద స్వామ్యాన్ని ఉసిగొలుపుతూ, ఊగి పోతూ రాజకీయ ప్రదర్శనల్లో (political spectacle) విజృంభిస్తారు. అది చూసి సగటు మనుషులు "దేశోద్ధారకుడు" బయలుదేరాడని భ్రమపడతారు. అయితే ఈ మొత్తం వ్యవహారాన్ని దూరం నుండి చూసే నాబోటి వాళ్ళు ఒక సంఘటనగా భావించి ఊరుకోవచ్చు. కానీ అది విద్వేషమవుతున్న దేశ సామాజిక, రాజకీయ వాతావరణంలో నాటబడుతున్న ఒక విషపు మొక్క అని అర్థమయినప్పుడు, "తుఫాన్" అని ఫాసిస్టు శక్తులచే కీర్తింపబడి తీరం దాటబోతున్న పెను ప్రమాదాన్ని హెచ్చరించడం కనీస బాధ్యత.

నటుడు ప్రకాశ్‌రాజ్ అన్నట్లు, "తిరుపతి లడ్డూ వ్యవహారం"లో ఏదైనా తప్పిదం జరిగివుంటే తన చేతిలో ఉన్న అధికార యంత్రాంగాన్ని, చట్టాలను సరిగ్గా ఉపయోగించి పరిశోధన చేయించవచ్చు. అవసరమైతే నిందితులకు శిక్షలు వేయవచ్చు. కానీ, అలా చేస్తే చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు ప్రయోజనం ఏమీ ఉండదు. అందుకే, ఇప్పటికే హిందుత్వశక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిన పవన్ కల్యాణ్ తనలోని సనాతనవాదిని బయటకు తెచ్చి ఒక ప్రదర్శన చేశాడు. ఆ సందర్భంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు, తెలుగు నేల మీద వీచబోయే కాషాయ విషపు గాలులకు సంకేతంగా అనిపిస్తున్నాయి. అతిగా ఆలోచిస్తున్నామా?



అని అనిపించినా, నిస్సందేహంగా పవన్ కల్యాణ్ ఇప్పటి, రేపటి తరాన్ని పూనకాలవైపు నడిపించగలిగే ఆకర్షణ శక్తి వున్న వ్యక్తి. ఇలాంటి వాళ్ళు మతోన్మాద రాజకీయాలను అధికారానికి మార్గంగా ఎంచుకుంటున్నారంటే అది ఒక పెద్ద ప్రమాద సూచిక. తన వీరాభిమానుల చేత "భారతీయ చెగువేరా"గా కీర్తింపబడే పవన్‌కల్యాణ్ తెర మీద ఎలా నటించినా, "వీధి" నాటకాలలో మాత్రం మంచి నటననే ప్రదర్శిస్తున్నాడు. నిజమే, కొందరికి వచ్చే బిరుదులకు వాళ్ళ అసలు నైజానికి ఎలాంటి సంబంధం ఉండదు. బహుశా "చె గువేరా" అనే కీర్తి కిరీటం పవన్ కల్యాణ్‌కు పెట్టడం మన సమాజ చైతన్యస్థాయిని కూడా చెబుతుంది. ఇప్పుడు ఆ "వీధి నటుడు" చెగువేరా కాస్ట్యూమ్ తొలగించుకుని "వీర" సావర్కర్‌ను తగిలించుకుంటు న్నాడు. బహుశా చెగువేరా కలలుగన్న సోషలిస్టు సమాజపు ఓనమాలు కూడా అర్థం కాలేదనుకుంటా. అందుకే నిచ్చెనమెట్ల కుల, వర్గ, లింగ దోపిడీ వ్యవస్థను సుస్థిరం చేసే సనాతనాన్ని ఎత్తుకుంటున్నాడు. ఈ సనాతనంలోనే అంటరానితనం, మహిళల మీద హింస, పీడిత కులాల, వర్గాల దోపిడీని "శాస్త్రబద్ధంగా" సమర్థించే, అమలు చేసే విధానం ఉన్నదని ఆయనకు తెలవదని అనుకుందామా! లేక ఆ హింసే పునాదిగా తన రాజకీయ జీవితాన్ని మరింత పటిష్టం చేసుకుంటున్నాడని భావిద్దామా?

పవన్ కల్యాణ్ ఒక వ్యక్తిగా మాట్లాడితే, 'సరేలే, ఆయన మనోభావాలు దెబ్బతిన్నాయేమో కాబట్టి అంతగా బాధ పడుతున్నాడు' అని అనుకోవచ్చు. కానీ ఆయన తన ప్రెస్‌మీట్‌లో ఉపముఖ్యమంత్రిగా ఊగిపోయాడు. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నాడు. కానీ రాజ్యాంగం ఏం చెబుతుంది ? దానిలోని సెక్యుల

రిజానికి అసలు అర్థమేంటి ? అనేవి ఏవీ ఆయనకు పట్టేలా లేవు. సెక్యులరిజాన్ని ఒక విశాల రాజకీయ విలువల చట్రం నుండి కాకుండా "అది ఒక దారి కాదు, రెండు దారుల" సంగతిగా చూసే మిడిమిడి జ్ఞానం ఆయన సంఘ్ శక్తుల నుండి అందిపుచ్చుకున్నాడేమో! అంబేద్కర్ అయితే సెక్యులరిజాన్ని కేవలం రాజ్యం, మతం మధ్య ఉండే ఒక విభజన రేఖగా మాత్ర మే చూడలేదు. ఇంకా ముందుకెళ్ళి సెక్యులరిజమంటే హేతుబద్ధ ఆలోచనలకు తావిచ్చే ఒక రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వాతావరణం అని ఆలోచనలు చేశాడు. ఈ దృష్టితోనే బౌద్ధం తప్ప మరే మతం కూడా సెక్యులర్‌గా ఉండగలిగే అవకాశం లేదని ప్రకటించాడు.

పవన్ కల్యాణ్ కేవలం లడ్డు వ్యవహారం దగ్గర ఆగలేదు. అవసరం లేకపోయినా ముస్లిం, క్రిస్టియన్ మందిరాలతో ఒక పోలిక తెచ్చే పని చేశాడు. "మేము", "వాళ్లు" అనే గీత గీసే ప్రయత్నం చేశాడు. హిందుత్వంలో హింసకు తావు లేదని, గుజరాత్‌లో త్రిశూల హింసకు బలైన రెండు వేల మంది ముస్లిముల సాక్షిగా చెప్పాడు. అంతకంటే విడ్డూరంగా, తాను criminalization of politics కు వ్యతిరేకమని ప్రకటించాడు. ఆయన ఆవేశంలో తనకు తోచిన పదాలన్నీ పేర్చుకుంటూ పోయాడనిపిస్తుంది. దేశంలో ప్రజావ్యతిరేక రాజకీయార్థిక, సాంస్కృతిక నిర్ణయాలను సూత్రబద్ధంగా విమర్శించే, ప్రతిఘటించే అన్ని గొంతుకలను (గాంధేయ వాదుల నుండి మావోయిస్టుల వరకు) అణచివేస్తుంటే, పవన్ కల్యాణ్ కళ్లకు ఏదీ కనబడనట్లే నటిస్తున్నాడు.

ఈ నటుడు అంతటితో ఆగక, "మౌనం భావితరాలకు ప్రమాదం" అని కూడా ప్రభోదిస్తున్నాడు. ఒకవైపు మౌనం వీడమంటున్నాడు. మరోవైపు మీరు నాస్తికవాదులైతే, హేతువాదులైతే, లౌకికవాదులైతే నోరు మూసుకుని ఇంట్లోనే ఉండండని ఒక సుతిమెత్తని హెచ్చరిక జారీ చేస్తున్నాడు. ఇలాంటి హెచ్చరికలు ప్రజాస్వామిక విలువలను, భావాలను నేరమయం చేయడమే అనే విషయాన్ని ఆయనకు ఎవరు స్క్రిప్ట్ రాసి ఇవ్వాలి?!

ఇవన్నీ చూస్తుంటే గందరగోళంగా అనిపిస్తుంది. కానీ, ఇవేవీ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం కుట్రల వెలుపల జరగడం లేదు. తెలుగు నేల మీద తమ అహేతుకతను, అలౌకికతను, ఆధిపత్య భావనలను, మైల రాజకీయాలను (చట్టాన్ని వదిలిపెట్టి, ప్రక్షాళన దీక్షలు అందుకే!), మెజారిటేరియన్ భ్రమలను గాలి వేగంగా ప్రచారం చేయడానికి సనాతనవాదులకు అందివచ్చిన ఆయుధం పవన్ కల్యాణ్. అందుకే, తనను తప్ప మరెవ్వరినీ ఎప్పటికీ పొగడని మోదీ, ఆయనను "పవన్ కాదు, తుఫాన్" అని పొగడ్తలలో ముంచేశాడు. అయితే బహుశా పవన్ కల్యాణ్‌కి కూడా అర్థమయ్యింది ఏమంటే, తాను భవిష్యత్తులో స్వతంత్రంగా ఎదిగి ముఖ్యమంత్రి కావాలంటే, చైతన్య పూరి

# మన సంస్కృతి

**-దేవరకొండ బాలగంగాధర తిలక్**

మన సంస్కృతి నశించిపోతూందన్న
మన పెద్దల విచారానికి
మనవాడు పిలక మాని క్రాపింగ్ పెట్టుకున్నాడనేది ఆధారం
మనగలిగినదీ కాలానికి నిలబడగలిగినదీ వద్దన్నా పోదు
మరణించిన అవ్వ నగలు
మన కాలేజీ అమ్మాయి ఎంత పోరినా పెట్టుకోదు
యుగయుగానికీ స్వభావం మారుతుంది
అగుపించని ప్రభావానికి లొంగుతుంది
అంతమాత్రాన మనని మనం చిన్నబుచ్చుకొన్నట్లు ఊహించకు
సంతత సమన్వయావిష్కృత వినూత్న వేషం ధరించడానికి
జంకకు
మాధుర్యం, సౌందర్యం, కవితా
మాధ్వీక చషకంలో రంగరించి పంచి పెట్టిన
ప్రాచేతస కాళిదాస కవి సమ్రాటులనీ,
ఊహా వ్యూహోత్కర భేదనచణ
ఉపనిషదర్థ మహోదధినిహిత మహిత రత్నరాసుల్నీ
పోగొట్టుకునే బుద్ధిహీనుడెవరు?
విధవలకీ వ్యాకరణానికీ మనుశిక్షాస్మృతికీ గౌరవం లేదని
వీరికి లోపల దిగులు
వర్తమానావర్త ఝంఝూ వీచికలికి కాళ్ళు తేలిపోయే
వీళ్ళేం చెప్పగలరు ?
అందరూ లోకంలో శప్తులూ పాపులూ
మనం మాత్రం భగవదంశ సంభూతులమని వీరి నమ్మిక
సూర్యుడూ చంద్రుడూ దేవతలూ దేవుళ్ళూ
కేవలం వీరికే తమ వోటిచ్చినట్లు వీరి అహమిక
ఇది కూపస్థమండూకోపనిషత్తు
ఇది జాతికీ ప్రగతికీ కనబడని విపత్తు
మన వేషం, మన భాషా, మన సంస్కృతీ,
ఆది నుండీ, ద్రవిడ బర్బర యవన తురుష్క హూణులనుండీ,
ఇచ్చినదీ పుచ్చుకున్నదీ ఎంతైనా ఉన్నదనీ,
అయిదు ఖండాల మానవ సంస్కృతి
అఖండ వసుధైక రూపాన్ని ధరిస్తోందనీ,
భవిష్యత్ సింహ ద్వారం తెరుస్తోందనీ,
గ్రహించలేరు పాపం వీరు
ఆలోచించలేని మంచివాళ్ళు.
ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడు కాదొక స్థిరబిందువు
నైక నదీ నదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు.
-1965

తమైన రాజకీయాలు కాకుండా మతోన్మాదాన్ని పెంచిపోషించే చేష్టలే అవసరమని. కానీ ప్రజలను ఎల్లకాలం భ్రమల్లో, మతం మత్తులో ముంచలేమని పవన్ కల్యాణ్‌కు తెలియకపోవచ్చు నేమో! కానీ, అదే సత్యమని ప్రజా చరిత్ర చెబుతుంది. ఇప్పుడు ఏ లడ్డు గురించి అయితే వివాదం జరుగుతుందో, అదే తిరు మలలో అలిపిరి దగ్గర చంద్రబాబు మీద దాడి జరిగినప్పుడు "నక్సలిజమా, ప్రపంచబ్యాంకు విధానాలా?" అంటూ ఎన్నికలకు పోయి ఆయన ఓడిపోయాడు. ఇప్పుడు తిరుపతి లడ్డు వ్యవహారాన్ని తన రాజకీయ ప్రసాదంగా వాడుకోవాలనుకుం టున్న పవన్ కల్యాణ్ లాంటి వాళ్ళకు కూడా ప్రజలు ఎప్పుడో ఒకప్పుడు తమ చైతన్యాన్ని తప్పక చూపిస్తారని ఆశిద్దాం. అప్పటి వరకు ఈ సరికొత్త సనాతన "తుఫాన్" కాషాయ సముద్ర తీరం దాటకుండా చూడాల్సిన బాధ్యత ప్రగతి శీల, ప్రజాస్వామిక, లౌకిక శక్తులదే! ❑

# అసమానతల తలమే కులం

**13వ పేజీ తరువాయి**

జాతీయ కాంగ్రెస్ కులాన్ని, ఈ వ్యవస్థలో పక్కలో బల్లెం వలె చూసింది. ఈ వ్యాసం అబ ద్ధాల సంకలనం. మనుస్మృతిలో కుల వ్యవస్థను చాలా బలంగా వివరించారు. (క్రీ.శ.2 వ శతాబ్దం, విదేశీ దురాక్రమణదారులు రావడానికి చాలా ముందుగా) అట్టడుగు కులాల వారు అగ్రవ ర్ణాల వారికి దూరంగా ఉండాలని అనేక పవిత్ర గ్రంథాలు పేర్కొ న్నాయి. అదే అంటరానితనానికి మూలం. దీని వ్యక్తీకరణే సఫాయి పని. ఇది స్వచ్ఛత-కలుషిత ఆచారాలలో, పునర్జన్మ సిద్ధాంతంలో స్వభావికంగా ఉంటుంది. దీనికి సంబంధించిన ఇంతకుముందు ప్రస్తావనలు నారద సంహిత, వాజసనేయి సంహితలో ఉన్నాయి.

నారద సంహితలో అస్పృశ్యుల కోసం చేర్చబడిన 15 విధుల జాబితాలో మానవ మలమూత్రాలను ఎత్తివేయడం ఒక విధిగా ఉంది. వాజసనేయి సంహితలో మానవ మల మూత్రాలను ఎత్తివేసే పనిలో ఉన్న బానిసలను చండాలురుగా పేర్కొన్నారు. అంబేద్కర్, కులాన్ని సమాజంపై బ్రాహ్మణీయ విధింపుగా భావించాడు. ఆర్ఎస్ఎస్ పత్రికలోని వ్యాసం కులవ్యవస్థను కీర్తిస్తుంటే, రాడికల్ దళిత మేధావులు, కార్యకర్తలు కులాన్ని హిందూ సమాజానికి పట్టిన చీడగా చూస్తున్నారు. అందుకే అంబేద్కర్, తన అనేక రచనల్లో 'కుల నిర్మూలన' కోసం పిలుపునిచ్చాడు. దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యం, కులగణనలు ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని హిందూ జాతీయవాదులకు కంటగింపుగా ఉన్నాయి. దాని మూలాలు పుణేలో గాంధీ, అంబేద్కర్‌ల మధ్య జరిగిన ఒడంబడికలో ఉన్నాయి. ఆ తరువాత అది తన స్థానాన్ని భారత రాజ్యాంగంలో పొందింది. దీనిని వ్యతిరేకించడానికి చాలా నేర్పుగా, ప్రత్యక్షంగా 1980, 1985లలో అహ్మదాబాద్‌లో అల్లర్లు జరిగాయి. 1990లో మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేసినప్పుడు, రామ మందిరం ఉద్యమం మరింత ఉగ్రరూపం దాల్చింది. ఈస్ట్ ఇండియా కంపెనీ, హ్యూమ్‌ల వారసత్వంగా భారత జాతీయ కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు, దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి దూరంగా ఉండి, ఇప్పుడు భారతదేశ బహుళత్వ భావనను, దేశ వైవిధ్యాన్ని వ్యతిరేకిస్తున్న వారు మాత్రమే ఈ కల్పనను సృష్టించగలరు. తిలక్ నుండి గాంధీ వరకు భారత జాతీయ కాంగ్రెస్, హ్యూమ్ భాగస్వామిగా వున్న బ్రిటిష్ పాలనకు పూర్తి వ్యతిరేకంగా ఉంది. హ్యూమ్ దానిని సేఫ్టీ వాల్వ్ గా భావించాడని ఆరోపించారు. లోతుల్లోకి వెళితే, మద్రాస్ మహాజన్ సభ(స్థాపకుడు, పానపాకం ఆనందాచార్యులు), బొంబాయి అసోసియేషన్ (స్థాపకుడు, జగన్నాథ్ శంకర్ షెట్) పూనా సార్వజనిక్ సభ (స్థాపకుడు, రణడే) వంటి భారత జాతీయసంస్థలు, వాటి డిమాండ్లు బ్రిటీష్ పాలకులకు చేరేందుకు ఒక రాజకీయ వేదిక కోసం ఎదురుచూశాయని ఎవరైనా గ్రహిస్తారు. భారతదేశం డిమాండ్లను ముందుకు తీసుకుని వెళ్లడానికి ఒక జాతీయ వేదిక కోసం వారు ప్రయత్నం చేశారు కాబట్టి వారు భారత జాతీయ కాంగ్రెస్ పిలుపుకు స్పందించారు. ఇది, ప్రారంభంలో భారతదేశంలో ఐసీఎస్ కేంద్రాలను తెరవడానికి పిలుపునిచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్, భూస్వాములకు ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చింది, దాని వల్ల బందీలుగా ఉన్న కార్మికశక్తి విడుదల అవుతుంది.

దానితోపాటు పెరుగుతున్న పారిశ్రామికీకరణను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ మరిన్ని సౌకర్యాల కోసం డిమాండ్ చేసింది. అదే భారత జాతీయ కాంగ్రెస్ 'సంపూర్ణ స్వాతం త్ర్యం', 'బ్రిటీష్ క్విట్ ఇండియా' కోసం పిలుపునిచ్చింది. అంబేద్కర్ బలంగా ముందుకు తెచ్చిన సామాజిక న్యాయం అంశాన్ని తీసుకుని జాతీయోద్యమానికి నాయకత్వం వహించింది కూడా పాంచజన్యం లక్ష్యంగా పెట్టుకున్న ఆ కాంగ్రెస్సే. భారత రాజ్యాంగ విలువలకు ప్రాతినిధ్యం వహించే అంబేద్కర్, హిందూ జాతీయ వాదానికి ప్రతినిధిగా ఉంటున్న ఆర్ఎస్ఎస్‌ల మధ్య గల వైరుధ్యం చాలా స్పష్టంగా ఉంది. అంబేద్కర్ మనుస్మృతిని తగులబెట్టాడు. ఈ పవిత్ర గ్రంథంలో పేర్కొనబడిన కుల అసమానతలను ఆర్ఎస్ఎస్ సమర్ధిస్తుంది. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచిస్తే, ఆర్ఎస్ఎస్ ఆ రాజ్యాంగాన్ని చాలా కాలంపాటు ప్రత్యక్షంగా వ్యతిరేకించి, ఇప్పుడు పరోక్షంగా వ్యతిరేకిస్తోంది. ❑

# శ్రీలంకకు ఆశాకిరణం దిసనాయకే



- బుడ్డిగ జమిందార్

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న శ్రీలంకను అప్పుల ఊబి నుంచి కాపాడమని కోరుతూ ఆ దేశ అధ్యక్షునిగా కమ్యూనిస్టు అనుర కుమార దిసనాయకేను ప్రజలు ఎన్నుకున్నారు. 2022 శ్రీలంక సంక్షోభంలో రాజపక్స గద్దె దిగిన తర్వాత రెండేళ్లపాటు విక్రంసింఘే అధికార పగ్గాలు చేపట్టి అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎమ్ఎఫ్) షరతులకు లోబడి ఉద్దీపన చర్యలు చేపట్టటం ద్వారా ప్రజల స్థితిగతులు ఇంకా అధ్వానంగా మారాయి. పేదరికం రెట్టింపైంది. ద్రవ్యోల్బణం తగ్గినట్లుగా గణాంకాలను చూపించినా వాస్తవానికి శ్రీలంకలో నిత్యావసర వస్తువుల ధరలు వంద శాతం పెరిగాయి. పెట్రోలు దొరకటం లేదు. విద్యుత్ సరఫరా నిలిపివేతలు పరిపాటైంది. ఆహార భద్రత సమస్యలు ఎదురయ్యాయి. మార్క్సిస్టు జనతా విముక్తి పెరమున పార్టీ నాయకుడు దిసనాయకే నేషనల్ పీపుల్స్ పవర్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసి విజయం సాధించారు. ఈ గెలుపుతోపాటు లాటిన్ అమెరికాలోని అర్జంటైనా, చిలీ, మెక్సికో దేశాల్లో వామపక్ష అనుకూల ప్రభుత్వాల స్థాపన ప్రపంచవ్యాపితంగా వామపక్ష ఉద్యమాలకు ప్రజలు అనుకూలంగా ఉన్నారనడానికి సూచికగా చెప్పవచ్చు. సుమారు 5500 కోట్ల డాలర్ల అంతర్జాతీయ రుణ వాయిదాల్ని తీర్చే స్థితిలో శ్రీలంక లేదు. దీనికి తోడు అధిక వడ్డీలు కట్టాల్సి రావటం, ఎగుమతులు తగ్గిపోయి దిగుమతులపై ఆధారపడటం, కోవిడ్ కాలంలో దేశ టూరిస్టు వ్యవస్థ పూర్తిగా తగ్గిపోవటంతో విదేశీ కరెన్సీ నిల్వలు ఖాళీ అయిపోయాయి. ఆర్థిక వ్యవస్థను బాగు చేస్తానని ఐఎంఎఫ్ చెప్పిన 300 కోట్ల డాలర్లను ఉద్దీపన చర్యల కోసమని ఇచ్చి అందులో సింహ భాగం వడ్డీ రూపంలో వసూలు చేస్తూ సాంఘిక కోతలు విధిం చారు. దీంతో దేశంలో సరుకుల ధరలపై విపరీతంగా పన్నులు విధించటం, ప్రభుత్వం సాంఘిక సంక్షేమ ఖర్చులను ఆపేయ టం, సబ్సిడీలు ఎత్తివేసి జీతాలు తగ్గించి, 30 శాతం శ్రీలంక రూపాయి విలువను కృత్రిమంగా తగ్గించటంతో శ్రీలంక ఆర్థిక వ్యవస్థ ఐసీయూ బెడ్ మీదకు వచ్చిన తరుణంలో ప్రజలు ఒక మార్క్సిస్టును దేశాధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. దిసనాయకేకు 57 లక్షల 40 వేల ఓట్లు రాగా, ప్రతిపక్ష నాయకుడు ప్రేమదాసకు 45 లక్షల 30 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. అధ్యక్ష ఎన్నికల బరిలో 38 మంది నిలిచారు. మార్క్సిస్టు దిసనాయకే ప్రభావానికి సాంప్రదాయ పార్టీల అభ్యర్థులందరూ ఘోరంగా ఓడిపోయారు.

దిసనాయకే తన ఎన్నికల ప్రచారంలో శ్రామికవర్గ అనుకూల, పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యతిరేక నినాదాలు ఇచ్చాడు. ప్రస్తుతం



దేశంలో ఐఎంఎఫ్ ప్రోద్బలంతో, షరతులతో అమలవుతున్న పొదుపు చర్యలపై సమీక్ష చేస్తాననీ, భారం తగ్గేలా ఐఎంఎఫ్‌తో మాట్లాడతానని ఎన్నికల ఫలితాల తర్వాత దిసనాయకే అన్నారు. ఒకసారి ఐఎంఎఫ్‌తో తెగతెంపులు చేసుకుంటే ప్రస్తుతం ఇస్తానన్న 270 కోట్ల డాలర్లను ఐఎంఫ్ ఇవ్వ నిరాకరిస్తుందని, దీనితో మరింత సంక్షోభానికి దేశం వెళుతుందని అంటున్నాడు. చైనా, భారత్, జపాన్ 1000 కోట్ల డాలర్ల వసూళ్లను వాయిదా వేశాయి. కానీ ఐఎంఎఫ్ వలేనే షరతులు పెట్టలేదు. సాంఘిక కోతలు విధించమనలేదు. వ్యవసాయానికి ఎరువులు కొనలేని స్థితిలో దిగుమతులను ఆపటం ద్వారా పూర్తిగా ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించటంతో శ్రీలంకలో వ్యవసాయ దిగుబడులు తగ్గిపోయాయి. దీనికితోడు తన శక్తికి మించి దీర్ఘకాలిక ప్రాజెక్టులు, నౌకాశ్రయాలు నిర్మించటానికి రుణాలను తేవడంతో తక్షణ ఆదాయం రాలేదు.

1980వ దశకం నుంచి దక్షిణ అమెరికా, సెంట్రల్ అమెరికా దేశాలన్నీ ముఖ్యంగా బ్రెజిల్, అర్జెంటైనా, పెరూ, చిలీ, బొలీవియా వంటి దేశాలతోపాటు ఇండోనేసియా వంటి ఆసియా దేశాలు, బంగ్లాదేశ్‌లో ఇటీవల పరిణామాలు అన్నీ ఐఎంఎఫ్ రుణాల ఫలితమే. ఎక్కడైతే ఐఎంఎఫ్ పాదం మోపుతుందో ఆ దోపిడీని తట్టుకోలేని ప్రజానీకం వామపక్ష ప్రభుత్వాలవైపు మొగ్గు చూపుతున్నది. ఆర్థిక వ్యవస్థ 'కోమా' లోకి వెళ్లిన తర్వాత పరిష్కార మార్గాలు వెతకటం అంత సులభం కాదు. రెండవ ప్రపంచయుద్ధంలో ఆయుధాల అమ్మకాలతో అమెరికా విపరీతంగా బంగారాన్ని, విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించి బ్రెట్టన్ ఉడ్ సిస్టమ్ పేర ప్రపంచ బ్యాంకు - ఐఎంఎఫ్‌లను స్థాపించి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రుణాలను మంజూరు చేస్తూ, ఆ దేశాల్ని అభివృద్ధి చేస్తున్నామని చెబుతూ, కార్పొరేట్ కంపెనీలకు యంత్రాలను రుణాలతో ఎక్కువ ధరలకు కొనిపిస్తూ, ఎక్కువ సందర్భాలలో అనవసరపు యంత్రాలను ఎగుమతి చేస్తూ

ఎక్కువ వడ్డీలు గుంజుతూ అభివృద్ధి పేరిట దేశ ఆర్థిక వ్యవస్థలను సర్వ నాశనం చేస్తోంది అమెరికా సామ్రాజ్యవాదం. అభివృద్ధి చెందు తున్న దేశాల సార్వభౌమాధికారిని దెబ్బతీస్తూ, అమెరికా బ్యాం కుల దగ్గర తాకట్టు పెరుగుతున్నాయి.

శ్రీలంకలో ఎన్నికల ప్రచారం అంతా 'ఆర్థిక వ్యవస్థ'పై జరగ టం వల్ల ఐఎంఎఫ్ గుట్టురట్టు కావటంతో కమ్యూనిస్టు అధ్యక్షు నిగా ఎన్నిక కాగలిగాడు. 2029లో భారతదేశంలో జరిగే ఎన్ని కలలో 'ఆర్థిక వ్యవస్థ-నిరుద్యోగం-సాంఘిక భద్రత-సంక్షేమ అవసరాలు-విద్య, వైద్యం' మీద చర్చ జరిగితే కేంద్ర ప్రభుత్వం మారక తప్పదు. 2014లో సుమారు 50 లక్షల కోట్ల రూపా యల అంతర్జాతీయ అప్పులు నేడు 2024 లో సుమారు 200 లక్షల కోట్ల రూపాయలకు ఎలా ఎందుకు పెరిగాయి. నిరుద్యో గం తన హయాంలో ఎందుకు పెరిగింది ? ప్రభుత్వరంగ సంస్థల్ని ఎందుకు ప్రైవేటీకరిస్తున్నారు ? విద్య, వైద్యం ఎందుకు భారమవుతోంది ? ఆర్థిక అసమానతలు పెరగటానికి కారణాలు ఏమిటి ? పెరుగుతున్న జీడీపీ కార్పొరేట్ అకౌంట్స్‌కు ఎందుకు వెళుతున్నాయి ? వంటి అనేక సమస్యలను వామపక్షాలు ఎజెం డాగా తీసుకొంటే మన దేశంలో కూడా ప్రజలు వామపక్షాల వైపు చూస్తారు. తిరుపతి లడ్డూ, రామమందిరం, మసీదు, గుడి వంటి ప్రచారాల ఊబిలోకి ప్రగతిశీలురు దిగకూడదు.

ఆర్థిక వ్యవస్థలు పెట్టుబడిదారీ వ్యవస్థలో కొందరి కోసం పుం జుకొంటున్నాయి. ప్రజాస్వామ్యం దాడికి గురవుతోంది. ఆర్థిక వ్యవస్థను తప్పుడు నిర్వచనాల నుంచి బయటకు లాగి, ప్రజా స్వామ్య అణచివేత నుంచి విముక్తి కలిగించాలి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను రక్షించటానికి ప్రజాస్వామ్య హక్కులు రద్దు చేస్తూ, నియంతృత్వం వైపు వెళ్లాలి. కానీ మార్క్సిస్టు దిసనాయకే ఇందుకు విరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాడని ఆశిద్దాం. ఈ సందర్భంగా ప్రపంచ ప్రజాస్వామ్యం-ఐఎంఎఫ్ పాత్ర చర్చకు రావాలని ఆశిద్దాం. ❑

# దారి చూపగలది.. వ్యవసాయానికి సాయమే !

**(17వ పేజీ తరువాయి)**

అనుకూలమైన విధానాలు మొదలయ్యాయి. ఈ విధానాల సారాంశం: గ్రామీణ ప్రాంత రైతాంగ ఉత్పత్తులకు ధరలను తక్కువ స్థాయిలోనే ఉంచడం. ఎందుకు? ఎందుకంటే, తద్వారా నగర ప్రాంతాలలో-నిత్యావసర ధరలను తక్కువ స్థాయిలో ఉంచొచ్చు. దీనివలన, ఈ కార్పొరేట్లపై - నగర ప్రాంతాల ఉద్యోగులు, కార్మికుల నుంచి అధిక వేతనాల కోసం డిమాండ్లు ఉండవు. గ్రామీణ వ్యవసాయం గనుక లాభసాటిగా ఉంటే - గ్రామీణ యువజనులు.. రైతాంగం - ఉపాధి కోసం నగరాల బాట పట్టరు. అంటే, నగర ప్రాంతాలలో కార్మికులు, ఉద్యోగుల సప్లై తగ్గి కొరత ఉంటుంది. దాని వలన, వారికి డిమాండ్ పెరిగి - కార్పొరేట్లు వారిని ఎక్కువ జీతాలతో పనిలో పెట్టుకోవాల్సి వస్తుంది. కాబట్టి నగరాలకు నిరంతర కార్మికుల సరఫరా కోసం - వ్యవసాయాన్ని నష్టాలలోనే ఉంచాలి. ఇక, ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పథకంపై ప్రభుత్వం శీత కన్ను వేయడం తాలూ కు కారణం కూడా ఇదే. ఈ పథకం వలన గ్రామీణ ప్రాంతాల నుంచి నగర ప్రాంతాలకు కార్మికులు వలసలు పెరిగారు. అలాగే, కేంద్రం వెనక్కు తీసుకున్న, మూడు వ్యవసాయ చట్టాల వంటి ద్వారా వ్యవసాయం దెబ్బ తిని - రైతాంగం కార్పొరేట్ లేదా కాంట్రాక్ట్ వ్యవసాయానికి తలొగ్గేందుకు వ్యవసాయం లాభ సాటిగా ఉండడం అనుకూలం కాదు...!! కారణాలు ఇవి కాబట్టే, నగర ప్రాంతాల కార్పొరేట్ల అనుకూల విధానాలను అనుసరి స్తున్న ప్రభుత్వాలు రైతాంగానికి వ్యతిరేకంగానే పోతున్నాయి. అయితే, ఇప్పుడిప్పుడే కనీసం ఆలోచనల రూపంలో (ఆచరణలో కాకున్నా) దీనికి భిన్నమైన వాదనలు వినపడుతున్నాయి. దానిలో భాగంగానే ఈ మధ్యన కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదా రు అనంత నాగేశ్వరన్ ఈ విధంగా పేర్కొన్నారు "అంతర్జాతీ యంగా ఆర్థిక వృద్ధి మందగిస్తోన్న దృష్ట్యానూ, భూభౌగోళిక ఉద్రి క్తతల దృష్ట్యానూ, నేడు మనం (దేశీయ) వృద్ధి రేటును పెంచుకొ నే అవసరం దృష్ట్యా - ఏ ఆర్థిక రంగాన్ని తక్కువగా చూడగల స్థితిలో లేము. కాబట్టి, వ్యవసాయమనేది కూడా - (నేడు మన కు) ఆర్థిక వృద్ధికి చోదకశక్తిగా ఉండాలి. అంటే, వ్యవసాయాన్ని తిరిగి మరలా "ఆకర్షణీయంగా" చేయగలగాలి. ఆ రంగాన్ని.. ఉపాధి కల్పనకు తగిన మార్గంగా చేయాలి. ఉదాహరణకు, నేడు బ్రెజిల్ దేశంలో యువజనులు, గతంలోకంటే ఎక్కువగా వ్యవసాయంలో భాగం పంచుకుంటున్నారు. దీని నుంచి మనం నేర్చుకోగలిగినది ఏమిటనేది చూడాలి. అదీ సంగతి..!!

అయితే, ఈ ఆలోచనను ఆచరణలోకి తెచ్చేందుకు - కార్పొ రేట్లు ఇచ్చే నిధులతో ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పక్షాలు.. నేతలు బహుశా పనికిరారు. కానీ, నేడు దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలు ఇదే తీరులో ఉన్నాయి. కాబట్టి, ప్రస్తుత ఆర్థిక సంక్షోభ కాలంలో-దానికి ఎంతో కొంత ఉపశమనాన్ని ఇవ్వగల - వ్యవసాయ ఆధారిత, దేశీయ డిమాండ్ కల్పనా... వృద్ధి తాలూకు ఒక సరికొత్త నమూనాని, విస్తృతంగా ప్రజలలో చర్చ కు పెట్టాలి. తద్వారా, అటువంటి నమూనాకు అనుకూలమైన రాజకీయ శక్తుల ఆవిర్భావానికి కృషి చేయగలగాలి... ఇది మాత్రమే - కనీసం తక్షణ ప్రాతిపదికన, దేశీయ నిరుద్యోగం... కొనుగోలు శక్తి పతనాలకు పరిష్కారంగా ఉండగలదు.!❑

# CALL FOR PAPERS

## Seventh International Arvind Memorial Seminar

*29 December 2024 – 2 January 2025, Hyderabad*

# Fascism in the Twenty-First Century:

## Elements of Continuity and Change and the Question of the Contemporary Proletarian Strategy

World capitalism is going through the first great depression of the Twenty-first century since 2006-07. The social-economic and political insecurity created due to the capitalist crises gave impetus to the reactionary forces owing to the weakness of the subjective forces of revolution. Consequently, we have been witnessing the rise of various far-right movements including fascism in different countries.

Fascism is not just *any* far-right reaction. It is a particular type of far-right reaction. In various sections of the communist movement of the world, the tendency of carelessly characterizing any kind of reaction as fascism has been prevalent. The task of formulating an effective proletarian strategy and general tactics against fascism cannot be fulfilled without understanding the general particularities of fascism.

We also need to understand the changes taking place around the world. The changes taking place in Turkey, Brazil, Philippines, Russia, Middle-East Region, the US, Britain or France need to be comprehended. What is the character of the Erdogan regime? What is the character of Putin's regime? How do we understand the character of the regime of Marcos Jr. and Duterte and similar forces? What is the nature of National Rally in France? What is the nature of forces like Golden Dawn of Greece? What kind of political tendency is represented by Bolsonaro in Brazil? How do we understand the Trump phenomenon in the US? What is the character of the regime that came into being following the Khomenei-led revolution in Iran? These are living questions for Marxist and progressive political activists as well as academics.

It is precisely for a detailed and satisfactory dialogue, discussion and debate on these questions, that we are organizing the **Seventh International Arvind Memorial Seminar from 29th December 2024 to 2nd January 2025 in Hyderabad (India).** We extend invitation to left groups, organizations and parties, Marxist intellectuals, progressive and anti-fascist academics, researchers and students of the country and the world to take part in this seminar. During these five days, the arrangement for accommodation and food will be made by the Arvind Memorial Trust.

## IMPORTANT DATES

**15th October 2024**
Abstract submission deadline

**15th November 2024**
Paper submission deadline

**1st December 2024**
Information of accepted papers to the senders


arvind.trust@gmail.com

english.arvindtrust.org

Anand : 9971196111

Jayaprakash : 9871794036

Sreeja : 7013936466


Organizing Committee

Seventh International Arvind Memorial Seminar

(Hyderabad)

**Arvind Institute of Marxist Studies**

(an initiative of Arvind Memorial Trust)



భారత రాజ్యాంగము

భారత ప్రజలమైన మనము మన భారతదేశాన్ని
సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర
రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్రదీక్షతో తీర్మానించి
మన దేశ పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ
న్యాయాల్ని
ఆలోచనా భావప్రకటనా మతవిశ్వాస ఆరాధనా
స్వేచ్ఛను
హోదాల్లోనూ అవకాశాలలోను
సమానత్వాన్ని
సాధించేందుకు వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత సమగ్రతను కల్పించే
సౌభ్రాతృత్వాన్ని
పెంపొందించాలని మన రాజ్యాంగ నిర్ణాయక సభ లో
1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని
స్వీకరించి శాసనీకరించి ఆమోదించి
మనకు మనము సమర్పించుకుంటున్నాము

## నవంబరు 26 - రాజ్యాంగ దినోత్సవం

### రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ దినం

ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో నవంబరు 26వ తేదీకి ముందుగా రాజ్యాంగ వ్యాస రచన, ప్రసంగ పోటీలు నిర్వహించాలి. విద్యా సంస్థలలో సామూహికంగా లేదా తరగతి గదులలో రాజ్యాంగ పీఠికను చదివించాలి. రాజ్యాంగాన్ని గౌరవిస్తానని, పరిపాలన రాజ్యాంగబద్ధంగా వుండాలని, రాజ్యాంగ పీఠిక వాగ్దానం చేసిన సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాలు, సాధన కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించాలి. ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు తమ పని ప్రదేశాలలో రాజ్యాంగ పీఠికను చదివి, ప్రతిజ్ఞ చేయాలి. ప్రజా సంఘాలు తమ సమావేశాలలో లేదా ఆఫీసులలో ఈ కార్యక్రమం నిర్వహించాలి.

**రాజ్యాంగ పీఠక వాగ్దాం చేసిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాల కోసం ప్రతిజ్ఞ చేద్దాం.**

## జనవరి 26 - రిపబ్లిక్ డే

### రాజ్యాంగ పీఠిక దీక్షా దినం

రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 రిపబ్లిక్ డేను రాజ్యాంగ పీఠిక దీక్షా దినంగా నిర్వహించాలి. ప్రతి పట్టణంలో కార్మిక సంఘాలు, అన్ని ప్రజా సంఘాలు, వృత్తి సంఘాలు రాజ్యాంగ పరిరక్షణ మీద ఆసక్తిగల సంస్థలు, సంఘాలు ఉమ్మడిగా "పీఠిక దీక్షా దినం" జరపాలి. జాతీయ జెండాతో వివిధ సంఘాల బ్యానర్లు, బాడ్జీలతో అన్ని సంఘాల సభ్యులు పాల్గొనేలా ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలి. సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాల సాధన కోసం సాగే ఉద్యమంగా దీనిని నిర్వహించాలి.

**ప్రాథమిక హక్కుల్ని కాపాడుకుందాం. పౌరుల విధులను నిర్వహిద్దాం. ఆదేశిక సూత్రాల అమలుకు అసమానతలు లేని సమాజం కోసం దీక్షా దినం చేపడదాం.**

# మద్రాసు ప్రెసిడెన్సీలోని సంస్కరణోద్యమాలపై ప్రొఫెసర్ పి.లక్ష్మీనరసు ప్రభావం

- టి.రవిచంద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ప్రభావితం చేసిన ఆంధ్రుడు, బౌద్ధ పండితుడు, కుల నిర్మూలనవాది ప్రొఫెసర్ పోకల లక్ష్మీ నరసు 1934 జూలై 14న గుండెపోటుతో మద్రాసులోని ఆయన స్వగృహంలో మరణించారు. 1860లో జన్మించిన లక్ష్మీనరసు 74 ఏళ్లు జీవించారు. తన జీవితాన్ని బౌద్ధ మత పునరుద్ధరణకు, ప్రచారానికి, సంఘ సంస్కరణకు అంకితం చేశారు. దక్షిణ భారత బౌద్ధ సంఘాలకు (The South Indian Buddhist Societies) జీవిత పర్యంతం అధ్యక్షుడిగా ఉన్నారు. 1900లో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడైన ఎమ్.సింగారవేలు చెట్టియార్‌తో కలిసి 'మహాబోధి సొసైటీ'ని స్థాపించారు. ప్రొఫెసర్ లక్ష్మీ నరసు బౌద్ధ మత పునరుద్ధరణ, ప్రచారంతోపాటు దళిత వర్గాల అభ్యున్నతికి చాలా కృషి చేశారు. ఆ వర్గాల్ని విద్యావంతులను చేయడం కోసం ప్రాథమిక విద్యా సంస్థలను నెలకొల్పారు. మహాబోధి సొసైటీ అనాగరిక ధర్మపాల నాయకత్వంలో సామాజికంగా ఉన్నత స్థితిలో వున్న ప్రజలలోనే తమ కార్యక్రమాలు నిర్వహిస్తుండేది. ఈ విషయంలో ప్రొఫెసర్ నరసు వారితో విభేదించారు. ఆయన సామాజిక సంస్కరణ దృష్టితో బౌద్ధ మతాన్ని వ్యాఖ్యానించి, దాన్ని ప్రచారం చేశారు ఆ దృష్టితో ఆయన 'ది ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం' (1907), 'ఏ స్టడీ ఆఫ్ క్యాస్ట్' (1922) అనే గ్రంథాలను రచించారు. అందువల్లనే పైన పేర్కొన్న రెండో గ్రంథాన్ని మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మ్యాగజైన్(Vol. III, 1923)లో పరిచయం చేస్తూ ఒక సమీక్షకుడు దానిని గురించి ఇలా అన్నారు. చరిత్రకారుడిగా కంటే ఒక సామాజిక సంస్కర్త దృష్టితో ప్రస్తుత గ్రంథం రచించబడింది. అందువల్ల ప్రొఫెసర్ లక్ష్మీనరసు బౌద్ధ మతాన్ని సామాజిక సంస్కరణను అభిలషిస్తూ ప్రచారం చేశారని, గ్రంథ రచన చేశారని భావించవచ్చు.

దక్షిణ భారతదేశంలో బౌద్ధ మత పునరుద్ధరణలో ఆయన నిర్వహించిన పాత్రను గుర్తించిన అమెరికన్ పరిశోధకురాలు ఎలియనార్ జెలియట్ ఇలా ప్రస్తుతించారు. The most conspicuous figure in the revival, however is P.Lakshmi Narasu, a Buddhist and writer and missionary in the cause of Buddhism. ఏమయినప్పటికీ ప్రొఫెసర్ లక్ష్మీ నరసు బౌద్ధ ధర్మ పునరుద్ధరణలో గణింపదగిన వ్యక్తి. బౌద్ధ ఉద్యమంలో ఆయన బౌద్ధుడు, రచయిత, ప్రచారకుడు. అయితే ఈ అమెరికన్ పరిశోధకురాలు ఆయనను 'తమిళుడు'గా పేర్కొన్నారు. ప్రస్తుత వ్యాసకర్త అధ్యయనం ద్వారా తేలిన దాన్ని బట్టి ప్రొఫెసర్ లక్ష్మీనరసు 'తెలుగువాడు' అని చెప్పడానికి ఎటువంటి సందేహానికి ఆస్కారం లేదు. అంతేకాదు ఈ మధ్యనే లభించిన ప్రొఫెసర్ లక్ష్మీనరసు మరొక ముఖ్యమైన గ్రంథం కూడా ఆయన తెలుగువాడని నిరూపిస్తుంది. 1916లో ప్రథమ ముద్రణ పొందిన ఆ గ్రంథం 'వాటీజ్ బుద్ధిజం?' (బౌద్ధం అంటే ఏమిటి ?). ఇది 1946లో పునర్ముద్రణ పొందిన సమయంలో అనాటి మహాబోధి సొసైటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి దేవప్రియ వాలిసిన్హా ముందుమాట రాసి, ప్రొఫెసర్ లక్ష్మీనరసు కృషిని కొనియాడారు. మద్రాసులోని మహాబోధి సొసైటీ తరఫున పనిచేయడానికి రెవరెండ్ నీలకక్కె సోమనందథేర శ్రీలంక నుండి వచ్చినప్పుడు, ఆయనకు ప్రొఫెసర్ లక్ష్మీనరసు ఎలా సహకరించిందీ దేవప్రియవలిసిన్హా ముందు మాటలో ఇలా వివరించారు. Prof Narasu not only assisted him in every way possible but also under-took to coach him in Tamil and Telugu.

ఆయన రెవరెండ్ నీలకక్కె సోమనంద థేరకు సాధ్యమైన అన్ని విధాల సహకరించటమే కాకుండా, ఆయనకు తమిళ, తెలుగు భాషల్లో శిక్షణనిచ్చారు. ఆయన తమిళనాడులో స్థిరపడటం వల్ల ఆయనకు తమిళ భాషా సాహిత్యాలతో గాఢమైన పరిచయం ఏర్పడింది ఆ భాషలో బౌద్ధంపై రచనలు చేశారు. అదే సమయంలో మాతృభాషయైన తెలుగును మాత్రం విస్మరించ లేదు. ఆయన బీఏలో ద్వితీయ భాషగా తెలుగును చదివారు. అందువల్ల నీలకక్కే సోమనందథేరకు తెలుగు భాషను నేర్పగలిగారు. తద్వారా ఆయనను తెలుగువాడని నిరూపించడానికి బలమైన మరో ఆధారం లభించింది. ఆయన ఇంటిపేరు 'పోకల' కావడం, ఆయన పేరు చివర కుల చిహ్నమైన 'నాయుడు' అనే పదం వుండటం వల్ల కూడా ప్రొఫెసర్ లక్ష్మీనరసు తెలుగువాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. తెలుగు వారి ఇంటి పేర్లలో 'పోకల' అనే ఇంటిపేరు వుంది. ఆ ఇంటిపేరు గలవాళ్ళు తెలుగు వారిలో చాలా మంది వున్నారు. ఇన్ని ఆధారాల వల్ల ప్రొఫెసర్ లక్ష్మీ నరసును నిశ్చయంగా తెలుగువాడిగా భావించవచ్చు. ఈ అంశాన్ని మరొకసారి ఎందుకు ప్రత్యేకంగా ప్రస్తావించాల్సి వస్తుందంటే, ఈ మధ్య దక్షిణ భారతదేశంలో ఆధునికయుగంలో బౌద్ధ మతాన్ని గురించి రాసేవాళ్లు ఆయనను తమిళుడిగా భావించి రాస్తున్నారు. అందువల్ల ప్రొఫెసర్ లక్ష్మీనరసు మన తెలుగు వాడని మరోసారి

గుర్తుచేస్తున్నాడు ప్రస్తుత వ్యాసకర్త. తమిళనాడు (ఆనాడు తెలుగు వారు మద్రాసు ప్రెసిడెన్సీ కింద వుండేవారు)లో మన తెలుగు వారు బ్రహ్మ సమాజంలో, బ్రాహ్మణేతర ఉద్యమంలో, జస్టిస్ పార్టీలో, మహాబోధి సొసైటీలో, దివ్య జ్ఞాన సమాజంలో చాలా ప్రముఖ పాత్ర వహించారు. అటువంటి వారిలో గాజుల లక్ష్మీనరసుచెట్టి, పెరియార్ రామస్వామి, సర్ పిట్టి త్యాగరాయ శెట్టి వంటి వారెందరో ఆనాడు తమిళ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవనంలో ప్రముఖ పాత్ర వహించడమే కాకుండా దానిపై మరువలేని ముద్రవేశారు. అటువంటి వారే మన తెలుగు వెలుగు పోకల లక్ష్మీనరసు.

1922వ సంవత్సరంలో ఆయనచే రచించబడిన 'ఏ స్టడీ ఆఫ్ క్యాస్ట్'(కులం-ఒక అధ్యయనం) గ్రంథాన్ని ఆనాడు బ్రాహ్మణేతర ఉద్యమంలో ప్రముఖపాత్ర నిర్వహించిన సరిపెట్టి త్యాగరాయ శెట్టికి, స్నేహానికి, కృతజ్ఞతకు వ్యక్తీకరణగా అంకితం చేశారు. త్యాగరాయశెట్టి జస్టిస్ పార్టీ అగ్రనాయకుల్లో ఒకరు. జన్మతః 'దేవాంగ' కులంలో జన్మించారు.

మన తెలుగువారు గర్వించదగ్గ మహామేధావి ప్రొఫెసర్ పోకల లక్ష్మీనరసు. ఆయన కేవలం బౌద్ధ ధర్మంలో పండితుడు, పరిశోధకుడు మాత్రమే కాదు. బౌద్ధ ధర్మ పునరుద్ధారకుడు, ప్రచారకుడు ఆంగ్లభాషలో బౌద్ధధర్మంపై నాటికి లభించే గ్రంథాలన్ని అధ్యయనం చేశారు. అనేక అరుదైన గ్రంథాలను దేశ, విదేశాల నుంచి సేకరించారు. జర్మనీ, ఫ్రెంచి భాషల్లోని గ్రంథాలను సైతం ఆయా దేశాల నుంచి తెప్పించి, విస్తృతంగా అధ్యయనం చేశారు. ఈ రెండు భాషల్లో ఆయనకు మంచి భాషా పరిజ్ఞానం వుంది. కొలంబో వెళ్లి వచ్చిన తర్వాత బౌద్ధ ధర్మంపై ఆయనకు ప్రత్యేకమైన ఆసక్తి, అభిమానం ఏర్పడ్డాయి. ప్రొఫెసర్ లక్ష్మీనరసు బహిరంగంగా బౌద్ధ ధర్మం స్వీకరించారు. (డా॥బీ.ఆర్.అంబేద్కర్ 1956లో బౌద్ధ ధర్మాన్ని లక్షలాది ప్రజల సమక్షంలో బహిరంగంగానే స్వీకరించారు) మహాబోధి స్థాపకుడైన అనాగరిక ధర్మపాలకు ఆయన మంచి స్నేహితుడు. ఆయనతో కలిసి ప్రొఫెసర్ లక్ష్మీనరసు ఎక్కువగా దక్షిణ భారత దేశంలో బౌద్ధ ధర్మ పునరుద్ధరణకు ప్రయత్నించారు. ఆయన మహాబోధి సొసైటీ మద్రాసు ప్రతినిధిగా 1909 నుంచి 1928 వరకు వున్నారు. దాని ప్రతినిధిగా ఆయన దక్షిణ భారతదేశంలో విస్తృతంగా పర్యటించారు. అనేకసభలు, సమావేశాలు నిర్వహించి, బౌద్ధ ధర్మంపై ఉపన్యాసాలు చేశారు. బౌద్ధ ధర్మాన్ని ఒక పరిశోధకుడుగా మాత్రమే అధ్యయనం చేయకుండా, ఒక సాంఘిక సంస్కర్తగా, శాస్త్రజ్ఞుడుగా పరిశీలించారు ఆ దృష్టితోనే ఆయన గ్రంథ రచన చేశారు ఆయన రచనల్లో అతి ప్రసిద్ధమైన రచన 'ది ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం' (బౌద్ధ ధర్మసారం). ఈ గ్రంథం ఆధునిక భారతదేశంలో బౌద్ధ మత పునరుద్ధరణలో విశేషమైన కృషిచేసిన అనాగరిక ధర్మపాల డా॥ బీఆర్ అంబేద్కర్ వంటివారి ప్రశంసలందుకోవడమే కాకుండా, ప్రొఫెసర్ డబ్ల్యు రైస్ డేవిడ్స్, ప్రొఫెసర్ చార్లెస్ ఆర్ ఎస్ ల్యాన్మన్ (సంపాదకుడు, హార్వర్డు ఓరియంటల్ సిరీస్), డా॥ సతీశ్ చంద్ర విద్యాభూషణ, ఫ్రాన్సిస్ జె పెయిన్ (ఎడిటర్, ది బుద్ధిస్ట్ రివ్యూ, లండన్), ఆనంద కుమారస్వామి వంటి ఉద్ధండ పండితుల అభిమానాన్ని చూరగొంది. ఈ గ్రంథం ద్వారా ప్రొఫెసర్ 'లక్ష్మీనరసు బౌద్ధ ధర్మంలో గొప్ప పండితుడిగా గుర్తించబడ్డారు. ఇది నేటికీ బౌద్ధ ధర్మాన్ని శాస్త్రీయ దృష్టితో అధ్యయనం చేయాలనుకునే వారికి ఒక ఆధార గ్రంథం (Source Book)గా నిలుస్తుంది. 'ప్రాస్పెక్టస్ ఆఫ్ బౌద్ధ ధర్మాంకుర్ సభ' అనే గ్రంథం ఉపోద్ఘాతంలో రెబతిరమన్ బిరుయా ఈ గ్రంథాన్ని ఇలా ప్రశంసించారు. 'పీఎల్ నరసుకు నా హృదయ పూర్వకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఆయన గ్రంథం ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం చాలా వరకు ఈ ఉపోద్ఘాతం తయారు చేయడానికి సహాయపడింది. ఆయన దీనితో విషయాన్ని స్పృశించిన తీరు శుద్ధంగా శాస్త్రీయమైనది. అందువల్ల వివేచనా జీవియైన ప్రతి వ్యక్తిని అది ఆకర్షిస్తుంది. బౌద్ధులకు, బౌద్ధేతరులకు ఎవరయితే బౌద్ధాన్ని సంగ్రహంగా తెలుసుకోవాలనుకొంటున్నారో, వారికి నేను ఈ గ్రంథాన్ని సిఫార్సు చేస్తున్నాను. ప్రొఫెసర్ లక్ష్మీనరసు బౌద్ధ ధర్మాన్ని పూర్తిగా భౌతిక వాద దృక్పథంతో అధ్యయనం చేశారు' అని వ్యాఖ్యానించారు. ఈ దృక్పథంతో బౌద్ధాన్ని వ్యాఖ్యానించిన వారు నాటికి భారతదేశంలో ఎవరూ లేరు. అందువల్లే బ్రాహ్మణేతర ఉద్యమంలో అగ్రనాయకులైన పెరియార్ రామస్వామి, సీఎన్ అన్నాదురైకు బౌద్ధ ధర్మంపై అభిమానం ఏర్పడింది. బౌద్ధాన్ని భౌతికవాద దృక్పథంతో వ్యాఖ్యానించి, దానిలోని సమతా ధర్మాన్ని వెలికి తీసి చూపించిన ప్రొఫెసర్ లక్ష్మీనరసు రచనల ప్రభావం ఆనాటి సామాజిక విప్లవోద్యమాలపై, సంస్కరణోద్యమాలపై పడటం ఆశ్చర్యం కాదు. భౌతికవాద దృష్టితో బౌద్ధాన్ని వ్యాఖ్యానించడం వల్ల ఆయనకు, మహాబోధి సొసైటీ వారికి భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. థేరవాద బౌద్ధులు ఆయన వ్యాఖ్యానంతో పూర్తిగా ఏకీభవించలేకపోయారు ఇటువంటి పరిస్థితే తర్వాత కాలంలో డా॥ అంబేద్కర్ "బుద్ధుడు-ఆయన ధర్మం' విషయంలో తలెత్తింది. ఆయన కూడా ప్రొఫెసర్ లక్ష్మీనరసు పరిశీలన పద్ధతి (Methodology)నే దాదాపు 'బుద్ధుడు-ఆయన ధమ్మం' అనే గ్రంథ రచనలో ఉపయోగించుకున్నారు. బౌద్ధ ధర్మాన్ని అర్థం చేసుకొనడంలో, వ్యాఖ్యానించడంలో ప్రొఫెసర్ లక్ష్మీనరసు అభిప్రాయాలతో నాటి మహాబోధి సొసైటీ వారు కాని థేరవాద బౌద్ధులు కాని విభేదించినా, ఆయన్ని ఒకగొప్ప బౌద్ధుడిగానే వారు పరిగణించారు, గౌరవించారు. ఆయన రచనల్లో ఒకటైన 'వాటీజ్ బుద్ధిజం?' (బౌద్ధం అంటే ఏమిటి?) గ్రంథాన్ని ప్రచురించారు. ఈ గ్రంథం జపాన్ భాషలోకి అనువదించబడి,

ఆ భాషలో పద్నాలుగుసార్లు పునర్ముద్రణ పొందింది. ఒక మంచి బౌద్ధుడిగా ఆయన ఆదర్శవంతమైన జీవితం గడిపారు. తన కుటుంబ సభ్యులను బౌద్ధ ధర్మావలంబికులుగా మార్చారు. ఆయన రెండో భార్య బౌద్ధ ధర్మ అనుచరురాలుగానే ఆయన మరణానంతరం జీవించారు. ప్రొఫెసర్ లక్ష్మీనరసు జన్మతః "ఆది వెలమ" జమీందారీ కుటుంబంలో పుట్టడం వల్ల వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ కులం నుండి వెలివేయబడ్డారు. అయినా ఆయన చలించక తాను నమ్మిన సిద్ధాంతం కోసం, దళితుల అభ్యున్నతి కోసం జీవితాంతం నిలబడ్డారు. ఆలోచనలో, ఆచరణలో వైరుధ్యం ఎరుగని వ్యక్తి ఇటువంటి ఉన్నతమైన సంస్కారప్రియుడు, శాస్త్రీయ దృష్టి కలవాడు కనుకనే తర్వాత శకాలంలో డా. అంబేద్కర్ నవబౌద్ధ ఉద్యమాన్ని ప్రభావితం చేయగలిగారు డా. అంబేద్కర్‌కు ఆయన ఒక ఆదర్శంగా మిగిలిపోయారు. మహాబోధి సొసైటీ వారికంటె ప్రొఫెసర్ లక్ష్మీనరసు మతం మార్పిడి(Conversion)లో, దళిత వర్గాలలో బౌద్ధాన్ని ప్రచారం చేయడంలో ఎక్కువ ఆసక్తి చూపారు. మహాబోధి సొసైటీ వారు బౌద్ధాన్ని కేవలం ఒక మతోద్యమంగా, హైంద వంలో అంతర్భాగంగా పరిగణించి ప్రచారం చేస్తే, ఆయన దాన్ని హిందూ మతానికి, ఇతర మతాలకు ప్రత్యామ్నాయంగా, కులరహిత సామాజిక సంస్కరణోద్యమంగా భావించి ప్రచారం చేశారు. డాక్టర్ అంబేద్కర్‌పై ఆయన ప్రభావాన్ని అమెరికన్ పరిశోధకురాలు ఎలియనార్ జెలియట్ ఇలా పేర్కొన్నారు. The earlier Tamil writer was certainly an influence on Ambedkar and an example to him (తొలి తమిళ రచయిత డాక్టర్ అంబేద్కర్‌పై నిశ్చయంగా ఒక ప్రభావం, ఆయనకు ఒక ఆదర్శం). ఇక్కడ తమిళ రచయిత అంటే ప్రొఫెసర్ పోకల లక్ష్మీనరసు ఆయన తమిళంలో గ్రంథ రచన చేశారు. అందువల్ల ఆయనకు తెలుగు వాడిగా కంటే తమిళ రచయితగా పేరు వచ్చింది. ఆమె అన్నట్టు తొలి తమిళ రచయిత లక్ష్మీనరసు డా॥ అంబేద్కర్‌ను ప్రభావితం చేశారు. కేవలం ప్రభావం చూపడమే కాదు అంబేద్కర్‌కు ఆయన ఒక ఆదర్శంగా నిలిచిపోయారు. ప్రొఫెసర్ లక్ష్మీనరసు రచనలు, ఉపన్యాసాల ప్రభావంతో బ్రాహ్మణేతర ఉద్యమ నాయకులైన పెరియార్, అన్నాదురై వంటివారు బౌద్ధాన్ని అభిమానించి, ఆ మతం గొప్పతనాన్ని, విశిష్టతను వివరిస్తూ తమిళంలో రచనలు చేశారు. పెరియార్, లక్ష్మీనరసు ఇద్దరూ కలిసి బ్రాహ్మణేతర ఉద్యమంలో హేతువాద ఉద్యమంలో పనిచేశారు. దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సింగారవేలు చెట్టియార్‌తో కలిసి ఆయన బౌద్ధ ధర్మ ప్రచారంలో పాల్గొన్నారు. సింగార వేలు కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రస్థానంలో వుండి కూడా బౌద్ధాన్ని ఒక గొప్ప ప్రజా ఉద్యమంగా భావించి, లక్ష్మీనరసు రచనల ప్రభావంతో కమ్యూనిస్టు సిద్ధాంతవేత్తగానే దాన్ని అభిమానించారు. బ్రహ్మ సమాజంలో ముఖ్యుడు, యుగకర్త వీరేశలింగంగారి ప్రియశిష్యుడు దేశిరాజు పెదబాపయ్య జీవితంపై ప్రొఫెసర్ లక్ష్మీనరసు సంస్కరణభావాలు చెరగని ముద్రవేశాయి. ఆయన ప్రభావంతో మద్రాసు క్రైస్తవ కళాశాలలో విద్యార్థిగా వున్నప్పుడే పెదబాపయ్య బ్రహ్మసమాజ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఈ విధంగా 1930 సంవత్సరానికి ముందే మద్రాసు ప్రెసిడెన్సీలోని అనేక ప్రజా ఉద్యమాల్ని, సంస్కరణోద్యమాల్ని ప్రభావితం చేయడమే కాకుండా, ఆ ఉద్యమాలతో ఏదో రూపంలో సంబంధాలు పెట్టుకున్నారు. ప్రొఫెసర్ లక్ష్మీనరసు అప్పటికే బౌద్ధ ధర్మాన్ని భౌతికవాద దృష్టితో వ్యాఖ్యానించి, గ్రంథ రచన చేసి ఆనాటి ప్రగతిశీల భావాలు కలిగిన వారందరినీ, వారే ఉద్యమంలో ఉన్నప్పటికీ ప్రొఫెసర్ లక్ష్మీనరసు ప్రభావితం చేశారు. అప్పటి బ్రహ్మ సమాజ ఉద్యమం, మహాబోధి సొసైటీ నాయకత్వంలోని నవ బౌద్ధ ఉద్యమం, బ్రాహ్మణేతర ఉద్యమం, కమ్యూనిస్టు ఉద్యమాలపై ఆయన జీవితం, రచనల ప్రభావం ఏదో మేరకు కనిపిస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. అంతటి మహనీయుడు మన తెలుగు వాడు కావడం నిజంగా గర్వించదగ్గ విషయం. ఈ వ్యాసం రాసిన తర్వాత ఈ మధ్య (17-05-95) ప్రొఫెసర్ లక్ష్మీ నరసు రెండో భార్య కుమార్తె శ్రీమతి ఏజీ రంజని గారిని కలవడం తటస్థించింది. ఆమెకు తమ నాన్న గారిని గురించి ఏమీ తెలియదనే చెప్పాలి. ప్రొఫెసర్ లక్ష్మీనరసు మేధాపరమైన కృషి గురించి తెలియకపోయినా, ఆయన వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా బౌద్ధుడిగా మారిన తర్వాత ఆయనపడ్డ బాధలు, ఇబ్బందులు తమ తల్లి గారు చెప్పగా విన్నవి తెలియజేశారు శ్రీమతి ఏజీ రంజని గారి గురించి తెలియజేసిన మహాబోధి సొసైటీ (మద్రాసు) బాధ్యులు శ్రీ రతనపాల గారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ❑

**సంప్రదించిన రచనలు**


1 THE MAHA BODHI, AUGUST ISSUE, VOL 42, NO 8, 1934

2 BUDDHISM IN SOUTH INDIA-DC AHIR, SRI SATGURU PUBLICATIONS, DELHI, 1992

3. WHAT IS BUDDHISM - PROF P LAKSHMI NARASU, MAHABODHI SOCIETY OF INDIA, CALCUTTA, THIRD EDITION, 1964.

4. THE INDIAN REDISCOVERY OF BUDDHISM (1855-1956), ELEANOR ZELLIOT,

5. STUDIES IN PALI BUDDHISM, B.R PUBLISHING HOUSE, DELHI, 1979


# చారిత్రక గమనాన్ని చూపిన 'ప్రజాస్వామ్య ప్రస్థానం'



- డి.హనుమంతరావు

బలమైన పునాదులే బలమైన భవనాన్ని నిలబెట్టగలవు. గత చరిత్ర పునాదులపైనే నేటి వర్తమానం ఆధారపడుతుంది. కేవలం చరిత్రను తెలుసుకుంటే సరిపోదు. చారిత్రక గమనా న్ని, దానికీ వర్తమానానికి ఉన్న లింకును తెలుసుకోవాలి. అలా మనకి చెప్పాలంటే చరిత్రతోపాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, భాషా అంశాలు తెలిసిన విశ్లేషకులు కావాలి. సరైన విశ్లేషణ మాత్రమే సరైన దారిని చూపించ గలదు. దేనిని కీలక అంశంగా చూడాలి? దేనిని మామూలు విషయంగా పరిగణిం చాలి ? అన్న విచక్షణ తోడైతేనే చరిత్రను సరైన దారిలో విశ్లేషిం చగలం. అలా విశ్లేషించగల అతి కొద్ది మందిలో అనిసెట్టి శాయి కుమార్ ఒకరు. సమూహ జీవనంలో ఒకరి ఆలోచనలను మరొ కరు చర్చిస్తూ, సమూహం మొత్తం ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవ డమనేదే విప్లవాత్మక మార్పు. కండబలాన్ని దాటి మనిషి మేధస్సు కు గుర్తింపును ఇచ్చే స్వేచ్ఛ ఆ ఉమ్మడి నిర్ణయాల నుండే వచ్చిం ది. అదే ప్రజాస్వామ్యానికి పునాదిగా మారింది. అక్కడి నుండి ప్రజాస్వామ్యం ఎన్ని దశల్లో ఎన్ని రకాలుగా రూపాంతరం చెందుతూ నేటి దశకు చేరిందో తెలియాలంటే మీరు "ప్రజా స్వామ్య ప్రస్థానం" పుస్తకాన్ని చదవాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్య భావన ఆవిర్భావం నుండి నేటి వరకు పూర్తిగా పూసగుచ్చినట్టు అందించారు రచయిత. ఈ శీర్షికలతో ఈ అంశాన్ని ఇన్ని కోణాల్లో విశ్లేషించిన పుస్తకం మరొకటి లేదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

జీవం పుట్టుక దగ్గర నుండి మొదలై, గుంపు జీవనం, సమాజాల ఆవిర్భావం, రాజరికాలు, రాజ్యాలు, పాలనలు, పోరా టాలు, సమానత్వ భావనలు, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పోరాటా లు.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన పోరాటా లు, అవి భారతదేశంపై ఎలా ప్రతిఫలిం చాయి. స్థానిక అంశాలను జోడిస్తూ ప్రజాస్వామ్యానికి అనుసంధానమైన ప్రతి పోగును కలిపి సంపూర్ణ ప్రజాస్వామ్య ప్రస్థానాన్ని అందించారు రచయిత. మాతృ స్వామ్య వ్యవస్థతో మొదలై, ఏథెన్స్ రాజ్యం, అమెరికా విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, తత్వవేత్తల రచనలు, కమ్యూనిస్టు మానిఫెస్టో, రష్యా విప్లవం, చైనా విప్లవం అన్నిటినీ వివరించారు. నాటి బుద్ధుడు మొదలు ప్రజాస్వామ్య భావనలు చెప్పిన ఏ తత్వవేత్తను వదలకుండా రాశారు. నెహ్రూ, గాంధీజీ, యం.యన్.రాయ్, జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, నాటి ఎమర్జెన్సీ, తెలంగాణ సాయుధ పోరాటం, నక్స లైట్ ఉద్యమం, సాంస్కృతిక పోరాటాలు, కుల వ్యవస్థ, రిజర్వే షన్లు, మండల్ ఉద్యమం, సంస్కృతీకరణ, భాషా రాజకీయాలు, నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న కీలక పరిణామాలు, పెరియార్ ఉద్యమం, ఎన్నికల చిత్రాలు, ఎన్నికల సంఘ సంస్కరణలు, స్థానిక సంస్థలు, ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాలు, న్యాయవ్యవస్థ, మతాధారిత రాజకీయాలు, బ్యూరోక్రసీ, పోలీసు వ్యవస్థ, అవినీతి, పాలనా సంస్కరణలు, మీడియా... తదితర అంశాలన్నీ ఒక క్రమపద్ధతిలో వివరించారు. ప్రజాస్వామ్య ప్రియులకు, సామాజిక ఉద్యమ కారులకు ఇది ఒక చక్కటి రిఫరెన్స్ బుక్. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారికి ఇది చాలా బాగా ఉప యోగపడుతుంది. ఎన్నో పుస్తకాలు సంవత్సరాల తరబడి అధ్య యనం చేయాల్సిన శ్రమ తప్పుతుంది. జర్నలిస్టులకు ఎంతగానో ఉపకరిస్తుంది. యువ రచయితలు ఈ పుస్తకాన్ని పక్కన పెట్టుకొని ఎన్నో కొత్తవ్యాసాలు రాసుకోవచ్చు. ఈ పుస్తకంలోని 13 అధ్యాయాలు చదివిన తరువాత మీకు "ఈనాడు మనం ఇంత స్వేచ్ఛా స్వాతం త్ర్యాలు అనుభవి స్తున్నామంటే మన ముందుతరాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతగా కృషి చేశారో!" అని అనిపించక మానదు.




సరైన సమాచారాన్ని సేకరించటం ఒక ఎత్తు. సేకరించిన సమాచారాన్ని ఒక క్రమంలో పేర్చటం, దాన్ని చారి త్రక పరిణామ క్రమంలో విశ్లేషించడం మరో ఎత్తు. అలా విశ్లేషించాలంటే రచ యితకు స్థాయి, మేధస్సు ఉండాలి. ఒరిజినాలిటీతో కూడిన రచయిత విశ్లేష ణ చాలా విషయాల్లో మన కళ్లు తెరిపి స్తుంది. కొన్నిసార్లు మన వీపు మీద కొరడాతో ఒక్క చరుపు చరిచి నిద్ర నుండి మేల్కొలిపినట్లు, ఇప్పటి వరకు గుడ్డిగా మనం అనుసరిస్తున్న

మిగతా 42వ పేజీలో

# కమ్యూనిస్టు ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనం కామ్రేడ్ సీతారాం ఏచూరి

- కొండూరి వీరయ్య



**కామ్రేడ్ సీతారాం ఏచూరి. జగమెరిగిన కమ్యూనిస్టు నేత. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి. ఆయన అకాల మరణం పట్ల దేశం, ప్రత్యేకించి వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులు తల్లడిల్లుతున్నాయి. దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ వామపక్ష అభిమానులు, పార్టీ కార్యకర్తలు, వివిధ రంగాల మేధావులు ఏచూరితో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకుంటున్నారు.**

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మీడియా కార్యదర్శి సంజయ్ బారు 'జాతీయ వామపక్ష పతాకగా ఎదిగిన హైదరాబాద్ కుర్రోడు' అన్నారు. ప్రఖ్యాత ఆర్థికవేత్త, జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో ఏచూరితోపాటు ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ విద్యార్థిగా చేరిన ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ ఏచూరిని ఉద్యమ జీవితంలో ఎగుడు దిగుడులు చూసిన ధీశాలి అన్నారు. సీతారాంకు శ్రద్ధాంజలి ఘటించటానికి హైదరాబాద్‌లో సమావేశమైన జేఎన్‌యూ పూర్వ విద్యార్థుల్లో ఒకరు, కాకతీయ విశ్వ విద్యాలయం మాజీ ప్రొఫెసర్ శ్యామలా దేవి 'ఏచూరి అన్న నా తొలి సెమిస్టర్ ఫీజు కట్టకపోతే నా పీహెచ్‌డీ చదువు ముందుకు సాగేది కాదని' కన్నీళ్లు పెట్టుకున్నారు. రాహుల్ గాంధీ తన నివాళిలో 'ఇండియా బ్లాక్ సృష్టికర్త. భారతదేశ భావనకు రక్షకుడు' అన్నారు.

ఇవన్నీ గమనిస్తే ఏచూరి వ్యక్తిత్వంలోని బహుముఖ కోణాలు కళ్ల ముందు ఆవిష్కృతమవుతాయి. నా చివరి సంభాషణ మధ్య భారతం కార్యక్షేత్రంగా పనిచేస్తున్న వివిధ వామపక్ష శ్రేణుల్లో కొందరు సీపీఎం ప్రజా సంఘాల్లో పని చేయటానికి సిద్ధంగా ఉన్నారన్న వార్త నాకు చేరింది. ఎన్నికలకు ముందే సుప్రీం కోర్టులో ఓ కేసు నిమిత్తం ఢిల్లీ వెళ్లాను. ఆ సందర్భంగా ఈ విషయమై కామ్రేడ్ సీతారాంతో చర్చించటానికి, సాధ్యా సాధ్యాలు పరిశీలించటానికి సమయం అడిగాను. వివిధ రాష్ట్రాల్లో ఇండియా భాగస్వాముల మధ్య సీట్ల సర్దుబాటు సంప్రదింపుల్లో తనదైన శైలిలో పాత్ర పోషిస్తూ తీరిక లేని పనిలోవున్నా నాకు సమయం కేటాయించి ప్రతిపాదనపై చర్చించారు. ఎన్నికల తర్వాత మరో దఫా వివరంగా కూర్చుందాం అన్నారు. తదనుగుణంగానే నేను కామ్రేడ్ సీతారాంను చివరిసారి కలిసి మాట్లాడినది జూలై 25వ తేదీన.



అప్పటికే పార్టీ మహాసభల షెడ్యూల్ ప్రకటించటం, కుటుంబ అవసరాల రీత్యా లండన్ పర్యటన ఉండటంతో మేము అనుకున్న విధంగా పైప్రతిపాదన గురించి వివరంగా చర్చించేందుకు సమయం దొరకలేదు. లండన్ నుండి తిరిగి రాగానే తప్పనిసరిగా సమయం ఇస్తానని మాటిచ్చారు. లండన్ నుండి తిరిగి వచ్చాక బిజీ అయిపోయారు.

సహజంగా నాకూ ఆయనకూ మధ్య జరిగే సంభాషణ నేరుగా విషయంతోనే మొదలవుతుంది. పలకరింపులు, యోగక్షేమాలూ ఉండవు. కానీ ఆగస్టు 13న ఎలా ఉన్నారు కామ్రేడ్ అని మెసేజ్ పెట్టాను. ఏదో అలా ఉన్నాను రా అని సమాధానం. అదేమిటి అని నా తిరుగు ప్రశ్న. నా ఆరోగ్యం గురించి నీకు తెలీదా? అని ఆయన తిరుగు సమాధానం. విన్నాక నాకెందుకో ఢిల్లీ వెళ్లి కలవాలనిపించింది. అదే విషయం అడిగాను. రమ్మంటారా అని.. ఏం.. ఇక్కడున్న వాళ్లు నన్ను సరిగ్గా చూసుకోవటం లేదని అనుమానమా ? అన్నారు నవ్వుతూ. ఆ నవ్వుతోపాటు తెరలు తెరలుగా దగ్గు. అప్పుడు చెప్పారు. కాటరాక్ట్ అపరేషన్ అయ్యిందని. చూడటానికి వస్తాను అంటే డిశ్చార్జి అయ్యాక కలుద్దాం అన్నారు. డిశ్చార్జి అయ్యాక నాకెక్కడ దొరుకుతారు అన్నాను నేను కూడా నవ్వుతూ. అలా ముగిసింది. నా ఆఖరి సంభాషణ.

## కామ్రేడ్ సీతారాం వ్యక్తిగత కార్యదర్శిగా

వయసులో చిన్నా పెద్దా లేకుండా ఆయనతో అందరికీ అంత చనువు తీసుకోగలిగినంత స్వేచ్ఛనిస్తారు కామ్రేడ్ సీతారాం. రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశాక ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా నన్ను ఎంపిక చేసుకున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుండి నాకు ఈ సమాచారం వచ్చినప్పుడు ఓ వైపు ఎంత ఆనందం కలిగిందో అంతే భయం కూడా. ఎందుకంటే అప్పటికే ఆయన భారత రాజకీయాల్లో శిఖరాయమానమైన నాయకుడు. మారిన పరిస్థితుల్లో బీజేపీ (ఫాసిస్టు ఆరెస్సెస్) వ్యతిరేక కూటమికి దన్నుగా నిలవాలన్న పార్టీ అవగాహనను అమలు పరిచే క్రమంలో సూర్జిత్ చొరవతో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారానికి వచ్చింది. ఏచూరి యూపీఏ-లెఫ్ట్ సమన్వయ బృందంలో వామపక్ష ప్రతినిధి అయితే ప్రణబ్‌ముఖర్జీ యూపీఏ ప్రతినిధి. చిదంబరం, జయరాం రమేష్‌తో కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమానికి వ్యూహకల్పన చేసిన దిట్ట. అటువంటి గొప్ప వ్యక్తి దగ్గర పని చేయటం అంటే అంతే ఒత్తిడి ఉంటుంది. నేను హిందీలో కానీ, ఇంగ్లీషులో కానీ అంత ప్రవీణుడిని కాను.. మీరు ప్రాతినిధ్యం వహించే బెంగాల్ నుండి వచ్చే విజ్ఞప్తులు హాండిల్ చేసేంత సామర్థ్యం లేదు. మీరిచ్చే బాధ్యతకు సరిపోనేమోనండీ అంటూ అనుమానం వ్యక్తం చేశాను.

ఎన్నికల సమయంలో నెయిదర్ గుడ్ నార్ గవర్నెన్స్ అనే శీర్షికన రాసిన వ్యాసం పీపుల్స్ డెమొక్రసీలో అచ్చయ్యింది. అప్పట్లో చంద్రబాబునాయుడు నినాదం గుడ్ గవర్నెన్స్ గురించి లండన్ కేంద్రంగా ఉన్న ఓ పరిశోధన సంస్థ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆ వ్యాసం రాశాను. 'ఆ వ్యాసం చూశాను. ఆ మాత్రం ఇంగ్లీషు వస్తే సరిపోతుంది. నాకు కావాల్సింది భాషా ప్రవీణులు కాదు. పార్టీ పట్ల నిబద్ధత, ఏ పనైనా అప్పగించగించవచ్చన్న భరోసా కావాలి' అన్నది ఆయన సమాధానం. అప్పటికి ఆంధ్రప్రదేశ్ నుంచి పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఉన్న కామ్రేడ్ కొరటాలతో ఈ విషయం పంచుకున్నాను. నేను మాట్లాడుతాను లే అన్నారు. చివరకు ఓ రోజు పీబీ సమావేశంలో ప్రకాష్ కరత్ సమక్షంలో కొరటాల నేను ప్రజాశక్తికి అవసరమనీ, కామ్రేడ్ ఏచూరి వ్యక్తిగత కార్యదర్శి బాధ్యతలకు మరొకరిని చూసుకొమ్మని తెగేసి చెప్పారు. దానికి ప్రకాష్, ఏచూరి ససేమిరా అన్నారు. ఆ చివరకు ప్రజాశక్తి బాధ్యతల నుండి తప్పుకుని ఏకేజీ భవన్ చేరాను. నాటి నుండి నేటి వరకూ కామ్రేడ్ సీతారాం నా ఎమీద ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటూ పని చేస్తున్నాను. పని – ప్రాధాన్యతల నడుమ సమన్వయంలో దిట్ట ఆయన గదిలోనే ఓ మూలన చిన్న డెస్క్ నాది. పార్లమెంట్ షెడ్యూల్ ప్రకారం పెండింగ్ పనుల జాబితా సిద్ధం చేసేవాడిని. ఆయనకున్న బహు ముఖ వ్యాసంగం, వ్యాపకాల్లో నా టేబుల్ మీద చాలా పనులు పెండింగ్ ఉండిపోయేవి. ఒకరోజు ఇలా అయితే కుదరదు కామ్రేడ్ అన్నాను. అదేమిటి అన్నారు. నా దగ్గర పేరుకుపోతున్న జాబితాను చూపించి ఇన్ని పనులు పెండింగ్ పెడితే ఇక నేను మీకు అందించే సహకారం ఏముంటుంది అని నిలదీశాను. నవ్వుతూ ప్రిన్సిపుల్స్ ఆఫ్ టైం మేనేజిమెంట్ అని ఓ చిన్న ఎంబీయే క్లాసు తీసుకున్నారు. అప్పుడు అర్థం అయ్యింది నాకు. ప్రతి ఒక్కరికీ పలు రకాల పనులు ఏక కాలంలో ముందుకొస్తాయి. ఏ పనిని ఎప్పుడు ఎంచుకోవాలి, ఎప్పుడు పూర్తి చేయాలి అన్నది వివరించేదే ప్రిన్సిపల్స్ ఆప్ టైం మేనేజ్మెంట్ పాఠం. ఈ పాఠం ప్రకారం తన ప్రాధాన్యతలను నిర్ణయించుకోవడానికి మొత్తం పనులను నాలుగు తరగతులుగా విభజించేవారు. అందులో అత్యవసరం, ముఖ్యం అన్న కేటగిరీలోకి వచ్చిన పనులను పూర్తి చేసుకుంటూ వెళ్లేవారు. ఈ మాత్రం ప్రాధాన్యత కలిగిన పనులు అయినా మీ దృష్టికి తేవాలి అంటే మీరేమో బిజీ బిజీగా ఉంటారు అని నిష్టూరమాడాను. దానికి సమాధానంగా సముద్రం అలలు ఆగితేనే తీరంలో నడవాలి అనుకుంటే కుదరదు అని వెన్ను తట్టారు. నాటి నుంచి నేటి వరకూ నేను ఎప్పుడు ఏ విషయం ఆయన దృష్టికి తీసుకురావాలని అనుకుంటే అప్పుడే చొరవ తీసుకునేవాడిని. పదిహేనేళ్లుగా మా మధ్య అనేక విషయాలు గురించిన సమాచారం, పరిణామాలు, పార్టీ స్పందిస్తే బాగుంటుందన్న అంశాలు, పార్లమెంట్‌లో లేవనెత్తితే దేశం దృష్టికి వస్తుందనుకున్న అంశాలూ.. ఒకటేమిటి.. ఎన్నో ఆయన దృష్టికి తెచ్చేవాడిని. అర్థరాత్రి ఏదో చదువుకుంటుంటే ఓ ఆలోచన వస్తే అది ఆయన దృష్టికి తీసుకెళ్లదగినది అని నేను భావిస్తే వెంటనే వాట్సప్ మెసేజ్ పెట్టేవాడిని. అంతరాత్రి కూడా మెసేజ్ చూసి స్పందించేంత ఓపిక కామ్రేడ్ ఏచూరిది.

## సంఘీభావం కోసం తపన

2006 అనుకుంటాను. పారిస్‌లో యునెస్కో సర్వసభ్య సమావేశం జరుగుతోంది. ఆ సమావేశంలోనే టాంజిబుల్ కల్చర్, ఇన్‌టాంజిబుల్ కల్చర్ అన్న చర్చ జరిగింది. మౌఖిక వాంగ్మయం అంతా ఇన్ టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ అని తీర్మానించింది. ఆ సందర్భంగా జరిగిన చర్చల్లో క్యూబా గురించిన ఓ తీర్మానం ఆమోదానికి వచ్చింది. అంతర్జాతీ రాజకీయాల్లో అమెరికాకూ, క్యూబాకూ ఉన్న సైద్ధాంతిక వైరం తెలిసిందే. ఆ తీర్మానంలో క్యూబా పక్షాన నిలవటానికి భారత రాయబారి సంశయిస్తున్నారు. దీంతో కామ్రేడ్ సీతారాం ఏచూరి చొరవ తీసుకుని 'నన్ను భారత ప్రభుత్వ ప్రతినిధిగా పంపారు. నేను క్యూబాకు అనుకూలంగా ఓటు చేయమని తీర్మానిస్తున్నాను' అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. దాంతో అక్కడున్న రాయబారి అప్పటి విదేశాంగశాఖ మంత్రి నట్వర్‌సింగ్‌కు ఫోన్ చేశారు. ఏచూరి ప్రతిపాదనకు ఆయన సానుకూలంగా స్పందించడంతో

విదేశాంగ శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కొత్త అధ్యయనాలు – కొత్త కోణాలతో ప్రభుత్వంపై చెర్నకోల 2007లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఓ కుదుపు కుదిపిన సబ్ ప్రైమ్ సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ నావను ఒడ్డుకు చేర్చే ప్రయత్నంలో ఉద్దీపన పథకాలు ప్రకటించింది. ఈ సందర్భంగా కామ్రేడ్ ఏచూరి అటు పార్టీ వారపత్రిక పీపుల్స్ డెమొక్రసీలోనూ, హిందూస్థాన్ టైమ్స్‌లోనూ ఎంతో సంక్లిష్టమైన ఆర్థిక సంక్షోభాన్ని సరళంగా వివరిస్తూ ఎన్నో వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాల్లో విలువైన గణాంకాలున్నాయి. ఆ కాలంలో కామ్రేడ్ సీతారాం ఉపయోగించిన గణాంకాల్లో ఎక్కువ భాగం సేకరించి పెట్టాను. వీటిల్లో కొన్నింటిని పార్లమెంట్ చర్చల్లో సైతం ఉపయోగించారు. ఓ సందర్భంలో పార్లమెంట్‌లో ఉన్న అప్పటి ఆర్థిక మంత్రి పి చిదంబరం 'ఏచూరీ, మీరు చెబుతున్న లెక్కలకు ఆధారాలు ఏమిటి?' అని ప్రశ్నించారు. దీంతో పార్లమెంట్ లాబీలోకి వచ్చి నాకు కాల్ చేశారు. 'ఈ లెక్కలు ఎక్కడ నుంచి తీశావురా?' అని. సబ్ ప్రైమ్ సంక్షోభాన్ని ముందస్తుగానే ఊహించిన ఆర్థిక వేత్తల్లో నోరియల్ రూబిని ఒకరు. ఆయన పెట్టుబడిదారీ విధానపు బలహీనతలను ఎత్తి చూపిస్తూ పుంఖాను పుంఖాలుగా తన సొంత వెబ్‌సైట్‌లో రాసేవారు. అందులో కొన్నిటిని అప్పట్లో అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన ఫైనాన్షియల్ టైమ్స్ కూడా ఉపయోగించింది. ఈ వివరాలు కామ్రేడ్‌కు ఇచ్చాను. అదే వివరాలు చిదంబరం దృష్టికి తీసుకెళ్లారు. రూబిని ని ఫాలో అవుతున్నారంటే నిన్ను తట్టుకోవటం కష్టమేనని చిదంబరం చలోక్తి విసిరారు.

ముంబయిపై ఉగ్రవాద దాడి నేపథ్యంలో చిదంబరం హోం శాఖకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రణబ్‌ముఖర్జీ ఆర్థిక శాఖ బాధ్యతలు తీసుకున్నారు. 2007 నుండీ 2011 వరకూ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో పన్ను మినహాయింపుల ద్వారా కేంద్రం కోల్పోయిన ఆదాయం గురించిన చర్చను ప్రారంభించిన ఘనత కామ్రేడ్ ఏచూరిది. దాని తర్వాతనే అన్ని పత్రికలూ ఈ విషయం పై విశ్లేషణలు చేశాయి. ఇలా అత్యంత ప్రతిభావంతులైన విలేకరులకంటే ముందుగానే విషయాలను పసిగట్టగలిగిన అసమాన ప్రతిభావంతుడు కామ్రేడ్ సీతారాం. రాజకీయ సంకీర్ణాలే కాదు.. మేధో సంకీర్ణాల్లోనూ మేటి అపారమైన అధ్యయనం ఆయన పెట్టుబడి. ఎన్ని పుస్తకాలు చదివావు అన్నది కాదు ఆయనకు గీటురాయి. ఎన్ని పుస్తకాల్లోని జ్ఞానాన్ని వర్తమాన అవసరాలకు ఉపయోగించుకోగలిగాము అన్నది గీటురాయి.

సుమిత్ర చిస్తి కామ్రేడ్ సీతారాంకు అత్తయ్య. సీమా చిస్తీ తల్లి. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలోనే ఆర్థికశాస్త్రంలో ప్రొఫెసర్. ఆమె కృషిని జ్ఞాపకం చేసుసకుంటూ ఏర్పాటు చేసిన స్మారకోపన్యాసాలు నూతన మేధో సంకీర్ణాల నిర్మాణానికి వేదికలుగా మల్చుకున్నారు కామ్రేడ్ ఏచూరి. ఓ స్మారకోపన్యాసానికి సమాచార హక్కు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన అరుణారాయ్‌ని ఆహ్వానిస్తే మరో సమావేశానికి కర్ణాటకకు చెందిన ప్రముఖ సాహిత్యకారుడు యూఆర్ అనంతమూర్తిని ఆహ్వానించారు. మరికొన్ని స్మారకోపణ్యాసాలకు శాస్త్రవేత్తలను ఆహ్వానించారు. యూఆర్ అనంతమూర్తి బీజ రూపంలో ప్రస్తావించిన బహుళ అస్తిత్వాలు అన్న సూత్రీకరణను తొలిసారిగా లెఫ్ట్‌హాండ్ డ్రైవ్ శీర్షికలో రాసిన వ్యాసంలో విస్తారంగా చర్చించారు.

2017 ఆగస్టులో రాజ్యసభ ఎంపీగా బాధ్యతల నుండి వైదొలగే సందర్భంలో చేసిన వీడ్కోలు ఉపన్యాసం ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆ ఉపన్యాసంలో తాను కుల, మత, ప్రాంత, భాషా అస్తిత్వాలను అధిగమించిన భారతీయుడిని అని చెప్పుకున్నారు. ఈ ఉపన్యాసం లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ శీర్షికన రాసిన వ్యాసానికి తార్కిక ముగింపే. సుమిత్ర చిస్తి స్మారకోపన్యాసాల్లో ఒక ఉపన్యాసంలో ప్రపంచవ్యాప్తంగా భౌతిక శాస్త్రంలో జరుగుతున్న పరిశోధనలను ప్రస్తావిస్తారు. ఆ ప్రస్తావల సారాన్ని అందుకుని అప్పట్లో అణు ఇంధన ఒప్పందాల గురించి జరుగుతున్న చర్చల్లో తనదైన శైలిలో ఉపయోగించి అందరినీ ఆశ్చర్యపర్చే వాడు. ఎంతో మంది మేధావుల నుండి, పరిశోధకుల నుండీ ఆలోచనలు, సూత్రీకరణలు స్వీకరించి తాను నాయకత్వం వహిస్తున్న పార్టీ అవగాహనతో వడపోసి తగిన సమయంలో తగిన విధంగా ఉపయోగించటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఇటువంటి మేధో సంకీర్ణాలే నేడు ఇండియా బ్లాక్‌కు కావల్సిన సైద్ధాంతిక పునాదిని, ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు దాడిని ఎదుర్కొనడానికి అవసరమైన వ్యూహాత్మక సాధనాలను అందిస్తోంది. అందుకనే రాహుల్ గాంధీ తన నివాళిలో 'కామ్రేడ్ సీతారాం 'ఇండియా బ్లాక్ నిర్మాత'గా ప్రశంసించారు.

ముల్కీ వాణి – బాణి రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పతాకస్థాయికి చేరిన కాలం అది. ఉత్తర తెలంగాణలో మొదలైన ఉద్యమం రాష్ట్రమంతటా కార్చిచ్చులా వ్యాపించింది. చివరకు ఓ దశలో ప్రత్యేక తెలంగాణ వాదులు సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై దాడికి సిద్ధపడుతున్నారన్న వార్తలు కామ్రేడ్ సీతారాంకు ఆందోళన కలిగించాయి. అర్ధరాత్రి పూట టీవీల్లో వస్తున్న స్క్రోలింగ్ చూసి కామ్రేడ్ సీతారాంకు ఫోన్ చేశాను. తక్షణమే అప్పటి తాత్కాలిక ముఖ్యమంత్రి రోశయ్యకు, తెరాస ఎంపీగా ఉన్న బి.వినోద్‌కుమార్‌కు ఫోను చేశారు. దీంతో అదనపు బలగాలు బాగ్లింగంపల్లి చేరాయి. కాసేపటికి హైదరాబాదు నగరంలో ఉన్న పార్టీ శ్రేణులు చేరుకోవటంతో ఆందోళనకారులు తమ ఉద్వేగాలను అణుచుకుని నిరసన నినాదాలు చేస్తూ సాగిపోయారు. తెలంగాణ బిల్లు గురించి పార్లమెంటులో జరిగిన చర్చల్లో పాల్గొంటూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించక లేకపోతే ముందు ముందు

ఇటువంటి ప్రాంతీయ ఉద్యమాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ విధానపరంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలకు కట్టుబడి ఉందని చెప్తున్నప్పుడు పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. తెరాససభ్యులు కేకలు వేస్తుంటే వాళ్లను నోరు మూయించటం కోసం నా దగ్గర ముల్కీ సర్టిఫికెట్ ఉంది. మీ దగ్గర కానీ మీ నాయకుడి దగ్గరకానీ ఉన్నదా అని సవాలు విసిరారు. దాంతో సభ సద్దుమణిగింది.

స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ విషయంలో తెలంగాణ సాయుధ పోరాటంలోనూ, స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్న పాతతరం కమ్యూనిస్టు నేతలు మల్లు స్వరాజ్యం, కె.కృష్ణమూర్తి, బీఎన్ రెడ్డి వంటి వారు స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ డిమాండ్‌తో ప్రతినిధి బృందంగా వచ్చారు. హోం మంత్రిగా ఉన్న చిదంబరం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాము. అక్కడ నుండి సరైన సమాధానం రాకపోవడంతో జీరో అవర్ చర్చల ద్వారా ఈ విషయాన్ని పార్లమెంట్ దృష్టికి తీసుకురావడం మంచిదని ప్రతిపాదించాను. దానికి కామ్రేడ్ అంగీకరించారు. జీరో అవర్‌లో ఈ విషయాన్ని లెవనెత్తుతూ 'స్వాతంత్ర్య సమర యోధులు పెన్షన్ కోసం డిమాండ్ చేస్తున్నారంటే దాన్ని కేవలం ఆర్థిక డిమాండ్‌గానో, కేంద్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపే డిమాండ్‌గానో చూడరాదనీ, స్వాతంత్ర్యోద్యమంలో తాము చేసిన త్యాగాలకు గుర్తింపు కావాలన్న డిమాండ్‌గా చూడాలని' ఏచూరి ప్రభుత్వాన్ని కోరారు. చివరకు ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లటంతో కొందరికైనా పెన్షన్ విడుదల కావడానికి ఈ జీరో అవర్ చర్చ ఉపయోగపడింది.

### పార్లమెంట్‌కు గురజాడ

బహు భాషల్లో ప్రవేశం ఉన్నప్పటికీ తెలుగు సాహిత్యానికి కామ్రేడ్ సీతారాం జీవితంలో ప్రత్యేక స్థానం ఉంది. నేను వ్యక్తిగత కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత హైదరాబాద్ నుండి అప్పటి ప్రజాశక్తి పుస్తకాలయం ఎడిటర్ తెలకపల్లి రవి ఓ విజ్ఞప్తి పంపారు. ప్రముఖ కవి కేతు విశ్వనాథరెడ్డి తెలుగు సాహిత్యం గురించి ఇంగ్లీషులో ఓ పుస్తకం ప్రచురించ సంకల్పించారనీ, దానికి ముందుమాట రాయాలన్నది ఆ విజ్ఞప్తి. ఈ విషయం గురించి చర్చించే క్రమంలోనే తల్లి కల్పకం ఏచూరి కూచిపూడి నృత్యకారిణి అనీ, ఆ రకంగా త్యాగరాయ కృతులు వంటి వాటితో పరిచయం ఏర్పడిందనీ గుర్తు చేసుకున్నారు. విశ్వనాథరెడ్డి పుస్తకానికి రాసిన ముందుమాటలో కర్నాటక్ సంగీత స్రవంతి ఆవిర్భావం, దాని చరిత్ర గురించి అద్భుతంగా వివరించారు. అదేవిధంగా ఉద్దీపన పథకాల గురించి జరిపే చర్చలోనే అనుకుంటా.. ఈ పథకాలు పెట్టుబడిదారులకు వరాలు కాకూడదని చెప్పే ప్రయత్నంలో దేశమంటే మట్టి కాదో దేశమంటే మనుషులోయ్ అన్న గుజరాడ పద్యాన్ని ఇంగ్లీషు – తెలుగు భాషల్లో పార్లమెంట్‌కు పరిచయం చేశారు. పార్లమెంట్‌లో పాలకపక్షం, ప్రతిపక్షం మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లతో సభ వేడెక్కుతున్న తరుణంలో హిందీ సాహిత్యంలో సందర్భోచిత కవితలు, కథనాలు, షాయిరీలతో సభలో వాతావరణాన్ని ఉల్లాసంగా మార్చిన సందర్భాలెన్నో ఉన్నాయి. ప్రజా జీవనంలో నీతి నిజాయితీ కామ్రేడ్ సీతారాం వ్యక్తిగత కార్యదర్శిగా చేరిన మొదటి సంవత్సరం వార్షిక ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేయటానికి వెళ్లాను. పార్లమెంట్ సభ్యునికి వేతన భత్యాలు తోడుకాక ముందు ఆయన వార్షిక ఆదాయం ఐదు లక్షలలోపే ఉండేది. ఐటీ రిటర్న్ స్వీకరించటానికి ప్రగతి మైదాన్‌లో శిబిరాలు ఏర్పాటు చేసేవారు. అక్కడ క్యూలో నిలబడ్డా. ఆయన అప్పటికే ఢిల్లీ సర్కిల్‌లో పేరున్న రాజకీయ నేత. రాజకీయ నేతలంటే అవినీతిపరులన్న అభిప్రాయం సర్వత్రా ఉన్న కాలం అది. ఆదాయపు పన్నుశాఖ అధికారి కామ్రేడ్ వార్షికాదాయం చూసి ఎంత దాచారు అని అడిగాడు ఎగతాళిగా. ఎక్కడ దాచారో కనుక్కోవడానికే కదా మీకు జీతాలిస్తోంది, కనుక్కోండి అన్నాను. అదే విషయాన్ని వచ్చి కామ్రేడ్‌కు చెప్పాను. ఆయన నవ్వుతూ 'అందుకే సుందరయ్య గోల్ బిల్డింగ్ (పార్లమెంట్)కు దూరంగా ఉండమని చెప్పాడు రా' అన్నారు. ఇదే విషయాన్ని తన వీడ్కోలు ఉపన్యాసంలో కూడా ప్రస్తావించారు. నాటి నుంచి చనిపోయే వరకూ ఆర్థిక విషయాల్లో కానీ పార్టీ చందాలు వసూలు చేసే విషయంలో కానీ పార్టీ క్రమశిక్షణను ఎక్కడా ఉల్లంఘించలేదు.

2009 ఎన్నికల సమయంలో ఓ పెద్ద కంపెనీకి చెందిన డైరెక్టర్ రెండు పెద్ద బాగుల నిండా నగదు నింపుకుని ఆఫీసుకు వచ్చారు. రాక ముందే నాకు కాల్ చేసి ఇదీ సంగతి అని చెప్పారు. ఈ విషయాన్ని కామ్రేడ్ సీతారాంకు చేరవేశాను. ఆయన ప్రకాష్‌తో సంప్రదించి వద్దని చెప్పారు. అయినా వినకుండా సదరు కంపెనీ డైరెక్టర్ నగదు తీసుకుని ఏకేజీ భవన్ వచ్చారు. ఆ నగదు సంచులతో సహా ప్రకాష్ కరత్ కార్యాలయానికి తీసుకెళ్లి పార్టీ విధానం విడమర్చి చెప్పి ఆయనను గౌరవంగా నగదు సంచులతో సహా వెనక్కు పంపారు. నేను కింద రిసెప్షన్‌లో ఉన్నాను. తెలుగు వారి సంప్రదాయం ప్రకారం ఏదీ యథాతథంగా వెనక్కు పంపకూడదు కదా టీ ఇప్పించి సాగనంపు అన్నారు నవ్వుతూ ఆయన ముందే. అటువంటి అనుభవాలు అనేకం ఉన్నాయి. నాయకుడిగా గీత దాటదల్చుకుంటే ఆపటం ఎవరి తరమూ కాదు. కానీ పార్టీ విధానమే తన విధానం అని గీత గీసుకు కూర్చున్న గొప్ప నాయకుడు కామ్రేడ్ ఏచూరి.

ఎయిమ్స్ పట్ల అపారమైన గౌరవం కామ్రేడ్ సీతారాం అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్ర సంస్థ(ఎయిమ్స్) పట్ల ప్రత్యేక అభిమానం ఉండేది. అనేక సందర్భాల్లో ఎయిమ్స్ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించటంలో ఆయన

ప్రత్యేకంగా జోక్యం చేసుకున్నారు. ఉన్నత విద్యా సంస్థల్లో 27 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ అప్పటి యూపీఏ ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వ్యతిరేకంగా బీజేపీ ప్రోత్సాహంతో అనేక ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేసే సిబ్బంది సమ్మెకు దిగారు. ఎయిమ్స్ వైద్యులు కూడా. చివరకు కామ్రేడ్ సీతారాం జోక్యం చేసుకుని మీ సమ్మె దేశవ్యాప్తంగా తరలి వస్తున్న రోగులకు ప్రాణాంతకం అవుతుందనీ, ప్రత్యామ్నాయ నిరసన మార్గాలు చూసుకోవాలని సలహా ఇచ్చారు. ఆ సంస్థ పట్ల తనకున్న గౌరవాన్ని వీడ్కోలు ఉపన్యాసంలోను రాజ్యసభ దృష్టికి తెచ్చారు. ఆయనకున్న నమ్మకంతోనే చివరి దశలో చికిత్స అవసరం అయినప్పుడు ఎయిమ్స్‌లో చేర్చారు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు నేతగా కామ్రేడ్ సీతారాం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక సామర్థ్యం పట్ల ఇటలీ, గ్రీస్, పోర్చుగల్ కమ్యూనిస్టు పార్టీలకు అపారమైన విశ్వాసం. కామ్రేడ్ మోటూరు హనుమంతరావు చనిపోయిన మర్నాడు నేడు కృష్ణవేణి విగ్రహం ఉన్న ప్రాంతానికి దిగువన అంత్యక్రియలు జరిగాయి. ఆ సందర్భంగా అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి సూర్జిత్ మాట్లాడుతూ 1952 ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న తరుణంలో తాను ఇటలీ కమ్యూనిస్టు పార్టీ మహాసభలకు హాజరవుతున్నాననీ, 33 శాతం ఓట్లతో ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు విజయం సాధించటం ప్రపంచాన్ని అబ్బుర పర్చిందనీ గుర్తు చేసుకున్నారు. నాటి నుంచి సీపీఎం కార్యాచరణ, సైద్ధాంతిక నిబద్ధత, అంతర్జాతీయ పరిణామాల పట్ల అవగాహన, దేశీయ కార్యాచరణ విషయంలో వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలకు విలక్షణమైన విశ్వాసం ఉండేది. ఈ విశ్వాసానికి మరింత భరోసా ఇచ్చిన సందర్భం 1992లో జరిగిన 14వ మహాసభల సందర్భంగా ఆమోదించిన 'కొన్ని సైద్ధాంతిక సమస్యలపై తీర్మానం' ఈ తీర్మానాన్ని కామ్రేడ్ బసవపున్నయ్య మార్గదర్శకత్వంలో కామ్రేడ్ సీతారాం రూపొందించారు. ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టే సందర్భం వచ్చినప్పుడు ఈ తీర్మానాన్ని ఏచూరి ప్రవేశపెట్టాలన్నది కామ్రేడ్ ఎంబీ ప్రతిపాదన. మీరుండగా నేనెలా ప్రవేశపెడతాను అన్న కామ్రేడ్ ఏచూరి ప్రశ్నకు సమాధానంగా ఎంబీ 'మేము ఉన్నప్పుడు ప్రవేశపెడితేనే కదా పొరపాటు జరిగితే సరిదిద్దుతాము. మేము లేకపోతే ఆ పొరపాట్లు ఎవరు సరిదిద్దుతారు ?' అని ప్రశ్నించారు.

కోజికోడ్ మహాసభల సందర్భంగా సైద్ధాంతిక సమస్యలపై ప్రత్యేక తీర్మానం రూపొందించాలని పార్టీ నిర్ణయించింది. ఈ తీర్మానం రూపొందించే క్రమంలో మా ఇద్దరి మధ్య జరిగిన చర్చల్లో కామ్రేడ్ ఏచూరి వెల్లడించిన విషయాలు ఇవి. ఈ సామర్థ్యమే దేశంలో తాజాగా ఇండియా కూటమి నిర్మాణానికి కావాల్సిన భూమికను సిద్ధం చేసింది. ఈ సామర్ధ్యంతోనే భారత వామపక్ష ఉద్యమం ప్రపంచీకరణ నేపథ్యంలో తలెత్తుతున్న సమస్యలను, కార్యాచరణకు ఎదురవుతున్న అవరోధాలకు పరిష్కారాలు చూపే ప్రయత్నంలో ఢిల్లీలో 2005లో జరిగిన సీపీఎం జాతీయ మహాసభల్లో సైద్ధాంతిక సమస్యలపై రూపొందించిన తీర్మానం. మార్క్సిస్టు కార్యాచరణ ప్రమాణాలను అనుసరించి నేపాల్‌లో వామపక్ష సంఘటన ప్రభుత్వాన్ని రాజ్యాంగబద్ధంగా అధికారానికి తీసుకురావడంలో కామ్రేడ్ సీతారాం పాత్ర అద్వితీయం. కామ్రేడ్ ప్రచండ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వానికి అంతర్జాతీయ ఆమోదస్థాయి కల్పించటంలో కామ్రేడ్ సీతారాం క్రియాశీలక సృజనాత్మకతను ప్రదర్శించారు. నేపాల్‌లో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఎలా ఏర్పడింది అన్నది ఓ పెద్ద అధ్యాయం. చరిత్రగ్రస్తం. భిన్న కోణాలకు, భిన్న ధృవాలకు ప్రాతినిధ్యం వహించే శక్తులు, నాయకులతో సంప్రదింపులు జరిపి ఒప్పించి తత్కాలీన సమస్యలకు ఓ పరిష్కారం చూపటంలో కామ్రేడ్ ఏచూరి శక్తి సామర్థ్యాలు అనన్య సామాన్యం.

### కామ్రేడ్ సీతారాంతో చివరి మూడు రోజులు

కంటి ఆపరేషన్ అయ్యాక ఆఫీసుకు వచ్చి పార్టీ మహాసభ పనుల్లో నిమగ్నమయ్యారు కామ్రేడ్ సీతారాం. ఢిల్లీలోనే ఆగస్టు 19న ఓ ముఖ్యమైన సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ఉన్నట్లుండి ఇబ్బంది తలెత్తడటంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియగానే సీమా చిస్తికి కాల్ చేశాను. ఐసీయూ నుంచి రూంకి వచ్చారు. డిశ్చార్జ్ అయ్యాక వచ్చి వెళ్లు అన్నారు. రోజువారీ ప్రాతిపదికన కామ్రేడ్ ఆరోగ్య విషయాలు తెలుసుకుంటూ ఉన్నా. చివరకు వెంటిలేషన్ మీదకు వెళ్లారని విన్న తర్వాత మనసాగలేదు. సీమా వారిస్తున్నా కోర్టు నుంచే ఎయిర్‌పోర్టుకు వెళ్లా. వెంటనే సీమాను కలిశాను. దేశంలో ఇంతకన్నా మెరుగైన వైద్యం అందించటానికి అవకాశం ఉందా ? లేదా ? అని అడిగాను. ఊపిరితిత్తుల సమస్య అయినందున ఆర్మీ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు కాశ్మీర్ సరిహద్దుల్లో పని చేసే సైన్యానికి వచ్చే ఇటువంటి ఇబ్బందులు పరిష్కరించడంలో దిట్టలు కాబట్టి ఆర్మీ రిఫరల్ ఆసుపత్రి నుంచి ఎవరినైనా పిలుద్దామా అని ప్రతిపాదించాను. చివరకు ఎయిర్ లిఫ్ట్ చేసి మరెక్కడన్నా వైద్యం చేయిస్తే కామ్రేడ్ బతికే అవకాశం ఉందా అని చర్చించాను. అన్నీ విన్న తర్వాత ఎయిమ్స్ మీద కామ్రేడ్‌కు నమ్మకం ఉంది. దేశంలో గుర్తింపు పొందిన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన నమ్మకాన్ని కాదని నేను నిర్ణయం తీసుకోలేను అని చెప్పారు సీమా. చేసేదేమీ లేక విషన్న వదనుడనై వెనుదిరిగాను. ఆందోళన చెందినట్లే పరిస్థితి విషమించింది. మానవ ప్రయత్నం ముగిసిందని వైద్యులు చెప్పారు. కామ్రేడ్ సీతారాంతో గడిపిన రోజులు, జరిపిన చర్చలు, చేసిన వాదనలే జ్ఞాపకాలుగా కర్తవ్యోన్ముఖులం అవుదాం. కామ్రేడ్ సీతారాంకు విప్లవాభినందనల వీడ్కోలు. ❑

# తెలంగాణ సాయుధ పోరాటం గర్వకారణమైన జ్ఞాపకం



- సురవరం సుధాకరరెడ్డి

మొగల్ సామ్రాజ్యం దక్షిణ భారతదేశాన్ని జయించి ఔరంగజేబు మరణం తర్వాత వారి రాజప్రతినిధిగా వచ్చిన సైనికాధిపతులే నిజాం రాజులు. ఢిల్లీలో మొగల్‌సామ్రాజ్య ప్రాభవం తగ్గగానే స్వతంత్రం ప్రకటించుకున్నారు. ఆ తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో రాజీపడ్డారు. దేశంలో 550 సంస్థానాలుండగా, అన్నింటికంటే పెద్దది నిజాం సంస్థానం. నిజాం మైసూరు రాజు టిప్పు సుల్తాన్‌కు, మహారాష్ట్రులకు వ్యతిరేకంగా బ్రిటిషర్లకు మద్దతు ఇచ్చినందుకు, నిజాం నవాబును కాపాడేందుకు బ్రిటిష్ సైన్యాన్ని ఇక్కడ ఉంచారు. వారి ఖర్చుల నిమిత్తం, సర్కారు జిల్లాలను, ఆ తర్వాత రాయల సీమను వారికి అప్పగించారు. అయినా మిగిలిన హైదరాబాదు సంస్థానం దేశంలోని 550 సంస్థానాలలో పెద్దది. దీని వైశా ల్యం 82,696 చదరపు మైళ్ళు. ఇది గ్రేట్ బ్రిటన్ వైశాల్యానికి సమానం. ఇందులో ఎనిమిది తెలుగు జిల్లాలు, ఐదు మరాఠీ జిల్లాలు, మూడు కర్ణాటక జిల్లాలు ఉండేవి. కోటి ఎనభై లక్షల జనాభాలో సగం మంది మాతృభాష తెలుగు, 25 శాతం మంది మరాఠీ, 12 శాతం మంది ఉర్దూ, 11 శాతం మంది కన్నడ, ఇతర భాషలు మాట్లాడేవారు. కాని ఉర్దూలో తప్ప పాఠశాలలు లేవు. ఆరు శాతం ప్రజలు మాత్రమే అక్షరాస్యులు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో మెడిసిన్, ఇంజనీరింగ్ కూడా ఉర్దూలో బోధించేవారు.

ప్రైవేటుగా మాతృభాషలో పాఠశాలలు పెట్టుకోవడానికి వీల్లేదు. గ్రంథాలయాలకు అనుమతి కావాలి. పత్రికలున్నా తీవ్రమైన సెన్సార్ వుండేది. భారతదేశంలో హైదరాబాదు సంస్థానం ఒక చీకటి రాజ్యం. తెలంగాణ ప్రాంతంలో భూ కేంద్రీకరణ విపరీతంగా వుండేది. మొత్తం సాగులోవున్న భూమి దాదాపు 70% భూస్వాముల చేతుల్లో వుండేది. ఐదు వేల ఎకరాలపైన వున్న భూస్వాములు 550 మంది. రాష్ట్రం మొత్తం మీద చిన్న పెద్ద భూస్వాములలో 1982 మంది ముస్లింలు, 618 మంది హిందూ భూస్వాములు వుండేవారు. నిజాం సొంత ఖర్చుల కోసం 636 గ్రామాల్లో ఐదు లక్షల ముప్పై వేల ఎకరాల భూమి వుండేది. నిజాం రాజులు అత్యంత విలాసంగా జీవించేవారు. అనేకమంది భార్యలు, ఉంపుడుగత్తెలు వుండే వారు. 7వ నిజాం ఆస్తి ఆనాడు 400 కోట్ల రూపాయలు. అప్పుడు ప్రపంచంలోకెల్లా ధనవంతుడని పేరుండేది. రాష్ట్రంలో ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మికులు దుర్భర జీవితం



గడిపేవారు. అన్ని కులాల వారు, జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు, ప్రభుత్వ అధికారుల దగ్గర వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది. నిజాం ప్రభుత్వంలో ఎక్కువ మంది అధికారులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారే. ముఖ్యంగా యు.పి. ముస్లింలు. దీనివల్ల స్థానిక ముస్లింలలో అసంతృప్తి వచ్చింది. ముల్కి (స్థానిక)లకే ఉద్యోగా లు కావాలని ఆందోళనలు 6వ నిజాం మహబూబ్‌ఆలీఖాన్ హయాంలోనే ప్రారంభమైంది. హిందువులకు నామమాత్రమైన ఉద్యోగాలు మాత్రమే ఇచ్చేవారు. గ్రామీణ ప్రాంతాలలో దారుణమైన దోపిడీ, వెట్టిచాకిరీ (వేతనం ఇవ్వకుండా ఉచితంగా పని చేయించుకోవటం) వుండేది. ఊళ్ళో రైతులందరూ ముందుగా దేశ్‌ముఖ్, జాగీర్దారుల భూములు దున్ని తర్వాత తమ భూములు దున్నుకోవాలి. చెరువు నీళ్ళు ముందు భూస్వాములకే ఇవ్వాలి. దళితులు గడీ ముందు ఊడ్చి, శుభ్రం చేసి సానిపి (కళ్ళాపి) చల్లి, పశువుల దొడ్డి శుభ్రం చేసి, మేత వేసి ఇతర పనులు చేయాలి. యజమాని, ఆయన కుటుంబ సభ్యులకు, ఆయన పాలేర్లకు ఉచితంగా చెప్పులు ఇవ్వాలి. చాకలి ఉచితంగా బట్టలు ఉతకడం, దొర, ఆయన కుటుంబ సభ్యులు బయటి ఊళ్ళకు పోతే వారి కచ్చడం(కోడెల బండి) ముందు పెట్టి నెత్తిన పెట్టుకుని పరిగెత్తాలి. మంగలి ఉచితంగా క్షౌరం చేయడం, పశువులకు వైద్యం చేయాలి. పద్మశాలీలు ఉచితంగా బట్టలు నేసి ఇవ్వాలి. పెళ్ళిళ్ళు, ఉత్సవాలకు అదనపు బట్టలివ్వాలి. యాదవులు ఉచితంగా గొర్రెలివ్వాలి. పాడి వున్న రైతులు ఉచితంగా పాలు పోయాలి. వైశ్యులు ఉచితంగా సరుకులు దేశ్‌ముఖ్‌లకు, అధికారులకు ఇవ్వాలి. బ్రాహ్మణులు ఉచితంగా విస్తర్లు కుట్టి ఇవ్వాలి. గౌడ్‌లు ఉచితంగా కల్లు సప్లయ్ చేయాలి.

ఇవేకాకుండా దొరల ఇండ్లలో పెండ్లిళ్ళకు అందరు ఉచితంగా పాలు, గొర్రెలు, కోళ్ళు, ధాన్యం ఇచ్చి పనిచేయాలి. అనేక పేద కుటుంబాల వారి మహిళలు మానభంగానికి గురయ్యేవారు. పేదలు దౌర్జన్యానికి గురయ్యేవారు. ఇచ్చిన అప్పుకు అనేక రెట్లు వడ్డీ వసూలు చేసి ఇవ్వకపోతే వారి ఇళ్ళు, భూములు స్వాధీనం చేసుకునే వారు. తప్పుడు కేసులు పెట్టేవారు. కరణాలు తప్పుడు లెక్కలు రాసి పేదల భూములు కాజేసేవారు. తెలంగాణలో తెలుగు ప్రజల సంఘంగా ఆంధ్రజనసభ ప్రారంభమైంది. అది ఆంధ్ర మహాసభగా రూపొందింది. జోగిపేట ప్రథమ ఆంధ్ర మహాసభ సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టడం, విజ్ఞప్తులు చేయడంతో ప్రారంభమైంది. యువతరం ముందుకు వచ్చి ఆంధ్ర మహాసభలో చురుకైన పాత్రతో సమస్యలు మీద పోరాటం ప్రారంభించారు. రావి నారాయణరెడ్డి అధ్యక్ష స్థానానికి పోటీ చేసి 10వ మహాసభలో స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసం ఇచ్చారు. 1946 నాటికి ఆంధ్ర మహాసభ ప్రధాన రాజకీయ శక్తిగా ఆవిర్భవించింది.

ఫ్యూడల్ దోపిడీ, దౌర్జన్యాలతో హిందూ భూస్వాములు కూడా ప్రధాన పాత్ర వహించారు. ఈ దశలో ఆంధ్ర మహాసభలో మిత వాదులు, అతివాదులు, జాతీయవాదుల మధ్య ఘర్షణలో వామ పక్షవాదులు మెజారిటీ అయ్యారు. రావి నారాయణరెడ్డి అధ్యక్షుడైన తర్వాత పేద ప్రజల సమస్యలు, తెలుగులో బోధన, వెట్టిచాకిరీ రద్దు తదితర అంశాలపైన కార్యాచరణ తీసుకున్నారు. హైదరాబాద్‌లో మఖ్దుం, రాజబహదూర్ తదితరులు కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ట్రేడ్ యూనియన్లు నిర్మించారు. ముస్లిం మేధావులు కూడా ఫ్యూడల్ రాచరికానికి వ్యతిరేకంగా గళమెత్తారు. భారత యూనియన్‌లో చేరనని "ఆజాద్ హైదరాబాద్" అని స్వతంత్ర రాజ్యాన్ని 7వ నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ ప్రకటించారు. దేశవ్యాపితంగా జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటం హైదరాబాద్ సంస్థాన ప్రజల మీద ప్రభావం చూపింది. గోల్కొండ పత్రిక, మీజాన్ పత్రిక (తెలుగు), కొన్ని ఉర్దూ పత్రికలు ప్రజలలో చైతన్యం పెంచాయి.

ఖాశిం రజ్వీ అనే వ్యక్తి మజ్లిస్ పార్టీకి అధ్యక్షుడై, హైదరాబాద్‌ను స్వతంత్ర ముస్లిం రాజ్యం చేస్తానని ప్రకటించి రజాకార్ల(వలంటీర్) నిర్మాణానికి పూనుకుని వేలాది మంది ముస్లిములను చేర్పించి దాడులు ప్రారంభించాడు. నిజాం మద్దతిచ్చాడు. రజాకార్లకు హిందూ భూస్వాములు మద్దతిచ్చారు. దౌర్జన్యాలు పెరిగేకొద్దీ ప్రతిఘటన పెరిగింది. తెలంగాణను ముస్లిం మెజారిటీ సంస్థానంగా చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి ఎనిమిది లక్షల మంది ముస్లింలను అంతకు ముందు తీసుకువచ్చారని ఒక ఆరోపణ వుంది. ఈ దశలో కేంద్ర ప్రభుత్వానికి నిజాంకు మధ్య అనేక చర్చల తర్వాత యధాతథ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం నిజాం రాజుగా కొనసాగుతాడు. యూనియన్ సైన్యాలు ఉపసంహరించారు. విదేశాంగ, రక్షణ కేంద్రం బాధ్యతల్లో వుంటుంది. సంస్థాన ఆంతరంగిక వ్యవహారాల్లో కేంద్రం జోక్యం చేసుకోదు. ఇది రాష్ట్ర ప్రజలకు కేంద్రం చేసిన ద్రోహం. ఈలోగా విసునూరి రామచంద్రారెడ్డి (20 గ్రామాలలో 40 వేల ఎకరాల భూస్వామి) ప్రజల మీద దాడులు ఉధృతం చేశాడు. ఆయన తల్లి జానకమ్మ నరరూప రాక్షసి. ఆమె కడివెండి గడీలో ఉంటూ దౌర్జన్యాలు చేసేది. కడివెండిలో ప్రజలు బలవంతపు ధాన్యం లెవీకి వ్యతిరేకంగా ఊరేగింపు తీస్తే, గడీలోంచి కాల్పులు జరిపి, దొడ్డి కొమరయ్యను బలి తీసుకున్నారు. ప్రతి రైతు తను పండించిన పంటలో కొంత భాగం ప్రభుత్వానికి చెల్లించేవి లెవీ. భూస్వాములు, దేశ్‌ముఖ్‌లను వదిలిపెట్టి సామాన్య, పేద రైతుల మీదనే ఈ లెవీ దౌర్జన్యంగా వసూలు చేసేవారు. అనేక ఇతర గ్రామాలలో రజాకార్లు గ్రామాలను తగలబెట్టి, స్త్రీలను మానభంగాలు చేశారు. అనేక మందిని చంపేశారు. బైరాన్‌పల్లి, పరకాల తదితర గ్రామాలలో డజన్ల సంఖ్యలో ప్రజలు హతులయ్యారు.

కామ్రేడ్ సి.ఆర్. (చంద్ర రాజేశ్వరరావు), సుబ్బారెడ్డి అనే మారుపేరుతో రెడ్డి హాస్టలులో చేరి, రావి నారాయణరెడ్డి, గురవారెడ్డి, మఖ్దుం, రాజ్‌లను పార్టీ సభ్యులుగా చేర్చి పార్టీ నిర్మాణం ప్రారంభించారు. సర్వదేవభట్ల రామనాథం తదితరులు వరంగల్‌లో కార్మిక సంఘాల పోరాటాలు నడిపారు. ఎస్.వి.కె. ప్రసాద్, తమ్మారెడ్డి తదితరులను ఆంధ్ర పార్టీ తెలంగాణకు పంపింది. సుందరయ్య ఆంధ్ర పార్టీని నిరంతరం గైడ్ చేశారు.

ఈ నేపథ్యంలో 1947 సెప్టెంబరు 11 వ తేదీన నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోసి సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకుగాను, సాయుధపోరాటం చేయవలసిందిగా రావి నారాయణరెడ్డి, మఖ్దుం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి పేరుతో ప్రకటన విడుదల చేశారు. సాయుధ పోరాటం దావానలంలాగా వ్యాపించింది. రజాకార్లు, నిజాం పోలీసులు, భూస్వాములు ఒకవైపు, కమ్యూనిస్టుల నాయకత్వాన ప్రజలు మరొకవైపు మోహరించారు. మధ్య తరగతి రైతులు, మేధావులు, వర్తకులు పోరాటానికి మద్దతిచ్చారు. కొంతమంది చైతన్యవంతులైన పెద్ద రైతులు, కరణాలు చేయి కలిపి పేద ప్రజలకు అండగా నిలబడ్డారు. గ్రామాలలో ఆంధ్ర మహాసభ సభ్యత్వం వుంటే వెట్టిచాకిరీ రద్దవుతుందని పేదలకు విశ్వాసం కలిగింది. వాస్తవానికి భూస్వాముల తరఫున వెట్టిచాకిరీకి పిలవడానికి వచ్చిన గుండాలు ప్రజలు చిట్టీ (సభ్యత్వ రసీదు) చూపగానే వెనక్కు వెళ్ళేవారు. ప్రజలు దీనిని గుదప సంఘం (లాఠీల సంఘం) అనేవారు. ప్రజల దగ్గర ఆయుధాలు లేకపోయినా లాఠీలతో, వడిసెళ్ళతో, స్త్రీలు కారం పొడితో,

రాళ్ళతో రజాకార్లను ప్రతిఘటించేవారు. నాటు తుపాకులు తయారు చేసుకున్నారు. రజాకార్ల నుంచి లాక్కున్న ఆయుధాలతో యుద్ధం చేశారు.

ఈ పోరాటం ముఖ్యంగా నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో విస్తృతంగా, ఇతర జిల్లాల్లో కొంత పరిమితంగా జరిగింది. కాని దాదాపు అన్ని జిల్లాల్లో జరిగింది. కోస్తాంధ్ర, రాయలసీమ నుంచి వలంటీర్లుగా కార్యకర్తలు, ధన సహాయం, ఆయుధ సహాయం చేశారు. భూస్వాములు గ్రామాలు వదిలి హైదరాబాదుకు, ఇతర రాష్ట్రాలకు పారిపోయారు. 3000 గ్రామాలను కమ్యూనిస్టు పార్టీ ప్రభావితం చేసింది. దాదాపు పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచింది. పోరాటం నగర సరిహద్దుల దాకా వస్తున్నదనే అభిప్రాయం కలిగింది. ఆ సమయంలో అరాచకత్వాన్ని, హింసను అరికట్టే పేరుతో యూనియన్ సైన్యాలు హైదరాబాదు సంస్థానాన్ని అన్ని వైపులా నుంచి ముట్టడించాయి. కొన్నిచోట్ల ప్రతిఘటించినా మూడు రోజుల్లో నిజాం సైన్యం లొంగిపోయింది. నిజాం స్వయంగా లొంగిపోతున్నట్లు ప్రకటించాడు. ఇదొక లాలూచీ కుస్తీ.

మిలటరీ గవర్నర్‌గా నియమితులైన జనరల్ చౌదరి కొందరు రజాకార్లను, ఖాశిం రజ్వీని అరెస్టు చేసి, కమ్యూనిస్టుల మీద యుద్ధం ప్రకటించాడు. సుప్రసిద్ధ గాంధేయవాది సరోజిని నాయుడు కుమారుడు డాక్టర్ జయసూర్య, మరికొందరు మిలటరీ గవర్నరును కలిసి తమకు నెల రోజులు గడువిస్తే, కమ్యూనిస్టులతో చర్చించి, సాయుధ పోరాటాన్ని ఉపసంహరింప జేస్తామని, ఆయుధాలు అప్పగించమని కోరుతామని చెప్పారు. దానికి జనరల్ చౌదరి, అహంకారంతో నిరాకరించి నెల రోజులెందుకు, వారం రోజుల్లో తెలంగాణలో కమ్యూనిస్టులను ఏరివేస్తానని జవాబిచ్చాడు. అధునాతన ఆయుధాలతో గ్రామాల మీద పడి కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, సానుభూతిపరులనుకున్న వారి మీద చిత్రహింసలు, హత్యాకాండ సాగించారు. పారిపోయిన భూస్వాములు యూనియన్ సైన్యాలతోపాటు, గ్రామాలకు తిరిగి వచ్చారు. కుచ్చు టోపీలు, షేర్వానీలు వదిలేసి, గాంధీ టోపీలు, ఖద్దరు చొక్కాలతో దర్శనమిచ్చారు. తాము కోల్పోయిన భూములు తిరిగి బలవంతంగా లాక్కున్నారు. అనేకచోట్ల ప్రజలు ప్రతిఘటించారు. అనివార్యంగా సాయుధ పోరాటం కొనసాగింది. హైదరాబాదు సంస్థానం, భారత యూనియన్‌లో విలీనమైనందున, నిజాం దుష్ట ప్రభుత్వం కూలిపోయినందున మధ్య తరగతి ప్రజలు, వర్తకులు, కొందరు మేధావులు సాయుధ పోరాటం ఆవశ్యకత లేదని భావించారు. యూనియన్ సైన్యాల దాడిలో పెద్ద సంఖ్యలో కామ్రేడ్స్, నాయకులను చంపారు. 1951 చివరిలో పార్టీ కేంద్ర కమిటీ సమావేశమై సాయుధ పోరాటాన్ని ఉపసంహరించాలని నిర్ణయించింది.


తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా నిజాం నిరంకుశ పాలన, ఫ్యూడల్ పాలన రద్దయి, భారత యూనియన్‌లో విలీనమైంది. భూస్వాముల వద్ద వేల ఎకరాల భూ కేంద్రీకరణ బద్దలైంది. రెండు పర్యాయాలు భూసంస్కరణల ద్వారా ఇది సాధ్యమైనా పేదలకు తగినంత భూమి దక్కలేదు. భూ సంస్కరణలు దేశం ముందు ప్రధాన ఎజెండా అయింది. తెలంగాణలో అమానుషమైన వెట్టిచాకిరీ రద్దయింది. ప్రజలలో చైతన్యం పెరిగింది. వర్గ పోరాటం కొనసాగింది. భూస్వాములు, వారి తాబేదార్లు, ముందు కాంగ్రెసులో, తర్వాత తెలంగాణ ప్రజాసమితి, తెలంగాణ రాష్ట్ర సమితిలలో చేరారు. మళ్ళీ ఇప్పుడు మతోన్మాద బీజేపీలో భాగమౌతున్నారు. బీజేపీ వారు హిందూ-ముస్లిం పోరాటంగా సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి 'ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువుల పోరాటం'గా చిత్రీకరిస్తున్నారు. ఇందులో హిందువులు, ముస్లింలు అందరూ పాల్గొన్నారు. ముస్లిం కార్మికులు సాయుధ పోరాటానికి మద్దతిచ్చారు. సాయుధ పోరాటం, దాడులు చేసిన రజాకార్లను తప్ప, ముస్లిం పౌరులను చంపలేదు. యూనియన్ సైన్యాలు వచ్చిన తర్వాత వారి చాటున మహారాష్ట్రలో కొంత మంది ముస్లింలను ఆర్.ఎస్.ఎస్.కు సంబంధించిన వారు చంపారు. తెలంగాణలో అలాంటి ఘటనలు జరగలేదు.


భారత యూనియన్‌లో హైదరాబాదు సంస్థానం విలీనంలో కాంగ్రెసు పాత్ర కొంత వుంది. అందులో మితవాదుల పాత్ర నామమాత్రం. స్వామి రామానంద తీర్థ నాయకత్వాన ఉన్న కాంగ్రెసు జాతీయవాదులు గట్టిగా పోరాటం చేశారు. కాని సాయుధ పోరాటానిదే ప్రధాన పాత్ర.

బి.జె.పి. మరొక వక్రీకరణ చేసింది. ఆనాటి భారత ఉపప్రధాని సర్దార్ పటేల్ వల్ల మిలటరీ హైదరాబాదును విలీనం చేసిందనేది కేవలం దుష్ప్రచారం మాత్రమే. సాయుధ పోరాటం మరింత విస్తరించి కమ్యూనిస్టులు హైదరాబాదు సంస్థానం తెలంగాణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంటుందనే భయంతోనే మిలటరీని పంపారు. ఇది లాలూచీ కుస్తీ. వేలాది మందిని చిత్రహింసలు పెట్టిన, హత్యలు చేయించిన నిజాంను అరెస్టు చెయ్యకపోగా, రాజప్రముఖ్‌ను చేసి కోటి రూపాయల రాజభరణం ఇచ్చారు. ఇది 'విముక్తా' 'రాజీ'నా ప్రజలు అర్థం చేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటం కాలం చెల్లిన భూస్వామ్య వ్యవస్థ దాని ఉపరితలం నిర్మాణమైన నికృష్టమైన నిజాం సర్కారు ప్రభుత్వంపైన జరిగిన పోరాటం. గత సంవత్సరం ఎం.ఐ.ఎం. నాయకుడు పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ స్వయంగా, దీనిని ఫ్యూడల్ వ్యతిరేక పోరాటంగా వర్ణించారు. ఐతే ఒక వామపక్ష జర్నలిస్టు, ముస్లిం మేధావుల సంస్థ వ్యవస్థాపకుడు, ఈ పోరాటాన్ని కమ్యూనిస్టులకున్న ముస్లిం వ్యతిరేక భావం వల్ల వచ్చిందనే అర్థంలో వ్యాసం రాయడం విచారకరం.

ఇది మత పోరాటం కాదు. వర్గ పోరాట స్వభావం కలిగిన పోరాటం. ఆయన విమర్శ ముస్లిం మేధావుల్లో విషబీజాలు నాటుతుంది. ఆయన పునరాలోచించుకోవాలి. ఈ విమర్శ చర్చ కోసమే ఐతే అది వేరే విషయం. తెలంగాణ సాయుధ పోరాటం, ప్రజాస్వామ్యం కోసం, పౌరహక్కుల కోసం, సంస్థానాన్ని భారత యూనియన్లో విలీనంకోసం జరిగిన పోరాటం. ప్రస్తుత నక్సలైట్ పోరాటం తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగింపు అనే వాదన పూర్తిగా తప్పు. పోరాటం చైతన్యవంతులైన ప్రజలు నడుపుతారు. మంచి నిర్మాణం, పరిపక్వ నాయకత్వం కలిగిన కమ్యూనిస్టు పార్టీ నేతృత్వం వహించాలి. సాయుధ పోరాటాన్ని, మిలటరీ జోక్యం తర్వాత వెంటనే ఉపసంహరించి ఉండాల్సిందని ఒక వాదన. 1951లో ఉపసంహరించడం తప్పని, దానిని కొనసాగించాల్సి వుండేదని వామపక్షాలలో వాదోపవాదనలు జరిగాయి. కొందరు నక్సలైట్లు, తమది సాయుధ పోరాటం కొనసాగింపు అని కూడా వాదించారు. ఇది సరైన వాదన కాదు. ఆంధ్ర ప్రాంతానికి సాయుధ పోరాటాన్ని పొడిగించాలని చేసిన నిర్ణయం, సరైంది కాదు. అక్కడ సాయుధ పోరాటానికి అవసరమైన పరిస్థితులు లేవు. దానివల్ల తీవ్రమైన నష్టం జరిగింది. అపారమైన త్యాగాలు అక్కడి కామ్రేడ్స్ చేశారు. ఏదేమైనా తెలంగాణ సాయుధ పోరాటం, చరిత్రాత్మకమైన మహత్తర పోరాటం. ఆ అమరవీరులకు, పోరాటంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలకు, నాయకత్వం వహించిన నాయకులకు జోహార్లర్పించి, వారి లక్ష్యాలను కొనసాగించే ప్రతిన తీసుకుందాం. మన దేశం కోసం, మన కోసం, మన స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన, పోరాడిన ఆ యోధులను స్మరించుకుందాం. ❑

# కొత్త పుస్తకాల స్వీకారం..



కొన్ని మిళింద ప్రచురణలు (1994-2023)

1. స్టడీస్ ఇన్ హిందూ మెటీరియలిజమ్ – డా॥ కె.బి.కృష్ణ, 1994
2. తెలుగు వెలుగు డా॥ కె.బి.కృష్ణ – టి.రవిచంద్ 1995
3. భగవద్గీతలో భౌతికవాద అంశాలు – డా॥ కె.బి.కృష్ణ
   అనువాదం : ఏటుకూరు బలరామమూర్తి 1995, 2000
4. వజ్రసూచి (వర్ణవ్యవస్థ ఖండన) – మహాకవి అశ్వఘోషుడు
   అనువాదం : డా॥ మలయశ్రీ 1997
5. పొలిటికల్ అండ్ సోషల్ థాట్ ఆఫ్ బుద్దిస్ట్ రైటర్స్
   – డా॥ కె.బి.కృష్ణ 1999
6. నవదీక్షిత బౌద్ధులు – రాహుల్ సాంకృత్యాయన్
   అనువాదం : డా॥ మలయశ్రీ 2002
7. మహామేధావి, మార్క్సిస్టు భాష్యకారుడు డా॥ కె.బి.కృష్ణ
   – గదర్‌వీరుడు దర్శి చెంచయ్య 2003
8. ఆంధ్ర బౌద్ధ భాష్యకారుడు ప్రొ॥ పి.లక్ష్మీనరసు – టి.రవిచంద్ 2004
9. మార్క్స్ దృష్టిలో మనిషి – ఎరిక్‌ఫ్రామ్
   అనువాదం : అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి 2005
10. గురజాడ జీవితంలో బౌద్ధం – టి.రవిచంద్ 2012
11. ఆంధ్ర బౌద్ధం – టి.రవిచంద్ 2014
12. సంస్కృతి పథంలో సంజీవదేవ్ – టి.రవిచంద్ 2015
13. ఇద్దరు మహావ్యక్తులు : బుద్ధుడు-గాంధీ
    – రాహుల్ సాంకృత్యాయన్ 2017
14. భారతీయ భౌతికవాద తత్వవేత్త దేవీప్రసాద్ చటోపాధ్యాయ
    – టి.రవిచంద్ 2018
15. టి.రవిచంద్‌కు ఆచార్య కె.వి.రాసిన లేఖలు
    ('వలసవాదం, ప్రాచ్యవాదం, ద్రావిడ భాషలు' గ్రంథ రచయిత)
    (అముద్రితం) సంకలనం : టి.రవిచంద్ 2022

మిళింద ప్రచురణలు, బాపట్ల

2023

మిళింది ప్రచురణలు..

# విశాఖలో దాశరథి శత జయంతి సభ



- డాక్టర్ సీఎన్ క్షేత్రపాల్‌రెడ్డి

తెలుగు సాహిత్యవనంలో ఉద్భవించిన ప్రజా ఉద్యమ తేజస్సు దాశరథి కృష్ణమాచార్య. 22 ఏళ్ల చిరు ప్రాయంలోనే జనం చేత మహాకవి అని బిరుదు పొందిన దాశరథి శత జయంతి సంవత్సరం ప్రారంభ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయిత సంఘం విశాఖ జిల్లా సమితి నగరంలోని ఆంధ్ర విశ్వకళా పరిషత్ - తెలుగు శాఖతో కలసి ప్రత్యేకంగా రెండు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించింది. సెప్టెంబరు 10, 11 తేదీల్లో వర్సిటీలోని టీఎల్ఎన్ సభా హాలులో తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్, వై.విజయ్‌కుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంరదం కన్వీనర్ జేవీ సత్యనారాయణ మూర్తి, పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాద్, కోయి కోటేశ్వరరావు, విస్తాలి శంకరరావు తదితర ప్రముఖులతో కలసి దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత జరిగిన సదస్సులో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ కీలకోపన్యాసం చేస్తూ దాశరథి కలం నుంచి వెలువడ్డ ప్రతి అక్షరం జన సంక్షేమం కోసం అగ్నిధారగా తెలుగు నేలపై ప్రవహించిందని అన్నారు. శుద్ధ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఆయన సంప్రదాయాలను ఛేదించి నిజాం నిరంకుశ పాలనపై సాహితీ ఉద్యమం చేసిన గొప్ప కవిగా అభివర్ణించారు. నిజాం నిరంకుశ పాలనలో ప్రజల కడగండ్లను చూసి చలించిన దాశరథి నిజాంపై తన కవితల్ని శూలాలను సంధించారని తెలిపారు. ఒకచేత్తో కలం మరో చేతిలో ఆయుధం పట్టి నిజాం పాలనపై పోరాటం చేసిన అక్షర శస్త్రధారి దాశరథి అని కొనియాడారు. భయపడ్డ నిజాం దాశరథిని జైలులో బంధిస్తే జైలు గోడలను ఉద్యమ పుస్తకాలుగా మలుచుకున్న సాహిత్యోద్యమ పిపాసి దాశరథి అని పేర్కొన్నారు. అనంతరం దాశరథి కవిత్వం - సామాజిక జీవితం అనే అంశంపై హైదరాబాద్‌లోని సిటీ కాలేజీ తెలుగుశాఖ అధ్యక్షులు కోయి కోటేశ్వరరావు ఆలోచ నాత్మ, కవితావేశ పూరిత ప్రసంగం చేశారు. సామాజిక జీవి తం ప్రతిబింబించిన సాహిత్యం ప్రజల నాలుకలపై ఎప్పటికీ నిలిచి ఉంటుందని స్పష్టం చేశారు. పరిశోధిస్తే ప్రాచీన సాహి త్యం, ఆధ్యాత్మిక సాహిత్యంలోనూ సామాజిక స్పృహ కనిపిస్తుం దని తెలిపారు. కమ్యూనిస్టు సిద్ధాంతాల వ్యాప్తి అప్పటి కవులకు ఓ స్పష్టమైన దారి చూపించి అభ్యుదయ సాహిత్యం ఒక దారి దీపంలా వెలుగునిచ్చిందని వివరించారు. రచయిత చూపు ఎలా ఉండాలి, ఎవరి పక్షం వహించాలనే స్పష్టతనివ్వడం ద్వారా అభ్యుదయ సాహిత్యం సమాజానికి చేరువైందని తెలి పారు. జనం ఇక్కట్లకు పరిష్కారం కోసం అభ్యుదయ, విప్లవ సాహిత్యాలు కృషి చేశాయని తెలిపారు. ఇందులో మెరిసిన సాహితీ వజ్రం దాశరథి అని పేర్కొన్నారు. నిజాం నవాబుపై ధిక్కార స్వరాన్ని వినిపించి ముసలి నక్కకు రాజరికమా అంటూ కవిత్వం రాసిన గొప్ప కవి దాశరథి అని చెప్పారు. సాహిత్యాన్ని ఒక మహోద్యమంగా మార్చి తెలంగాణ పీడిత ప్రజానీకానికి మైక్ అయ్యారని వివరించారు. దాశరథికి కళా ప్రపూర్ణ బిరుదు నిచ్చిన ఆంధ్ర



విశ్వ కళాపరిషత్ ప్రాంగణంలో శత జయంతి ఉత్సవాల నిర్వహణ తమను ఎంతో ఆనందింపచేసినట్టు తెలిపారు. అరసం విశాఖ జిల్లా కార్యదర్శి డాక్టర్ సీఎన్ క్షేత్ర పాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశాలాంధ్ర జాతీయ దినపత్రిక సంపాదకులు ఆర్వీ రామారావు 'తెలంగాణ విముక్తి పోరాటం-దాశరథి' అనే అంశంపై మాట్లాడారు. నిజాం సంస్థానం జనసామాన్యానికి కంతకంగా ఉన్న రోజుల పరిస్థితుల ను వివరించారు. నాటి పరిస్థితులే దాశరథిని విప్లవ పంథాలో నడిచేలా చేశాయని పేర్కొన్నారు. సాహిత్యకారుడిగానే కాకుండా నీళ్లలో చేపలా ప్రజల మధ్య మమేకమైన నిజాంకి వ్యతిరేకంగా దాశరథి చేసిన పోరాటం అనన్య సామాన్యమేనని పేర్కొన్నారు. నిజాం పాలనలో అధికార భాష ఉర్దూ అయినా 80 శాతం మంది ప్రజలు తెలుగే మాట్లాడేవారు కావడంతో దాశరథి రాసిన పద్యం, కవిత్వం వచనం కన్నా సులువుగా జనానికి చేరువైందని తెలిపారు. దాశరథి సాహిత్యం నిండా ప్రజా సమస్యలే అజెండా అవడంతో పీడిత జనం దాశరథిని తమ ఆత్మ బంధువుగా భావించి ఆదరించినట్టు తెలిపారు. సామాన్య జనమే ఆయన్ను మహాకవి అని బిరుదుతో సంభోధించినట్టు గుర్తు చేశారు. నిజాం సంస్థానంపై పోలీసు చర్యకు ముందే దాశరథి వంటి కవుల స్ఫూర్తి, ఉద్యమ కారుల త్యాగాలతో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నడ్డిని విరిచేసిందని గుర్తు చేశారు. దాశరథి స్వయంగా ఈ సాయుధ పోరాటానికి సాహిత్య పు ఊపిరులూదినట్టు తెలిపారు. దాశరథి అరసం అధ్యక్షులు గానూ పనిచేశారని గుర్తుచేశారు. అత్యంత నిరాడంబర జీవితం గడిపారని, ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా ఉన్న కాలంలో ఆయన చేతిలో చిల్లిగవ్వ లేని రోజులను తాను చూశానని గుర్తు చేసుకు న్నారు. సామాన్యుడిగా కనిపించే అసామాన్యుడైన దాశరథిలో దాగి ఉన్న విప్లవాగ్నిని విద్యార్థి లోకానికి వివరించారు.

మద్రాసు విశ్వ విద్యాయలం తెలుగు శాఖ అధ్యక్షులు విస్తాలి శంకరరావు 'దాశరథి చలన చిత్ర సాహిత్యం'పై మాట్లాడుతూ... దాశరథి సాహిత్యంలో చలన చిత్ర సాహిత్యం చాలా విభిన్నమైం దని చెప్పారు. అభ్యుయ కవిగా ఉన్న ఆయన 600పైగా సినిమా పాటలు రాశారని తెలిపారు. అభ్యుదయంతోపాటు ప్రేమ గీతాలు జనాదరణ పొందినట్టు పేర్కొన్నారు. దాశరథి ఎంత ఉద్వేగ భరింతంగా, విప్లవాత్మకంగా రాయగలడో అదే స్థాయితో మానవ సంబంధాలను, ప్రకృతిని, ప్రణయాన్ని, విరహాన్ని చలన చిత్ర సాహిత్యంలో పండించారని ఆయన రాసిన పాటలను హృద్యంగా ఆలపిస్తూ వివరించారు. అనంతరం సాహితీవేత్త బొడ్డ కూర్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ 'దాశరథి-నాటక సాహిత్యం'పై మాట్లాడుతూ 1920 దశకంలో పుట్టిన మహా కవుల్లో దాశరథి కృష్ణమాచార్య ఒకరని, ఆయన గురించి నేటి తరం తెలుసుకోవాలని అభిలషించారు. భాషకు హద్దులు లేవని, సాహిత్యకారులు ఎవరూ విభజన వాదం తేకూడదని పేర్కొ న్నారు. దాశరథి కలం నుంచి వెలువడిన నాటక సాహిత్య విశేషాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర

### అభ్యుదయ సాహిత్యంపై ఆసక్తి

దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాల్లో భాగస్వా మ్యం అవడంతో అభ్యుదయ సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. దాశరథి జీవితం, సాహిత్య కృషి, ఉన్నతమైన సమాజం కోసం ఆయన పాటుపడిన విధానం గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నా. సాహిత్యం పీడితులు, అణగారిన వర్గాల పక్షాన నిలుస్తుందనడానికి దాశరథి కలమే తార్కాణం. మా తరం విద్యార్థుల కోసం తెలుగు శాఖ, అరసం సంయుక్తం గా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నాను.

**- ఇస్సాకు, ఎం.ఏ, ద్వితీయ సంవత్సరం**

### మరింతగా అధ్యయనం చేయాలనుంది

దాశరథి జీవితం ఎంతటి ఆదర్శప్రాయమో తెలుసుకు న్నా. ఈ ఉత్సవాలు మా జీవితాంతం గుర్తుంటాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నేను పాల్గొన్నందుకు ఎంతో సం తోషంగా ఉంది. నిజాం పాలనా కాలంలో దాశరథి చేసిన రచనలు ప్రభావం ఎంతటిదో మా కళ్ల ముందు కనిపిం చింది. సాహిత్యకారుడికి సమాజంపై ఎంతటి ప్రేమ, మమ కారాలు ఉంటాయో దాశరథి సాహిత్యం ద్వారా తెలిసింది. సభల ప్రభావంతో దాశరథిని మరింత విస్తృతంగా అధ్యయ నం చేయాలని అనిపిస్తున్నది. మా కోసం తెలుగు శాఖతో కలసి సభలను నిర్వహించిన అరసం సంస్థకు కృతజ్ఞతలు.

**- జల్ల పద్మ, ఎం.ఏ, ద్వితీయ సంవత్సరం**

### దాశరథి జీవితమే ఓ సందేశం

సాహిత్యం సమాజ హితాన్ని కోరుతుందని దాశరథి రచనలన్నీ నిరూపించాయి. కళాప్రపూర్ణ దాశరథి కృష్ణమా చార్య శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న వక్తల ద్వారా గొప్ప సందేశాలు విన్నాను. చిరస్మరణీయమైన కార్యక్రమం లో నేను ఉన్నందుకు సంతోషంగా ఉంది. దాశరథి కృష్ణమాచార్య జీవితమే మహోన్నతమైన సందేశాన్ని ఇస్తున్నది. దాశరథి సాహిత్య ఆశయాలను కొనసాగించే బాధ్యత విద్యార్థిలోకంపై ఉన్నదని భావిస్తున్నాను.

**- కాళ్ల సత్య, ఎం.ఏ, ద్వితీయ సంవత్సరం**

అధ్యక్షులు చంద్రా నాయక్ నేతృత్వంలో ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా బృందం నిర్వహించిన 'దాశరథి అభ్యుదయ గీతా లాపన' కార్యక్రమంలో ఆ చల్లని సముద్రగర్భం సహా దాశరథి అందించిన గీతాలు, కవిత్వాన్ని ఆలపించి సభికులను అభ్యుద యోత్సాహం మధ్య ఉత్సాహపరిచారు.


రెండవ రోజు ఏయు తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన మొదటి సమావేశంలో అరసం తెలంగాణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ 'దాశరథి కథలు-సమాలోచన' అంశం పై మాట్లాడారు. దాశరథి 13 కథలు రాశారని తెలిపారు. ఆయ న కథల్లోని గొప్పతనాన్ని వివరించారు. 13వ కథ 'స్వాతి చిను కులు' ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంలో వెలిసిన కథా నిలయంలోనే లభించిందని తెలిపారు. 1948 సెప్టెంబర్ 11న హైదరాబాదు లో నిజాంకి వ్యతిరేకంగా పోలీసు చర్య ప్రారంభమైందని, సరిగ్గా అదే రోజున నిజాంకి వ్యతిరేకంగా పోరాటం చేసిన దాశరథి శత జయంతి ఉత్సవ సభ విశాఖలో నిర్వహిస్తుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దాశరథి యాత్రాస్మృతి అంశంపై అరసం కార్యనిర్వాహక కార్యదర్శి జీఎస్ చలం ప్రసంగించారు. దాశరథి తన జీవితంలోని ముఖ్య ఘట్టాలే యాత్రా స్మృతిగా వెలువడిందని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనలో దాశరథి గడిపిన జైలు జీవిత అనుభవాలే ఆ పుస్తకమని తెలిపారు. విద్యార్థి దశ నుంచే దాశరథి ఉద్యమబాట పట్టారని, ఆయన జీవితమంతా ఉద్యమ మేనని చెప్పారు. మృత్యువు ముంగిట్లో పోరాటాన్ని వదలని జనం హితం కోరిన మహోన్నతుడు దాశరథి అని కొనియాడారు.

అరసం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.హనుమంతరావు అధ్యక్షత జరిగిన సదస్సులో ఏయూ గౌరవ ఆచార్యులు వెలమల సిమ్మన్న 'ప్రజాకవి దాశరథి' అనే అంశంపై మాట్లాడారు. దాశ రథి జీవితమే ఒక ఉద్యమం అన్నారు. ఆయన అన్ని సాహిత్య ప్రక్రియలోనూ రచనలు చేశారని పేర్కొన్నారు. ఆయన రాసిన అగ్నిధార, మహోంధ్రోదయం, రుద్రవీణ, అమృతా భిషేకం, కవితాపుష్పకం వంటి కావ్యాల అంత:సారాన్ని వివరించారు. నిజాం రాజుని నేరుగా దిగిపోమని చెప్పిన ఒకే ఒక్క కవి దాశ రథి అని గుర్తుచేశారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డివి సూర్య రావు 'దాశరథి తిమిరంతో సమరం'పై ప్రసంగించారు. సమ సమాజం ఉండాలని ఆశించిన దాశరథి కవిత్వం నిండా ఆ భావాలనే అక్షరీకరించినట్టు తెలిపారు. కవి సాహిత్యంతోనే కాదు ఆయుధంతోనూ పోరాటం నడుపగలడు అని నిరూపించిన గొప్ప అభ్యుయద, విప్లవ కారుడని తెలిపారు. రచయితలు పెన్ను ను జేబులో పెటుకోవాలి, గన్ను చేతబట్టుకోవాలి అంటూ పిలుపు నిచ్చిన దాశరథి రచించిన తిమిరంతో సమరం విశేషాలను వివరించారు. సమాపనోత్సవానికి అధ్యక్షత వహించిన వై.విజయ్‌కుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నిర్వాహకులు జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రజల కష్టాలపై సాహితీ పోరాటంతో పాటు ప్రత్యక్ష కార్యాచరణకు దిగిన గొప్ప కవి దాశరథి అన్నారు. విద్యార్థుల్లో సాహిత్య అభిలాషను పెంపొందించేలా జరిగే అన్ని కార్యక్రమాల నిర్వహణకు తమ సంస్థ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో వజ్రాయుధం రచయిత ఆవంత్స సోమసుందర్ శత జయంతి ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో అంతర్భాగంగా విశాలాంధ్ర జాతీయ దినపత్రిక సంపాదకులు ఆర్.వి.రామా రావుకు పురిపండా పురస్కారాన్ని ప్రకటించి అందజేశారు. కందుకూరు వీరేశలింగం పేరున ఇచ్చే పురస్కారం ఆచార్య కాత్యాయనీ విద్మహేకి, విరియాల లక్ష్మీపతి పురస్కారం ఆచార్య కె.ముత్యం గారిగి ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమాప నోత్సవంలో అరసం సీనియర్ నేత ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య ఎస్ఎం ఇక్బల్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల సామాజిక కార్యకర్త ఎం.పైడిరాజు తదితరులు భాగస్వామ్యం కాగా తెలంగాణ సాహిత్య అకాడమీ దాశరథిపై ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆ సంస్థ ప్రతినిధి సోమశిల తిరుపాల్ అతిధులకు అందించారు. ❑

# చారిత్రక గమనాన్ని చూపిన 'ప్రజాస్వామ్య ప్రస్థానం'

**(30వ పేజీ తరువాయి)**


భావనల లోతుపాతులు తెలుసుకోమంటుంది. ఇలాంటి రచన చేయాలంటే మేధస్సుతో పాటు ధైర్యం, సైద్ధాంతిక అవగాహన, అనుభవజ్ఞానం కూడా కావాలి. ఇవి రచయితలో పుష్కలంగా వున్నాయి. ఇంకో విషయం చెప్పాలంటే తెలుగు నేల మీద జరిగిన ఎన్నో రకాల సాంఘిక, ఆర్థిక పరిణామాల కీలక మలుపుల్లో కరపత్ర రచయితగానో, సిద్ధాంత చర్చల్లోనో, అనువాదాలు చేయడం లోనో, ఏదో ఒక స్థానంలో నాలుగు దశాబ్దాలుగా ఆయన కృషి చేశాడు, ఇంకా చేస్తూనే ఉన్నాడు. సీనియర్ ఉద్యమ నాయకుల్ని ఎవరిని కదిలించినా అనిసెట్టి శాయికుమార్ నిజాయితీ, నిబద్ధతలను చెబుతారు. చరిత్రని, పోరాటాల్ని నిర్మొహమాటంగా అందించిన పుస్తకమిది. భాష, భావం, చారిత్రక ఆధారాలు, నిష్పాక్షిక ధోరణి, పరిపక్వ ఆలోచనలు నిండిన రచయిత కలం నుండి వెలువడిన ఈ రచన తప్పకుండా మేధోజీవులను ఆలోచింప చేస్తుందని, తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను. రచయిత అనిశెట్టి శాయికుమార్ కలం నుండి ఇలాంటి మరెన్నో రచనలు వెలువడాలని కోరుకుంటున్నాను. ❑




తియ్యని అబద్ధం




బోరుమనే..లా..!





బుల్డోజ్


కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**

Vol : 3 - Issue No : 1 October 2024


## కొత్త పుస్తకాల స్వీకారం










if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.